ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 04.11.2026 | సంపుటి:13 సంచిక:105 | పేజీలు:12 వెల:రూ.4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





నోట్ల కొరత దుష్ప్రచారం

పుకార్లు నమ్మొద్దు

ఆర్‌బీఐ ప్రకటన

న్యూఢిల్లీ(జనంసాక్షి):కొత్త రూ.10, రూ.20, రూ.50 కరెన్సీ నోట్ల కొరత ఏర్పడిందని, దీపావళికి ముందు ఈ నోట్లు అందుబాటులో ఉండవంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతోన్న ప్రచారాన్ని ఆర్‌బీఐ ఖండించింది. ఆ ప్రచారం అవాస్తవమని పేర్కొంది. ప్రజలు ఇలాంటి తప్పుడు కథనాలు విశ్వసించొద్దని కోరింది. చిన్న నోట్లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్‌బీఐ, పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించాయి. అక్టోబర్ 27వ తేదీన ఆర్‌బీఐ జారీ చేసినట్లుగా ఓ సర్క్యులర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే చిన్న నోట్ల

మిగతా 2లో..

మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ

ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం..

2లో

తుమ్మిడిహట్టిపై నిరంతరం సంప్రదింపులు జరపండి

ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి



- ఇప్పటికే జరిగిన ఒప్పందాలు, అంశాల పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలి
- మహారాష్ట్రలో ముంపు ప్రాంతాలకు పరిహారం చెల్లిస్తాం
- దీనిపై సర్వే చేయించుకున్నా అభ్యంతరం లేదు
- గతంలోనూ దీనిపై ప్రభుత్వంతో చర్చలు జరిగాయి
- ప్రాజెక్టుపై ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలి. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాం. అందుకోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతాం. భూముల ముంపుపైన మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా మాకు అభ్యంతరం లేదు. - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తుమ్మిడిహట్టి బ్యారేజ్ పైన మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని వారికి సూచించారు. ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలని సీఎం స్పష్టం చేశారు.జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మిడిహట్టి పైన అధికారులతో సమీక్ష జరిపారు. మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ఇతర అంశాలపైన అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామన్నారు. భూముల ముంపుపైన మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా తమకు అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు.ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, ఇరిగేషన్ ఈఎన్‌సీ (జనరల్) రమేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సర్వే చేయించుకున్నా అభ్యంతరం లేదు మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ఇతర అంశాలపై

మిగతా 2లో..

అసలు దేశద్రోహి ఎవరో

తేల్చుకుందాం రండి

- ఆలస్యం చేయకండి.. త్వరగా చర్చకు రండి
- ఇప్పటికే 24 గంటలు గడిచిపోయాయి
- మోదీకి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ



మనమిద్దరం కలిసి చర్చకు కూర్చుందాం. అక్కడ మీడియాతో పాటు దేశ యువత కూడా ఉంటుంది. మీరు ఒక వైపు, నేను ఒక వైపు కూర్చుందాం. మీరు ఎవరిని న్యాయనిర్ణేతగా నియమించాలనుకుంటున్నారో వారిని తీసుకురండి. కావాలంటే మోహన్ భగవత్?ను ఆ కుర్చీలో కూర్చోబెట్టండి. ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది? ఎందుకు ఇంత వేగంగా జరిగింది? మీ రు ఒక్కరే ఎందుకు నిర్ణయం తీసుకున్నారు? క్యాబినెట్‌కు ఎందుకు చెప్పలేదు? అదానీ కేసును ఎందుకు మూసివేశారు? ఎప్‌స్టీయిన్ వ్యవహారం, ఇలాంటి అనేక అంశాలపై మనం బహిరంగంగా చర్చిద్దాం." - రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రతిపక్షాలు దేశద్రోహులంటూ బీజేపీ చేసిన ఆరోపణలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రాహుల్‌గాంధీ తెలిపారు. నిజమైన దేశద్రోహులు ఎవరో చర్చించుకుందామని మోదీకి సవాల్ విసిరారు.తనతో చర్చకు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సవాలు విసిరి 24 గంటలు గడిచిపోయాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రతిపక్షం దేశద్రోహి అని మోదీ ఆరోపించడంపై రాహుల్ మండిపడ్డారు. 'అసలు దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఆ సంబంధాలు ఎలాంటివి? ఆలస్యం చేయకండి, త్వరగా చర్చకు రండి, భయపడకండి' అని మోదీకి సవాల్ విసిరారు. ఏ వేదికైనా, ఏ సమయమైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రాహుల్ పేర్కొన్నారు.మీడియా, యువత సమక్షంలో ఒకే వేదికపై మాట్లాడుకుందామన్న రాహుల్, ఈ చర్చలో వ్యాఖ్యతగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను కూర్చోబెట్టినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవస్థ,

మిగతా 2లో..

మెప్మా అదనపు డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు..



యాదగిరిరావు నివాసంలో భారీగా అక్రమ ఆస్తుల గుర్తింపు

మెప్మా అదనపు డైరెక్టర్ యాదగిరిరావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు న మోదైంది. అక్రమ మార్గాల్లో యాదగిరిరావు భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ అధికారులు తనిఖీల్లో గు ర్తించారు. హైదరాబాద్, సూర్యాపేటలోని ఇళ్లు, కార్యాల యాలు, బ్యాంకు లాకర్లతో పాటు 10 ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు రూ.4.75 కోట్ల విలువైన ఆస్తుల ను గుర్తించారు.

పేజీ 3 లో

అమెరికాలో మధ్యంతర ఎన్నికల

పోలింగ్ ప్రారంభం


తొలి గంటలోనే పెద్దఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు





వాషింగ్టన్ (జనంసాక్షి):అగ్రరాజ్యం అమెరికాలో మధ్యంతర ఎన్నికల పోలింగ్ మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, మైన్, కెంటకీ, వెర్మాంట్, న్యూహ్యాంప్‌షైర్, ఇండియానా, కనెక్టికట్ రాష్ట్రాల్లో స్థానిక కాల మానం ప్రకారం ఉదయం 6 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. తొలి గంటల్లోనే ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. పోలింగ్ సమయం ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వారిని కాంగ్రెషనల్ జిల్లాలు ఎన్నుకుంటాయి. సెనెట్‌లో 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు పలు రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్ర చట్టసభ సభ్యుల పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయి. దాదాపు 21 కోట్ల మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకో నున్నారు అమెరికాలో ద్రవ్యోల్బణ భయాలు, ఇరాన్‌తో యుద్ధం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నట్లు అత్యధిక

మిగతా 2లో..



నకిలీ కరెన్సీ దందా!

- రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు!
- రూ.6.78 కోట్ల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం
- కుంట్లూరులో అద్దె ఇంట్లోనే నకిలీ నోట్ల తయారీ కేంద్రం
- నలుగురు అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ
- దమ్మీ తుపాకులు, వాకీటాకీలు, నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు స్వాధీనం



2లో

'సర్'లో పేరు లేకుంటే.. మళ్లీ 'ఫారం-6' ఇవ్వచ్చు

వివాదం వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన



హైదరాబాద్(జనంసాక్షి):ఓటరు నమోదుకు సంబంధించి ఫారం-6 దరఖాస్తుపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక విషయం వెల్లడించింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పాత ఓటర్లుగా ఉన్నప్పటికీ మళ్లీ ఫారం-6 సమర్పించినా నేరం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల సీఈవోలకు లేఖ రాసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటు కోల్పోయిన వారు కొత్తగా ఫారం-6 సమర్పించవచ్చని ఈసీ పేర్కొంది. అందులోని 'మొదటిసారి ఓటు' అనే డిక్లరేషన్‌పై పాత ఓటర్లు భయపడాల్సిన అవసరం లేదని తెలిపింది. పాత ఓటర్లు ఈ ఫారంతో దరఖాస్తు చేసినా.. సెక్షన్ 31 కింద కేసులు నమోదు చేయవద్దని సీఈవోలకు స్పష్టం చేసింది. అయితే, సంబంధిత ఓటరుకు మరో నియోజకవర్గంలో ఓటు ఉండకూడదని పేర్కొంది.



తీరం దాటిన 'మురాసు'..

- ఏపీలో గంటకు 120 కి.మీ. వేగంతో ఈదురుగాలులు.. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

అమరావతి(జనంసాక్షి):తీవ్ర తుపాను 'మురాసు' ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. నెల్లూరు, నర్సాపూర్ మధ్య ఒంగోలుకు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 5.30 గంటల మధ్య తీరాన్ని తాకినట్టు

మిగతా 2లో..

అత్యుత్తమ విద్యాసంస్థ.. ఢిల్లీ ఐఐటీ

ఆసియా టాప్- 100 వర్సిటీల్లో ఐఐఎస్‌సీ బెంగళూరు, 5 ఐఐటీలు.. కానీ పడిపోయిన ర్యాంకులు!

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో బెంగళూరు ఐఐఎస్‌సీతో పాటుగా మరో ఐదు ఐఐటీలు టాప్- 100 లో నిలిచాయి. అయితే గతేడాదితో పోలిస్తే ర్యాంకులు పడిపోయాయి.అంతర్జాతీయ

మిగతా 2లో..



ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో


కూటమి హవా

ప్రతికూల పరిస్థితుల్లోనూ పోరాడిన వైఎస్సార్‌సీపీ

అమరావతి(జనంసాక్షి):ఏపీలో జరిగిన పుర పోరులో కూటమి అభ్యరులు సత్తా చాటారు. జగన్ సొంత నియోజకవర్గం కడప జిల్లా పులివెందులలోనూ తెదేపా జెండా రెపరెపలాడింది. కూటమి మేయర్ అభ్యర్థులు.. తిరుపతిలో మన్నె శ్రీనివాస ప్రసాద్, చిత్తూరులో కఠారి హేమలత, గుంటూరులో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, మచిలీపట్నంలో షేక్ అబ్దుల్లా అబీదా, నెల్లూరులో రూప్ కుమార్ యాదవ్, విశాఖలో ముక్కా శ్రావణి, ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు, కర్నూలులో ప్రత్యూష ఘన విజయం సాధించారు. ఇప్పటి వరకు వెలువడిన

మిగతా 2లో..





యథేచ్ఛగా సుప్రీం ఆదేశాల ధిక్కరణ

- ఢిల్లీలో అన్ని రకాల బాణసంచా విక్రయాలు
- పరిశీలించాలని కేంద్రానికి ధర్మాసనం ఆదేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దీపావళి సందర్భంగా దిల్లీలో ఈ నెల 7,8 తేదీల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గ్రీన్ క్రాకర్స్ మాత్రమే కాల్చుకోవడానికి సోమవారం సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. అయితే, కోర్టు ఆదేశాలను ధిక్కరించి.. కొందరు వ్యాపారులు దేశ రాజధానిలో అన్ని రకాల బాణసంచా విక్రయిస్తున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. వీటి గురించి మాట్లాడుతూ.. మంగళవారం న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. 'ఈ రోజు మీడియాలో ఒక ఫొటో వచ్చింది. గ్రీన్ క్రాకర్స్ మాత్రమే కాల్చాలని నిన్న మేం ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. మార్కెట్లో లైసెన్స్ ఉన్నవి, లేనివి, క్యూఆర్ కోడ్ లేనివి.. ఇలా అన్ని రకాలు దొరుకుతున్నాయని అందులో పేర్కొన్నారు. ఆ టపాసుల సంగతేంటో చూడండి' అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో కాలుష్యాన్ని అరికట్టే ఉద్దేశంతో తాము బాణసంచాపై పరిమితులు విధించామని సుప్రీం కోర్టు పేర్కొంది. కానీ, క్షేత్రస్థాయిలో అవి సరిగ్గా అమలు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. ఈ విధంగా అన్ని రకాల టపాసులు కాల్చితే దేశరాజధానిలో కాలుష్య సమస్య కచ్చితంగా తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. మతపరమైన అంశాలతో ముడిపడి ఉన్న ఆచారాలను పాటించే హక్కు వ్యక్తులకు ఉంటుందని

మిగతా 2లో..

నిరసనలంటూ ప్రదేశాన్ని ఆక్రమించుకోవడం సరికాదు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

2లో

వందలాది చిన్న పట్టణాలను

అభివృద్ధి కేంద్రాలుగా మార్చాలి

ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ(జనంసాక్షి):మన దేశంలోని వందలాది చిన్న పట్టణాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాలు కేవలం నివసించే ప్రదేశాలు మాత్రమే కాదని, దేశ ఆర్థిక కార్యకలాపాలకు అవి ప్రధాన కేంద్రాలని ఆయన నొక్కి చెప్పారు. రూ.21,800 కోట్లతో నిర్మించిన పుణె మెట్రో ప్రాజెక్టును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పింక్ లైన్ అని పిలిచే పూణె మెట్రో లైన్?3ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగానే ఆయన పట్టణాభివృద్ధి గురించి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా పాల్గొన్నారు. "మన పట్టణాలు కేవలం నివసించే ప్రదేశాలు మాత్రమే కాదు. అవి దేశ ఆర్థిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రాలు. మనం

మిగతా 2లో..

రామ మందిరం విరాళాల చోరీ కేసు

సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి

- యూపీ ప్రభుత్వం నీరుగార్చే యత్నం జరుగుతోంది
- కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాల చోరీ కేసులో బీజేపీ నేతృత్వంలోని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ మండిపడింది. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ పూర్తయిందని, 8 మందిపై ఛార్జ్ షీట్ దాఖలు చేశామని ప్రభుత్వం ప్రకటిం చడాన్ని ప్రశ్నించింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఆలయ ట్రస్టులో కీలక బాధ్యతలు

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04.11.2026

తీరం దాటిన 'మురాసు'..

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఆ సమయంలో గంటకు 100?110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు నమోదయ్యాయని తెలిపింది. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయానికి తుపాను ఒంగోలు సమీపంలో దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నట్టు ఐఎండీ పేర్కొంది. ఇది గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్నదని వివరించింది. బాపట్లకు నైరుతి దిశలో 40 కిలోమీటర్లు, కావలికి ఉత్తర ఈశాన్య దిశలో 80 కిలోమీటర్లు, మచిలీపట్నానికి పశ్చిమ నైరుతి దిశలో 120 కిలోమీటర్లు, నెల్లూరుకు ఉత్తరంగా 130 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రం ఉన్నట్టు వెల్లడించింది. మురాసు తుపాను ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలహీనపడుతుందని ఐఎండీ అంచనా వేసింది. మంగళవారం మధ్యాహ్నానికి తీవ్ర తుపాను స్థాయి నుంచి తుపానుగా మారుతుందని తెలిపింది. ఆ సమయంలో గంటకు 80?90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. అర్ధరాత్రి సమయానికి మరింత బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారుతుందని అంచనా వేసింది. అప్పుడు గంటకు 55?65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా 75 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.ఒంగోలులోనూ తుపాను ప్రభావం స్పష్టంగా కనిపించింది. బలమైన ఈదురుగాలులకు చెట్లు వంగిపోయాయి. భారీ వర్షంతో జనజీవనం ప్రభావితమైంది. మచిలీపట్నం, విశాఖపట్నంలోని డాప్లర్ వాతావరణ రాడార్ల ద్వారా తుపానును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు ఐఎండీ వెల్లడించింది.

తుమ్మిడిహట్టిపై నిరంతరం
సంప్రదింపులు జరపండి

అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామని చెప్పారు. భూముల ముంపుపై మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా తమకు అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గతంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణమే అజెండాగా ముంబయిలో గత నెల 26న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి



సమావేశమయ్యారు. ఈ భేటీలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ప్రాధాన్యతను, కలిగే లాభాలను మహారాష్ట్ర సీఎంకు వివరించారు. భేటీ తరువాత పూర్తి స్థాయి నీటిమట్టం 148 మీటర్ల వరకే అని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని పునః సమీక్షించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.అయితే రేవంత్ సర్కార్ నిర్మాణం 152 మీటర్ల ఎత్తు వరకు ఉండాలని కోరుకుంటున్నారు. అయితే దీనికి మహా సర్కార్ గతంలోనే నిరాకరించింది. 148 మీటర్ల వరకు అయితే పునరాలోచిస్తామని భేటీలో ఆ రాష్ట్ర సీఎం హామీ ఇచ్చారు. జలాశయం నిర్మాణం వలన మహారాష్ట్రలో మునిగిపోయే ప్రాంతాల రైతులకు పరిహారం అందించేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు సర్వే చేసేందుకు ఓ కమిటీని నియమించారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో
కూటమి హవా

ఫలితాల్లో నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే వైకాపా గెలుపొందింది. ఆదోనిలో జనసేన రెబల్ స్వప్న విజయం సాధించారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. నర్సీపట్నం, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, పెద్దాపురం, కొవ్వూరు, మండపేట, ఆకివీడు, పిఠాపురం, నూజివీడు, జగ్గయ్యపేట, జంగారెడ్డిగూడెం, ఉయ్యూరు, నందిగామ, జగ్గయ్యపేట, కొండపల్లి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రేపల్లె, కనిగిరి, ఆత్మకూరు(నెల్లూరు), ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు(నంద్యాల), కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, పెనుకొండ, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, మదనపల్లి, పుంగనూరు, రాయచోటి, వెంకటగిరి, సూళ్లూరుపేట, పలమనేరు, కుప్పం, నగరి, పులివెందుల, బొబ్బిలి, మాచర్ల, బుచ్చిరెడ్డిపాలెం, కళ్యాణదుర్గం, డోన్, హిందూపురంలలో తేదేపా గెలిచింది.

జనసేన: గొల్లప్రోలు, తుని, సామర్లకోట, పిఠాపురం, ముమ్ముడివరం, అమలాపురం, నిడదవోలు, నర్సాపూర్, పెడన, తిరువూరు, తెనాలి, దర్శి, మడకశిర, పుట్టపర్తి, మడకశిర, పాలకొండ

భాజపా: గూడూరు(కర్నూలు), ఎర్రగుంట్ల, ఎలమంచిలి

యథేచ్ఛగా సుప్రీం ఆదేశాల ధిక్కరణ

పేర్కొంది. అది రాజ్యాంగపరమైన ఆంక్షలను అతిక్రమించ కూడదని హెచ్చరించింది. ఇదీ చదవండి: దీపావళి వేళ.. దిల్లీలో గ్రీన్ క్రాకర్స్‌కు 'సుప్రీం' అనుమతి

నకిలీ కరెన్సీ దందా!

- రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు!
- రూ.6.78 కోట్ల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం
- కుంట్లూరులో అద్దె ఇంట్లోనే నకిలీ నోట్ల తయారీ కేంద్రం
- నలుగురు అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ
- డమ్మీ తుపాకులు, వాకీటాకీలు, నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్ (జనంసాక్షి):హైదరాబాద్ నగర శివారులో భారీ నకిలీ కరెన్సీ తయారీ ముఠా గుట్టురట్టయింది. దేశ ఆర్థిక వ్యవస్థకు సవాల్‌గా మారే విధంగా కోట్లాది రూపాయల విలువైన నకిలీ కరెన్సీని ముద్రించి, మార్కెట్‌లో చలామణి చేసేందుకు పథకం రచించిన ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. ఈ కేసులో రూ.6 కోట్ల 78 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

వాహన తనిఖీలతో బయటపడిన నకిలీ నోట్ల బాగోతం

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ 1వ తేదీ రాత్రి నకిలీ కరెన్సీని విజయవాడకు తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఫ్యూచర్ సిటీ పోలీసుల ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, ఎస్ఓటీ షాద్‌నగర్ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగాయి. రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రధాన గేటు ఎదురుగా ఉన్న బాలాజీ ధాబా సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన మారుతి డిజైర్ కారును ఆపి తనిఖీ చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కారులోని బూడిద రంగు బ్యాగులో పెద్ద మొత్తంలో రూ.500 నకిలీ నోట్ల కట్టలు బయటపడ్డాయి.



దీంతో అప్రమత్తమైన పోలీసులు కారులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా భారీ నకిలీ కరెన్సీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నకిలీ నోట్లతో పాటు డమ్మీ పిస్టల్, వాకీటాకీలు, నకిలీ పోలీసు గుర్తింపు కార్డులను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుంట్లూరులో అద్దె ఇంట్లో నకిలీ నోట్ల తయారీ కేంద్రం పోలీసుల ప్రాథమిక విచారణలో మరిన్ని విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. హయత్‌నగర్ మండలం కుంట్లూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, దానినే నకిలీ కరెన్సీ తయారీ కేంద్రంగా మార్చుకున్నట్లు గుర్తించారు. బయటకు సాధారణ నివాస గృహంలా కనిపించే ఆ ఇంట్లోనే నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడైంది.కలర్ ప్రింటర్లు, స్కానర్లు, ల్యాప్‌టాప్‌లు, లామినేషన్ యంత్రాలు తదితర సామగ్రిని ఉపయోగించి నకిలీ కరెన్సీ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న వీడియోలు, సామాజిక మాధ్యమాల సమాచారాన్ని ఉపయోగించుకుని ఫొటోషాప్ ద్వారా అసలు రూ.500 నోట్ల చిత్రాలను ఎడిట్ చేసి నకిలీ నోట్లు తయారు చేయడం నేర్చుకున్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు.

నకిలీ పోలీసుల అవతారంలో మరో మోసం!

ఈ ముఠా కేవలం నకిలీ కరెన్సీ తయారీకే పరిమితం కాలేదు. నకిలీ నోట్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతూ తమను సంప్రదించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని మరో మోసానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. తాము పోలీసులమంటూ నకిలీ గుర్తింపు కార్డులు చూపించడం, వాకీటాకీలు, డమ్మీ తుపాకులతో బెదిరించడం ద్వారా వారి వద్ద ఉన్న అసలు నగదును కాజేసినట్లు విచారణలో గుర్తించారు.ఈ విధంగా ఇద్దరు వ్యక్తుల నుంచి ఇప్పటికే రూ.2 లక్షలు, రూ.3 లక్షల చొప్పున వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ కరెన్సీ కొనుగోలు చేయాలనే ఆశతో వచ్చిన వారినే లక్ష్యంగా చేసుకుని అసలు డబ్బును దోచుకోవడం ఈ ముఠా మోసపూరిత కార్యకలాపాలకు నిదర్శనంగా నిలుస్తోంది.ఈ ఆపరేషన్‌లో మొత్తం రూ.6.78 కోట్ల విలువైన నకిలీ కరెన్సీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు కలర్ ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, కరెన్సీ కటింగ్ యంత్రం, లామినేషన్ యంత్రం, ఇంక్ బాటిళ్లు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

ముఠా వెనుక ఉన్నది ఎవరు?

కేవలం నలుగురి అరెస్టుతోనే ఈ వ్యవహారం ముగిసిపోలేదని భావిస్తున్న పోలీసులు, పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు చేపట్టారు. ఈ నకిలీ కరెన్సీ తయారీ, సరఫరా వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? ఇతర ప్రాంతాలకు కూడా ఈ నకిలీ నోట్లు సరఫరా చేశారా? ఇప్పటివరకు ఎంత మొత్తంలో నకిలీ కరెన్సీ చలామణిలోకి వెళ్లింది? ఈ ముఠాకు ఆర్థిక సహకారం అందించిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి పర్యవేక్షణలో మహేశ్వరం డీసీపీ కె. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈ కేసును ఛేదించారు. నగర శివారులో ఇంత భారీ స్థాయిలో నకిలీ కరెన్సీ తయారీ కేంద్రం బయటపడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కరెన్సీ లావాదేవీలు లేదా వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

అత్యుత్తమ విద్యాసంస్థ.. ఢిల్లీ ఐఐటీ

యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో భారత ఉన్నత విద్యా సంస్థలు మరోసారి సత్తా చాటాయి. లండన్‌కు చెందిన ప్రసిద్ధ సంస్థ క్వాక్వారెల్లీ సైమండ్స్ మంగళవారం రోజు ఆసియాలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాను విడుదల చేసింది. ఇందులో టాప్-100లో భారతదేశం నుంచి ఐఐఎస్‌సీ బెంగళూరుతో పాటు ఐదు ఐఐటీలు మరోసారి చోటు దక్కించుకున్నాయి. అయితే వీటిల్లో ఏ ఒక్కటీ గతేడాదితో పోలిస్తే తమ స్థానాల్ని మెరుగుపర్చుకోలేకపోయాయి. అంటే గతేడాది కంటే దిగువ స్థానాలకు పడిపోయాయి. ఇందులో భారత్ నుంచి భారత్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన విద్యా సంస్థగా ఐఐటీ దిల్లీ నిలిచింది. ఆసియా మొత్తంలో ఇది 66వ స్థానంలో నిలిచింది. గతేడాది 59 వ ర్యాంకులో ఉండగా ఈసారి 7 స్థానాలు దిగజారింది.అయితే ఈసారి ర్యాంకింగ్స్‌లో భారతీయ విశ్వవిద్యాలయాల ప్రాతినిధ్యం పెరిగింది. మొత్తంగా ఈసారి 325 భారతీయ యూనివర్సిటీలో జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇందులో 34 సంస్థలు తొలిసారి క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించాయి. దీంతో ర్యాంకింగ్స్‌లో అత్యధిక విశ్వవిద్యాలయాల ప్రాతినిధ్యం కలిగిన రెండో దేశంగా భారత్ నిలిచింది. చైనా తొలి స్థానంలో ఉంది. టాప్- 200 లో కూడా భారతీయ వర్సిటీల సంఖ్య గతంతో పోలిస్తే పెరిగింది. కిందటేడాది టాప్ 200 జాబితాలో 20 విశ్వవిద్యాలయాలు ఈ జాబితాలో నిలవగా, ఈసారి ఆ సంఖ్య 21కి పెరిగింది. 2018లో టాప్-200 వర్సిటీల లిస్టులో భారత విద్యా సంస్థలు 17 మాత్రమే ఉన్నాయి. అక్కడి నుంచి భారత్ క్రమంగా తన సంఖ్యను పెంచుకుంటూ వస్తోంది. ఈ జాబితాలో భారత్‌లోని అన్ని ప్రముఖ విద్యా సంస్థలు ఈసారి ర్యాంకింగ్స్‌లో వెనుకబడ్డాయి. ఐఐటీ దిల్లీ 7 స్థానాల్ని కోల్పోగా, ఇతర ఐఐటీలు, ప్రముఖ విద్యా సంస్థలు కూడా ఇదే బాటలో పయనించాయి. గతేడాది జాబితాలో 64వ స్థానంలో ఉన్న ఐఐఎస్‌సీ బెంగళూరు ఈసారి ఏకంగా 15 స్థానాల్ని కోల్పోయి 79వ ర్యాంకుకు పడిపోయింది. మరోవైపు ఐఐటీ బాంబే కూడా 71వ స్థానం నుంచి 83వ స్థానానికి దిగజారింది. గతేడాది 70వ స్థానంలో నిలిచిన ఐఐటీ మద్రాస్ ఈసారి 85వ స్థానానికి పడిపోయింది. ఈసారి ఐఐటీ బాంబే- ఐఐటీ మద్రాస్‌ను దాటేసి ఉత్తమ వర్సిటీల్లో ముందంజలో నిలిచింది. ఇక ఐఐటీ ఖరగ్‌పూర్ గతేడాది 77వ ర్యాంకులో ఉండగా, ఇప్పుడు 90వ స్థానానికి పడిపోయింది. ఐఐటీ కాన్పూర్ కూడా 20వ స్థానాలు కోల్పోయింది. గతేడాది ఇది 77వ ర్యాంకులో ఉండగా ఇప్పుడు 97 కు పడిపోవడం గమనార్హం. ఇలా టాప్- 100లో నిలిచిన అన్ని భారత విద్యా సంస్థలు తమ ర్యాంకుల్ని కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇంకా గతేడాది 95వ స్థానంతో టాప్-100 జాబితాలో ఉన్న దిల్లీ యూనివర్సిటీ ఇప్పుడు 106వ ర్యాంకుకు పడిపోయింది. మరోవైపు చండీగఢ్ యూనివర్సిటీ, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా వంటి భారతీయ విద్యా సంస్థలు తమ ర్యాంకుల్ని మెరుగుపర్చుకున్నాయి.

అసలు దేశద్రోహి ఎవరో
తేల్చుకుందాం రండి

అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు, క్యాబినెట్‌కు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, అదానీ కేసులను మూసివేయడం, ఎప్‌స్టీన్ అంశాలపై బహిరంగంగా చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అసలు నిజాలు ఏంటో ప్రజల ముందు బయటపెడతానని రాహుల్ గాంధీ వెల్లడించారు.మనమిద్దరం కలిసి చర్చకు కూర్చుందాం. అక్కడ మీడియాతో పాటు దేశ యువత కూడా ఉంటుంది. మీరు ఒక వైపు, నేను ఒక వైపు కూర్చుందాం. మీరు ఎవరిని న్యాయనిర్ణేతగా నియమించాలనుకుంటున్నారో వారిని తీసుకురండి. కావాలంటే మోహన్ భగవత్?ను ఆ కుర్చీలో కూర్చోబెట్టండి. ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో ఒప్పందం ఎలా జరిగింది? ఎందుకు ఇంత వేగంగా జరిగింది? మీరు ఒక్కరే ఎందుకు నిర్ణయం తీసుకున్నారు? క్యాబినెట్‌కు ఎందుకు చెప్పలేదు? అదానీ కేసును ఎందుకు మూసివేశారు? ఎప్‌స్టైయిన్ వ్యవహారం, ఇలాంటి అనేక అంశాలపై మనం బహిరంగంగా చర్చిద్దాం." అని అన్నారు.

పరువు నష్టం దావా ఎందుకు వేయడం లేదు?

తనపై చేస్తున్న ఆరోపణలపై కూడా రాహుల్ ఎక్స్ పోస్టులో ప్రస్తావించారు. "నాపై ఆరోపణలు చేస్తున్నారు కదా.. రండి వాటి గురించి కూడా మాట్లాడుదాం. బహుశా నాపై సుమారు 45 పరువు నష్టం దావాలు ఉన్నాయి. కానీ, ఈ చర్చా అంశంపై, విదేశీ సంబంధాల విషయంలో మాత్రం మీరు ఎందుకు పరువు నష్టం దావా వేయడం లేదు? వేయండి చూద్దాం, దానిపై కూడా బహిరంగంగా చర్చిద్దాం" అని రాహుల్ గాంధీ మోదీకి సవాల్ విసిరారు. విదేశీ సహాయంతో మోదీ ప్రధానమంత్రి అయ్యారని, భారతదేశ ఆర్థిక వ్యవస్థ విదేశీ శక్తుల నియంత్రణలో, మద్దతుతో ఉందని రాహుల్ గాంధీ ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ కొత్త సవాలు తలెత్తింది. అంతకుముందు, రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో చేసిన పోస్టులో, "మోదీ, ఈ దేశానికి అబద్ధాలు చెప్పడం ఆపండి. మీరు విదేశీ సహాయం వల్లే ప్రధాని అయ్యారు. విదేశీ సహాయం వల్లే ప్రధానిగా కొనసాగుతున్నారు. మీ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విదేశీయుల నియంత్రణలో, మద్దతుతో ఉంది. విదేశీ సోషల్ మీడియా మీకు పూర్తి మద్దతు ఇస్తోంది" అని పేర్కొన్నారు.

మోదీ ఏమన్నారంటే?

ఇదిలా ఉండగా, ఇటీవల గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జరిగిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో పాల్గొన్న మోదీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షం తమ ప్రజాస్వామ్య పాత్రను నిర్వర్తించకుండా అడ్డంకులు సృష్టించే శక్తిగా మారిందని వ్యాఖ్యానించారు. దేశాన్ని విభజించడానికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు.

అమెరికాలో మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభం

సర్వేలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. డెమోక్రాట్లు ఆధిక్యం సాధిస్తే.. చట్టసభల్లో అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలను అడ్డుకునేందుకు వీలు లభిస్తుంది. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనకు రెఫరెండంగా భావిస్తున్న మధ్యంతర ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. అనేక రాష్ట్రాల్లో మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఇప్పటికే పూర్తైన ముందస్తు పోలింగ్‌లో ఓటింగ్ శాతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మధ్యంతర ఎన్నికలకు సంబంధించి మరికొన్ని విషయాలను పరిశీలిస్తే.. అమెరికాలో ఎన్నికల నిర్వహణ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుంది. భారత్‌లో మాదిరిగా కేంద్ర ఎన్నికల సంఘం ఉండదు. 50 రాష్ట్రాల్లో.. వేర్వేరు ఎన్నికల చట్టాలు ఉంటాయి. ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్ వ్యవహారాలన్నీ రాష్ట్రాలే చూసుకుంటాయి.బ్యాలెట్ పద్ధతిలోనే పోలింగ్ జరుగుతుంది. అమెరికా పౌరసత్వం ఉన్నవారే ఓటు వేయాల్సి ఉంటుంది. నమోదిత ఓటర్లు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుంది. కొన్ని రాష్ట్రాలు ముందస్తు ఓటింగ్‌కు అనుమతిస్తాయి.ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలు, సెనెట్‌లో 35 స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. వీటితోపాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్లు, స్థానిక మేయర్, కౌన్సిల్, అటార్నీ జనరల్.. తదితర పదవులకూ పోలింగ్ జరుగుతోంది. సాధారణంగా వీటన్నింటికీ ఒకే బ్యాలెట్ రూపొందిస్తారు. ఇందులో అభ్యర్థుల వివరాలే కాకుండా అబార్షన్ హక్కులు, ఓటరు కార్డు, వలసలు.. తదితర స్థానిక సమస్యలకు సంబంధించి అభిప్రాయాలను బ్యాలెట్ ద్వారా సేకరిస్తారు. ఓటర్లకు నచ్చిన అంశాలపై మార్కు చేసి తమ అభిప్రాయాన్ని వెల్లడించవచ్చు.పేపర్ బ్యాలెట్‌లో పెన్ను/పెన్సిల్‌తో మార్క్ చేయాల్సి ఉంటుంది. కొన్ని చోట్ల బ్యాలెట్ మార్కింగ్ కోసం ఎలక్ట్రానిక్ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తారు. వాటిలో బ్యాలెట్‌ను పూర్తిచేసి.. ఆ ప్రింట్‌ను డ్రాప్ బాక్సులో వేయాలి.వ్యక్తిగతంగా ఓటు వేయలేని వారు మెయిల్-ఇన్ ద్వారా వేయవచ్చు. దీన్నే ఆబ్సెంటీ బ్యాలెట్‌గా వ్యవహరిస్తారు. విదేశాల్లో ఉండటం, వైకల్యం, వృద్ధాప్యం తదితర కారణాలతో ఈ ఓటింగ్‌కు అనుమతిస్తారు. కొన్ని రాష్ట్రాలు అందరికీ ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి.ఈసారి భారీగా ముందస్తు పోలింగ్ నమోదైనట్లు సమాచారం. దేశవ్యాప్తంగా దాదాపు 21 కోట్ల మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనుండగా.. పోలింగ్ డేకు రెండు రోజుల ముందు వరకే 5.5 కోట్ల మంది ఓటు వేసినట్లు నివేదికలు వెల్లడించాయి.ఎలక్షన్ డే రోజు పోలింగ్ సమయం పూర్తైన తర్వాత కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. బ్యాలెట్‌లను మాన్యువల్ లేదా స్కానర్ల సాయంతో లెక్కిస్తారు. మెయిల్ ద్వారా వచ్చిన బ్యాలెట్లను ముందుగానే ప్రాసెస్ చేసి ఉంచినప్పటికీ.. పోలింగ్ ముగిసిన తర్వాతే వీటన్నింటి ఫలితాలను ప్రాంతీయ ఎన్నికల అధికారులకు చేరవేస్తారు.పూర్తి ఫలితాలు అధికారికంగా వెల్లడయ్యేందుకు కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. అయితే, ఈలోగా అసోసియేటెడ్ ప్రెస్ వంటి వార్తా సంస్థలు ఫలితాలను వెల్లడిస్తుంటాయి. స్థానిక పోలింగ్ కేంద్రాలు, స్థానిక మీడియా సంస్థల నుంచి వచ్చే సమాచారాన్ని క్రోడీకరించి వీటిని ప్రకటిస్తుంటాయి.

వందలాది చిన్న పట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చాలి


వందలాది చిన్న పట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చాల్సిన అవసరం ఉంది. ఈ దార్శనికతను మనస్సులో ఉంచుకునే ఈ ఏడాది అర్బన్? ఛాలెంజ్ ఫండ్?ను ఆమోదించాం. ఈ ఫండ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1 లక్ష కోట్ల నిధులను అందిస్తోంది. రానున్న సంవత్సరాల్లో దేశంలోని పట్టణాలకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే దీని లక్ష్యం. ఇందుకోసం స్థానిక సంస్థలు, ప్రైవేటు రంగానికి చెందిన సహచరులు ముందుకు రావాలని నేను కోరుతున్నాను. మనమందరం ఒక మిషన్ మోడ్?లో కలిసి పనిచేయాలి." అని అన్నారు.

మెట్రోతో ప్రాంతాల మధ్య అనుసంధానం

కొత్తగా ప్రారంభించిన మెట్రో ప్రాజెక్టుల వల్ల పుణెలోని కొత్త, పాత ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. "పుణె మెట్రోలో మరొక లైన్ ఈ రోజు ప్రారంభం కావడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. పదేళ్ల క్రితం, పుణెలో ఈ ప్రాజెక్టు మొదటి దశకు శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. హింజావాడి, శివాజీనగర్ మధ్య మెట్రో సేవలు ప్రారంభం కావడంతో, పుణెలోని ఒక ప్రధాన ఐటీ హబ్?కు ఇప్పుడు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుంది. ఈ రోజు పనులు ప్రారంభమైన కొత్త లైన్, పుణె పాత, కొత్త ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మరింత పటిష్టం చేస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. భారతదేశం అభివృద్ధిలో పుణె పాత్రను హైలెట్ చేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మహానగరం ఐటీ, ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్స్, స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగాలకు కేంద్రంగా ఎదుగుతోందని అన్నారు. "ఈ రోజు పుణె నగరం వికసిత్ భారత్ శక్తిని చాటుతోంది. ఐటీ, ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్స్ నుంచి స్టార్టప్స్, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగం వరకు అన్ని రంగాలకు కేంద్రంగా ఎదుగుతోంది. పుణె మన దేశ యువత కలలు, ఆకాంక్షల వేదిక. స్థానిక మెట్రో కనెక్టివిటీ బలోపేతం కావడం పుణె నగరాభివృద్ధికి సరికొత్త వేగాన్ని అందించనుంది" అని మోదీ అన్నారు. మెట్రో లైన్ కోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య నమూనా ను అనుసరించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. "ఈ మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వ-ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో నిర్మించారు. ఇది దేశ పురోగతిని మరింత వేగవంతం చేసే విజయవంతమైన నమూనా. మిత్రులారా, ఈ రోజు భారతదేశంలోని ప్రతి పౌరుడు, యువతీ యువకులు వికసిత్ భారత్? నిర్మాణానికి పూర్తి అంకిత భావంతో పనిచేస్తున్నారు" అని అన్నారు.

మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ
ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం..

న్యూఢిల్లీ(జనంసాక్షి):దీపావళికి ముందే దిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు సగటు వాయు నాణ్యతా సూచీ 451కిపైగా నమోదవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రోహిణీలో 429, పంజాబీ బాగ్‌లో 424, బవానలో 408 ఏక్యూఐ నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లోనూ ఏక్యూఐ 360 దాటి గాలినాణ్యత వెరీ పూర్ కేటగిరీలో కొనసాగుతోంది. దీంతో వాయు నాణ్యతా నిర్వహణ కమిషన్ దిల్లీ-ఎన్‌సీఆర్ వ్యాప్తంగా ఆంక్షలను అమల్లోకి తెచ్చింది. దిల్లీ రహదారులపై మెకానికల్ స్వీపింగ్, నీళు చల్లడం వంటి చర్యలు చేపట్టారు.



సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి

నిర్వహించిన ఉన్నతాధికారుల పాత్రను పరిశీలించకుండానే కేసును ముగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని, ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రోజు ఆయన ఎక్స్‌లో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. పార్లమెంట్ స్పెషల్ సెషన్, నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. విరాళాల లెక్కలు, నగదు, ఇతర విలువైన వస్తువుల నిర్వహణలో వస్తున్న ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని జైరాం రమేష్ పేర్కొన్నారు. భక్తులు కోట్లాది రూపాయల విరాళాలు సమర్పించారని, వాటి భద్రత, లెక్కింపు, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించిన వారిపై కూడా విచారణ నిష్పాక్షికంగా జరగాలని డిమాండ్ చేశారు.

105 చోరీ ఘటనలు- రూ. 79.85 లక్షల రికవరీపై ప్రశ్నలు

కేవలం 45 రోజుల వ్యవధిలోనే సీసీటీవీ కెమెరాల్లో 105 చోరీ ఘటనలు నమోదయ్యాయని చెప్పిన జైరాం రమేష్- కేసులో ఇప్పటివరకు దాదాపు రూ. 79.85 లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. అయితే మొత్తం ఎంత నగదు చోరీకి గురైంది? ఇంకా ఎంత మొత్తం స్వాధీనం చేసుకోవాల్సి ఉంది? అనే వివరాల్ని ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని కోరారు. 105 ఘటనలకు సంబంధించిన ఫుటేజీ మాత్రమే అందుబాటులో ఉందా? మిగిలిన సీసీటీవీ రికార్డులు ఎక్కడ ఉన్నాయి? ఆ ఘటనలు ఏయే తేదీల్లో జరిగాయి? అనే ప్రశ్నల్ని కూడా లేవనెత్తారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లోని చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావును ఈ కేసులో సాక్షులుగా పేర్కొన్నట్లు ప్రస్తావించిన జైరాం రమేష్- సాక్షిగా ఉండటం, నిందితుడిగా ఉండటం మధ్య చాలా తేడా ఉందని వ్యాఖ్యానించారు. 2020 ఆడిట్ నివేదికలోనే విరాళాలు, ఆర్థిక నియంత్రణ వ్యవస్థలో లోపాలు ఉన్నట్లు ప్రస్తావించగా, ఆ అభ్యంతరాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో కూడా ఆలస్యం ఎందుకు జరిగిందని జైరాం రమేష్ ప్రశ్నించారు. జూన్ 4న రూ. 2.25 లక్షల నగదు స్వీకరించినట్లు చూపించే వీడియో అప్పటి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు చేరిందని, జూన్ 5న సీసీటీవీ ఫుటేజీని కూడా ఆయనకు చూపించినట్లు ఛార్జ్‌షీట్ వివరాలు సూచిస్తున్నాయని అన్నారు. అయితే ఎఫ్ఐఆర్ మాత్రం జూన్ 25న ఎందుకు నమోదైందని, మధ్యలో 21 రోజులు ఏం జరిగిందో ప్రభుత్వం వివరించాలని కోరారు.

మెప్మా అదనపు మిషన్ డైరెక్టర్
ఇంటిపై మెరుపు దాడులు

- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో రంగంలోకి దిగిన ఏసీబీ
- హైకోర్టు కాలనీలో డాక్టర్ ఎన్. యాదగిరిరావు నివాసంలో తెల్లవారుజాము నుంచే విస్తృత తనిఖీలు



ఉప్పల్, నవంబర్ 3 (జనం సాక్షి): ఉప్పల్ ప్రాంతంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన మెరుపు దాడులు స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) అదనపు మిషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. యాదగిరిరావుకు చెందిన నివాసంపై ఏసీబీ అధికారులు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఉప్పల్ పరిధిలోని హైకోర్టు కాలనీలో ఆయన నివాసం ఉంటున్న ఇంటిపై మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ బృందాలు సోదాలు ప్రారంభించాయి. ఉన్నత స్థాయి అధికారిపై ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడంతో ఈ విషయం ఉప్పల్ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.



బృందాలు

ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. ముందస్తు ప్రణాళికతో తనిఖీలకు సిద్ధమైన అధికారులు యాదగిరిరావు నివాసానికి చేరుకుని ఇంట్లోని వివిధ ప్రాంతాల్లో పరిశీలనలు చేపట్టినట్లు సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై సంబంధిత వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఇంట్లో లభించే ఆస్తుల పత్రాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, ఆదాయ వనరుల వివరాలను పరిశీలించే దిశగా తనిఖీలు కొనసాగుతున్నాయి.

తెల్లవారుజామునే రంగంలోకి ఏసీబీ

మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థుల ఆందోళన

- ల్యాబ్‌లు లేవు, హాస్టల్ కరువు
- సమస్యల వలయంలో వైద్య విద్య



రంగారెడ్డి నవంబర్ 3 (జనంసాక్షి): మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మౌలిక వసతుల లేమిని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. కళాశాల భవనం ఎదుట విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన బాట పట్టిన విద్యార్థులకు వారి కుటుంబ సభ్యులు కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. కనీస వసతులు లేని అద్దె భవనం నుండి కళాశాలను తక్షణమే హైదరాబాద్ నగరంలోని టిమ్స్ భవనానికి తరలించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. లక్షల రూపాయల వ్యయంతో వైద్య విద్యనభ్యసిస్తున్నామని, కానీ ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఎంతో కీలకమైనవన్నారు. కానీ కళాశాలలో సరైన ల్యాబ్‌లు, కెమికల్స్, పరికరాలు లేకపోవడంతో ప్రాక్టికల్ తరగతులు సరిగ్గా జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ విద్యార్థులకు ప్రాక్టికల్ క్లినికల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు అనుబంధంగా పెద్ద ఆసుపత్రి (హోల్డింగ్ హాస్పిటల్) లేకపోవడంతో రోగులను పరిశీలించే అవకాశం లేకుండా పోతోందని తెలిపారు..విద్యార్థులకు వసతి గృహం కూడా లేదన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ హాస్టల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలను నిర్వహిస్తున్న అద్దె భవనంలో తరగతి గదులు, లైబ్రరీ, రెస్ట్ రూమ్‌లు సరిపడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి మెడిసిన్ సీటు సాధిస్తే, ఇక్కడ కనీస మౌలిక వసతులు లేక తమ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి మహేశ్వరం మెడికల్ కాలేజీని హైదరాబాద్‌లోని టిమ్స్ భవనానికి తరలించి, మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని విద్యార్థులు స్పష్టం చేశారు. అనంతరం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో డీఎంఈని కలిసి విద్యార్థులు సమస్యలను వివరించారు. తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.



ఎమ్మెల్సీ ఓటర్ నమోదు గడువును పొడిగించాలి

- ఎన్నికల సంఘానికి టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు గడువును నవంబర్ 31 వరకు పొడగించాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేట్స్ ఓటరు నమోదు గడువు ఈ నెల 6వ తేదీతో ముగుస్తుందనీ, అయితే దసరా, దీపావళి పండగలు మధ్యలో రావడంతో చాలామంది అర్హులైన ఓటర్లు తమ పేర్లను పట్టభద్రుల ఓటరు జాబితాలో సకాలంలో నమోదు చేయించుకోలేకపోయారని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు సకాలంలో ఓటును నమోదు చేసుకోలేనందున వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువమంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు తుది గడువును నవంబర్ 31 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని శేర్ నర్సారెడ్డి కోరారు.



ప్రకృతి వైపరీత్యాలను రాజకీయాలు చేస్తారా?

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి (జనంసాక్షి) : ప్రకృతి వైపరీత్యాలను బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలకు వాడుకుంటున్నారు తప్ప... ప్రజలకు మేలు చేయడానికి ఎంత మాత్రం కాదు అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మెగా రెడ్డితో కలిసి మంత్రి మాట్లాడారు. ప్రకృతి పరంగా ఏర్పడిన సమస్యలను బీఆర్ఎస్ నాయకులు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. వనపర్తి జిల్లాలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్యపు ఆరోపణలు చేయడం విడ్డూరం అన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్ర ప్రాంతానికి తొత్తులుగా మారి 511 టీఎంసీల నీటిని ఆంధ్ర కి అప్పగించలేదా అని మంత్రి ప్రశ్నించారు. 2012 నుండి కల్వకుర్తిలో ఐదు మోటర్లు ఉన్నాయి... వాటిని అప్పట్లో మీరు ఎందుకు స్టార్ట్ చేసి నీళ్లు ఇవ్వలేదు.. అని మంత్రి అన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ వల్ల మోటార్లు మునిగి కాలిపోయాయి అని మంత్రి గుర్తు చేశారు. రైతుల కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నార్లాపూర్ నుండి లక్ష , కల్వకుర్తి ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి చెప్పారు . మరో మూడు నెలల వరకు ఏదుల రిజర్వాయర్ కు నీటిని ఇవ్వలేమని మంత్రి స్పష్టం చేశారు.. 60 వేల కోట్ల అంచనాలతో ప్రారంభించిన పాలమూరు.. రంగారెడ్డి కి కేవలం 25 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి అయ్యాయి అని మాజీ మంత్రి హరీష్ రావు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి కావాలి అంటే 80 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని మంత్రి చెప్పారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు కరువు మండలాలను ప్రకటించడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. హరీష్ రావు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వ్యక్తిగత ఇమేజ్ ను పెంచే తాపత్రయం చేశాడు తప్ప.. సమస్యల పరిష్కారం కోసం ఎంత మాత్రం కాదని మంత్రి వెల్లడించారు. నవంబర్ 4 అని చెప్పుకునే పెద్దమనిషికి వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ కూడా రాదు అని ఎమ్మెల్యే మెగా రెడ్డి అన్నారు. ప్రజల సంక్షేమం కోసం.. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా, వనపర్తి నియోజకవర్గ సమస్యలు తీరనున్నాయి.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె

- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి



కీసర, నవంబర్ 03 (జనంసాక్షి) : ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. మంగళవారం కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం రేవతి కళ్యాణి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది ఆశా వర్కర్లు రెండున్నర దశాబ్దాలుగా ప్రజారోగ్య సేవల్లో కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. గర్భిణుల సంరక్షణ, ప్రసవాలు, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణతోపాటు అంటువ్యాధుల నివారణలో నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆశాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కనీసం రూ.18 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతతోపాటు రూ.50 లక్షల బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సెలవులు, వైద్య సదుపాయాలు, ప్రసూతి సెలవులు, అర్హులకు పదోన్నతులు కల్పించాలని, అదనపు లక్ష్యాలు, స్టుటమ్ దబ్బాల తరలింపు పనులను రద్దు చేయాలని కోరారు. రెండో పీఆర్సీలో రూ.30 వేల కనీస వేతనం, రెండు డీఏలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. సమ్మెను నివారించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఆశా వర్కర్లంతా ఐక్యంగా ఉద్యమంలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఎంజీయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా డా.జి లక్ష్మీప్రభ నియామకం

- ఉత్తర్వులు అందజేసిన వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ (జనంసాక్షి) : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వసతి గృహాల సంచాలకురాలిగా వర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.లక్ష్మీ ప్రభ నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఉత్తర్వులను తన కార్యాలయంలో అందించారు.

బడిలో మద్యం సేవిస్తూ పట్టుబడ్డ హెడ్‌మాస్టర్



ఆదిలాబాద్ (జనంసాక్షి) : విద్యా బుద్ధులు నేర్పి పిల్లలకు ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయుడు తప్పుదారి పట్టాడు. ఏకంగా పాఠశాలలోనే మద్యం తాగుతూ పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గంభీరావుపేట ఎంపీయూపీఎస్ పాఠశాలలో హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ మద్యం సేవించి స్కూలుకు వస్తున్నాడని విద్యార్థులు అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గ్రామస్తులు హెడ్‌మాస్టర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఎంఈవోకు ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ.. ఒకరి అరెస్టు

- 229.2 తులాల బంగారం, 27 తులాల వెండి స్వాధీనం





అల్వాల్, నవంబరు 3 (జనంసాక్షి): గత శనివారం అల్వాల్ జానకీనగర్ లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో అల్వాల్ పోలీసులు ఓ నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి 29.2 తులాల బంగారం, 27 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కార్ఖానా ఏసీపీ రమేష్ తెలిపారు. గంటి సుబ్రమణ్యం కార్తీక్ కుటుంబంతో కలిసి అక్టోబరు 31న ఇంటికి తాళం వేసి దమ్మాయిగూడలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.1.20 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా నవంబరు 3న బేగంపేట బాలంరాయ్ ఎక్స్ రోడ్డు వద్ద నితిన్ ఫ్రాన్సిస్ అలియాస్ బబ్లూను అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు దార్ల నెహెమయ్య అలియాస్ బ్రూస్‌లీ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని ఏసీపీ వెల్లడించారు. ఈ కేసు ను డీసీపీ శ్రీధర్, ఏసీపీ రమేష్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఏ.ప్రశాంత్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఛేదించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు.

మేడిగడ్డ బ్యారేజ్ చెక్కుచెదరలేదు..
కాంగ్రెస్ అబద్దాల ప్రచారం బట్టబయలెంది

- వృథాగా పోతున్న గోదావరి జలాలను ఎత్తిపోసి ఎస్సారెస్పీ నిజాం సాగర్ ప్రాజెక్టులను నింపాలి
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్



మహాదేవపూర్, నవంబర్ 3 (జనంసాక్షి) : మేడిగడ్డ బ్యారేజ్ కొట్టుకుపోయిందని, కూలిపోయిందని కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తోన్న ప్రచారం పూర్తిగా పచ్చి అబద్ధమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను, రైతుల గోసను స్వయంగా చూసిన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మొదట కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్రాణహిత--గోదావరి సంగమ ప్రాంతాన్ని, సిరోంచ, కాళేశ్వరం మధ్య గోదావరి బ్రిడ్జ్ వద్ద ఉన్న నీటి ప్రవాహాన్ని, కన్నెపల్లి పంపహౌస్ ప్రాంతాన్ని పరిశీలించి తదనంతరం నేరుగా మేడిగడ్డ బ్యారేజీని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల బాజిరెడ్డి గోవర్ధన్ ,గణేష్ గుప్త, జీవన్ రెడ్డి, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జజాల సురేందర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్,తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ ముజీబుద్దీన్, విఠల్ రావు తో కలిసి ఆయన మేడిగడ్డ బరాజ్‌నుసందర్శించి నీటి ప్రవాహాన్ని పరిశీలన చేశారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మెడిగడ్డ బ్యారేజ్ వద్ద గోదావరి నీటి ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం బ్యారేజ్ పైకి వాహనాలు వెళ్లకుండా పోలీసు లు అడ్డుకోవడంతో కాసేపు వారితో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ వాగ్వివాదానికి దిగారు. వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజ్ మొత్తం 85 పిల్లర్లతో నిటారుగా చెక్కుచెదరకుండా నిలబడి ఉన్న వాస్తవాన్ని స్వయంగా మీడియా కెమెరాల సాక్షిగా ప్రజలందరూ గమనించవచ్చని పేర్కొన్నారు. గత మూడు వర్షాకాలాల్లో సంభవించిన భారీ వరదలు, లక్షలాది క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకొని నిలబడిన ఈ బ్యారేజీలో ఒక్క పిల్లర్ కూడా కొట్టుకుపోలేదని స్పష్టం చేశారు. కేవలం రెండు మూడు పిల్లర్లకు చిన్నపాటి మరమ్మతులు అవసరమైతే, వాటిని మూడేళ్లుగా బాగుచేయడం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందంటూ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పోతేనే తెలంగాణ బాగుపడుతుందని మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఈనాడు రాష్ట్రంలో నెలకొన్న కరువును ఎదుర్కొవడానికి మంచి సమయం ఉన్నా రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యమంత్రికి ఏ సబ్జెక్టు మీద పూర్తిగా అవగాహన లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును 'కూలేశ్వరం' అంటూ దుష్ప్రచారం చేసి ప్రజల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు నీరు అందించడంలో ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. ప్రాజెక్టుపై నాడు చేసిన ఆరోపణలకు, నేటి పరిస్థితులకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఒకవైపు ప్రజలను నీటి వృథా చేయవద్దంటూ హెచ్చరిస్తూ, మరోవైపు రైతులకు సాగునీరు అందించకుండా పంటలు వేయడం మీ కర్మ అంటూ మాట్లాడటం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని నిలదీశారు.తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించాల్సిన బాధ్యతను విస్మరించి, ఇతర ప్రాంతాల ప్రయోజనాల కోసం తెలంగాణ నీటి హక్కులను నిర్లక్ష్యం చేస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యత కావాలని స్పష్టం చేశారు.మేడిగడ్డ వద్ద అందుబాటులో ఉన్న నీటిని సాంకేతిక నిపుణుల సూచనలు, బ్యారేజీ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పరిశీలించి, సాధ్యమైన వెంటనే పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
4 నవంబర్ 2026

ఎన్నికల సంఘం స్వతంత్రతకు ముప్పు

సంపాదకీయం

ప్రజాస్వామ్యానికి ప్రాణం ఎన్నికలు, ఆ ఎన్నికలకు ప్రాణం వాటిని నిర్వహించే సంస్థ నిష్పాక్షికత. అందుకే ఎన్నికల కమిషనర్ల నియామకం, వారికి లభించే చట్టపరమైన రక్షణ రెండూ రాజకీయ చర్చకు మాత్రమే కాదు, రాజ్యాంగ చర్చకు కూడా సంబంధించిన అంశాలు. 2023లో కేంద్రం తెచ్చిన చట్టం ఈ రెండు విషయాల్లోనూ తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.

అనూప్ బరన్వాల్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన సమతుల్యతను సూచించింది. పార్లమెంటు చట్టం చేసే వరకు ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి కలిసి కమిషనర్లను ఎంపిక చేయాలని ఆదేశించింది. ఇందులో న్యాయవ్యవస్థ ప్రతినిధి ఉండటం వల్ల ప్రభుత్వ పక్షానికి మెజారిటీ లేకుండా తటస్థతకు చోటు ఉండేది. కానీ కొత్త చట్టం ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చింది. దీంతో ముగ్గురు సభ్యుల కమిటీలో ఇద్దరు ప్రభుత్వ పక్షానికి చెందినవారే. ప్రతిపక్ష నేత అభ్యంతరం చెప్పినా నియామకం ఆగదు. చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉందనేది నిజమే, కానీ కోర్టు సూచించిన తటస్థ సమతుల్యతను తొలగించి, నియామకాల్లో అధికార పక్షానికి పైచేయి ఇవ్వడం ఆ స్ఫూర్తికి విరుద్ధమన్న విమర్శను తేలికగా కొట్టిపారేయలేం.

రెండో అంశం సెక్షన్ 16. ప్రస్తుత, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు, ఇతర కమిషనర్లు తమ అధికారిక విధుల నిర్వహణలో చేసిన చర్యలు, మాటలపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు విచారించకూడదని ఈ నిబంధన చెబుతోంది. ఈ రక్షణ పదవీ విరమణ తర్వాత కూడా కొనసాగుతుంది. నిజాయితీగా తీసుకున్న నిర్ణయాలకు రక్షణ ఉండటం సమంజసమే. కానీ అధికార దుర్వినియోగం జరిగిందన్న విశ్వసనీయ ఆరోపణ వచ్చినప్పుడు కూడా విచారణకు దారి మూసేయడం జవాబుదారీతనానికి ఎదురు నిలుస్తుంది. రాష్ట్రపతి, గవర్నర్లకు ఆర్టికల్ 361 కింద క్రిమినల్ ప్రొసీడింగ్స్ నుంచి రక్షణ ఉన్నది పదవిలో ఉన్నంతకాలమే. అలాంటిది ఎన్నికల కమిషనర్లకు పదవి తర్వాత కూడా విస్తృత రక్షణ ఎందుకన్న ప్రశ్న న్యాయమైనదే. ఈ నిబంధన రాజ్యాంగబద్ధతను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది, కోర్టు నోటీసులు కూడా జారీ చేసింది.

ఈ రెండు అంశాలు కలిసి చూస్తే ఒక ఆందోళనకర చిత్రం కనిపిస్తుంది: నియామకాల్లో ప్రభుత్వానికి ఆధిపత్యం, నియమితులైన వారికి జవాబుదారీతనం నుంచి విస్తృత మినహాయింపు. స్వతంత్రత అంటే ప్రభుత్వ ప్రభావం నుంచి విముక్తి మాత్రమే కాదు, చట్టం ముందు బాధ్యత నుంచి తప్పించుకోవడం అంతకన్నా కాదు. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇంకా తీర్పు ఇవ్వలేదు. కానీ తీర్పు వచ్చేవరకు ఈ ప్రశ్నలను పక్కన పెట్టాల్సిన అవసరం లేదు.

ఎన్నికల సంఘంపై ప్రజల నమ్మకం ఎంత బలంగా ఉంటే ఫలితాలపై అంత విశ్వాసం ఉంటుంది. ఆ నమ్మకాన్ని కాపాడాలంటే నియామక ప్రక్రియ తటస్థంగా ఉండాలి, అధికారాలకు జవాబుదారీతనం తోడుండాలి. ప్రభుత్వం చేయాల్సింది ఈ ప్రశ్నలకు పారదర్శకంగా సమాధానం చెప్పడమే.

క్షమించు తల్లి



శిశువు నిర్ధారణ పరీక్షలేవీ చేయకుండా
నీ తల్లి నిన్ను
ఈ భూమ్మీదకు వదలడం నేరమైందేమో?!

లక్షలాది రాబందుల
నవ్వుల వెనుక దాగిన వేటను,
ఆ స్పర్శల్లోని దురుద్దేశాలను
నీ పసి మనసు పసిగట్టలేకపోవడంకూడా
నేరమైందేమో??

ఆడతనం ఒక మాంసం
ముద్దయితే చాలు,
నిత్యం అవయవాలను
స్కానింగ్ చేస్తూ
చూపులతో పొడుస్తుంటే
ఇన్ని క్రూర మగాళ్ల మధ్య
నిన్ను నేను యాడని దాచిపెట్టను?

ఆడపిల్లల అమాయకత్వం...
అర్థం చేసుకోలేని
ఈ సమాజానిదే అసలైన నేరం!

నీ వయసుకు మించిన జాగ్రత్తను
నీ భుజాలపై మోపలేను...
నీ బాల్యాన్ని భయాల గదిలో
బంధించలేను...

ఆకాశం అంత నీ ఆశలకు
రెక్కలు ఇవ్వలేను
నీ గలగల మాటలని
మౌనంగా మార్చలేను..
తల్లీ!!నన్ను క్షమించు!!

ఉన్మాదుల దాడి
భయభ్రాంతులను చేసినా!
తూనీగల్లా ఎగరాల్సిన పిల్లలకు
సంకెళ్లుగా మారినా?
నీకు రక్షణగా నిలవాలనుకునే
ప్రభుత్వం మీ ఆరోగ్య పరిస్థితిని
నిరంతరం సమీక్షిస్తూనే ఉంది
నువ్వు బతికి రావాలి బిడ్డా!
అమ్మను ఓదార్చడానికైనా!

అనిత కృష్ణ గండమళ్ళ

ప్రజలకు కావాల్సింది పాలన.. పరస్పర దూషణలు కాదు!

ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు, ఆరోపణలు సహజం. అయితే ఆ విమర్శలు ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడాలి తప్ప, వ్యక్తిగత కక్షలు, రాజకీయ ప్రతీకారాలు, పరస్పర దూషణలకు వేదిక కాకూడదు. దురదృష్టవశాత్తూ తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఇదే ధోరణి పెరిగిపోతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, గత పాలకుల అవినీతిని ప్రస్తుత పాలకులు ప్రస్తావించడం, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షాలు ఎత్తిచూపడం నిత్యకృత్యంగా మారింది. కానీ ఈ రాజకీయ యుద్ధం వల్ల సామాన్య ప్రజలకు ఒరుగుతున్న ప్రయోజనం ఏమిటి?



2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక ప్రజాకర్షక హామీలతో అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారంటీల పేరుతో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.15,000 పెట్టుబడి సాయం, రైతు కూలీలకు రూ.12,000, రైతు రుణమాఫీ, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉద్యోగావకాశాలు, విద్యార్థులకు ఆర్థిక సహాయం వంటి హామీలను ప్రకటించింది. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా వీటిలో ఏ హామీ ఎంతవరకు అమలైంది? ఎంతమంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరింది? ఎంతమంది అర్హులకు ఇంకా అందలేదు? ఇందుకోసం ఎంత బడ్జెట్ కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? అనే వివరాలను ప్రభుత్వం సమగ్రంగా ప్రజల ముందు ఉంచాలి. ప్రకటనలు, ప్రచారాలు కాకుండా శాఖలవారీగా, పథకాలవారీగా సాధించిన ప్రగతిని అధికారిక గణాంకాలతో వెల్లడించాలి.

అదేవిధంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ బాధ్యత కూడా అంతే కీలకం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించడం మాత్రమే ప్రతిపక్ష ధర్మం కాదు. ఏ పథకంలో ఎంతమంది అర్హులకు అన్యాయం జరిగింది? ఎన్ని నిధులు కేటాయించలేదు? ఎక్కడ అవినీతి జరిగింది? ఎక్కడ పరిపాలనా వైఫల్యం చోటుచేసుకుంది? అనే అంశాలను శాసనసభలోనూ, ప్రజాక్షేత్రంలోనూ ఆధారాలతో, గణాంకాలతో నిరూపించాలి. కేవలం రాజకీయ ఆరోపణలు ప్రజలకు ఉపయోగపడవు.

ఇదే సమయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు కూడా నిర్దిష్ట ఆధారాలతో ఉండాలి. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, ధరణి, ప్రభుత్వ భూముల వ్యవహారాలు వంటి అంశాలపై విచారణల పేరుతో రాజకీయ ప్రకటనలు చేయడం కాకుండా, విచారణ నివేదికలు, ఆడిట్ అభ్యంతరాలు, న్యాయపరమైన పరిణామాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలను ప్రజలకు వెల్లడించాలి. ఆరోపణ ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరినీ దోషిగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య న్యాయసూత్రాలకు విరుద్ధం. తప్పు చేసిన వారికి రాజకీయాలకు అతీతంగా చట్టప్రకారం శిక్ష పడాలి.

మరోవైపు ఇరు పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్న సొంత మీడియా ఛానళ్లు, సోషల్ మీడియా గ్రూపులు రాజకీయ ప్రచారాన్ని మరింత దిగజారుస్తున్నాయి. వాస్తవాలను విశ్లేషించడం కంటే ప్రత్యర్థులను కించపరిచే కథనాలు, వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు, కత్తిరించిన వీడియోలు, పరస్పర బురదజల్లుడు ఎక్కువయ్యాయి. ప్రజలకు అవసరమైన నిరుద్యోగం, రైతుల సమస్యలు, ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితి, విద్యా రంగంలోని లోపాలు, ధరల పెరుగుదల, రహదారులు, తాగునీరు వంటి అంశాలు ఈ రాజకీయ గందరగోళంలో మరుగున పడుతున్నాయి. ప్రజలకు సమాచారం అందించాల్సిన మీడియా రాజకీయ పార్టీల ప్రచార సాధనాలుగా మారడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదు.

నిజానికి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటి పాలనలోనూ అవినీతి, అధికార దుర్వినియోగం, వాగ్దాన భంగం వంటి ఆరోపణలను చూస్తూ రాజకీయ వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోతున్నారనే విషయాన్ని ఇరు పార్టీలు గుర్తించాలి. ప్రజలు దృష్టిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిలో మునిగి తేలుతున్నాయి. ఈ విషయంలో ఇరు పక్షాలు దొందూదొందే. అందులో తెలంగాణ ప్రజలకు ఏలాంటి సందేహాలు లేవు. అయితే, ఈ పరస్పర ఆరోపణలను తీర్పులుగా పరిగణించకుండా, వాటిని నిష్పాక్షిక విచారణల ద్వారా నిర్ధారించాల్సిన బాధ్యత ప్రసైతుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష విమర్శలను రాజకీయ శత్రుత్వంగా కాకుండా పాలనను మెరుగుపరుచుకునే అవకాశంగా చూడాలి. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ కూడా గత పాలనను సమర్థించుకోవడానికే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలి. శాసనసభలో ప్రతి పథకంపై శ్వేతపత్రాలు, వార్షిక ప్రగతి నివేదికలు, స్వతంత్ర ఆడిట్ వివరాలపై చర్చ జరగాలి. ఎన్నికల హామీల అమలును పర్యవేక్షించేందుకు పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే. అధికారం శాశ్వతం కాదు; ప్రజలే అంతిమ నిర్ణేతలు. వ్యక్తిగత విమర్శలతోనో, మీడియా ప్రచారాలతోనో ప్రజల విశ్వాసాన్ని సంపాదించలేరు. హామీల అమలు, పారదర్శక పాలన, అవినీతిపై నిష్పాక్షిక చర్యలు, ప్రజా సమస్యల పరిష్కారం ద్వారానే విశ్వసనీయత ఏర్పడుతుంది. తెలంగాణ ప్రజలకు కావాల్సింది ఎవరు ఎవరిని తిట్టారనే వార్తలు కాదు; తమ జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చిందనే సమాధానం. రాజకీయ పార్టీలు ఇప్పటికైనా పరస్పర దూషణలకు స్వస్తి పలికి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి. ప్రజాస్వామ్యంలో రాజకీయ పోటీ ఉండాలి కానీ ప్రజా ప్రయోజనాల విషయంలో బాధ్యతాయుతమైన సహకారం కూడా ఉండాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

దీపావళి వెలుగుల్లో గోండు సమాజ సాంస్కృతిక వైభవం..!



దండారి ఉత్సవాలు – ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకలు ప్రకృతితో మమేకమైన జీవనం.. సంప్రదాయాలకు నిలువెత్తు రూపం.. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న కళారూపాల సమాహారం.. గోండు ఆదివాసీ సమాజ దండారి ఉత్సవాలు..! భారతదేశం అనేక సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు నిలయం. ముఖ్యంగా ఆదివాసీ సమాజాల జీవన విధానంలో ప్రకృతి ఆరాధన, సామూహిక జీవనం, సంప్రదాయ కళలు, పండుగలకు ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణతో పాటు మధ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో నివసించే గోండు ఆదివాసీ సమాజం తనదైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను తరతరాలుగా కాపాడుకుంటూ వస్తోంది. ఈ సాంస్కృతిక వారసత్వంలో దీపావళి పర్వదినం సందర్భంగా నిర్వహించే దండారి ఉత్సవాలు విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. దీపావళి అనగానే సాధారణంగా దీపాల వెలుగులు, పూజలు, కుటుంబ సమాగమాలు గుర్తుకొస్తాయి. అయితే గోండు సమాజంలో దీపావళి కాలం కేవలం వెలుగుల పండుగ మాత్రమే కాదు. అది ఆదివాసీ కళలు, పాటలు, నృత్యాలు, సంప్రదాయ వేషధారణలు, సామూహిక ఐక్యతను చాటిచెప్పే దండారి ఉత్సవాల వేడుకల సమయం కూడా. దండారి ఉత్సవాలు గోండు ఆదివాసీ సమాజానికి చెందిన సంప్రదాయ జానపద కళారూపాల్లో ఒక ముఖ్యమైన భాగం. మరి ముఖ్యంగా తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు గోండు సమాజం నివసించే ఇతర ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి మధ్య భారతదేశంలోని గోండు సమాజాల మధ్య కూడా ప్రాంతీయ వైవిధ్యాలతో అనేక సంప్రదాయ నృత్యాలు, పండుగలు కొనసాగుతున్నాయి. దండారి ఉత్సవాలు తరతరాలుగా మౌఖిక సంప్రదాయాల ద్వారా ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమిస్తున్నాయి. వీటిలో గోండు సమాజపు చరిత్ర, సామాజిక సంబంధాలు, ప్రకృతితో అనుబంధం, జీవన విధానం ప్రతిబింబిస్తాయి.గ్రామీణ జీవితంలో వ్యవసాయం, అటవీ వనరులు, ప్రకృతి ఆధారిత జీవన విధానానికి ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో, పండుగలు ప్రజలను ఒకచోట చేర్చి ఆనందాన్ని పంచే సామూహిక వేదికలుగా నిలిచాయి. దండారి ఉత్సవాలు కూడా అలాంటి సామాజిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని కలిగి ఉన్నాయి.

దండారి ఉత్సవాల ప్రత్యేకత ఏమిటి..?

దండారి ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణ సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు, వాయిద్యాల నాదం. గోండు కళాకారులు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేకమైన అలంకరణలతో బృందాలుగా ఏర్పడి నృత్యాలు చేస్తారు. డప్పులు, తుడుం వంటి సంప్రదాయ వాయిద్యాల వినియోగం ప్రాంతాన్ని బట్టి మారవచ్చు. వాయిద్యాల లయకు అనుగుణంగా కళాకారులు చేసే నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. సమూహంగా చేసే నృత్యాల్లో అడుగుల సమన్వయం, పాటలలోని భావం, వాయిద్యాల లయ దండారి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఉత్సవాల్లో నృత్యం కేవలం వినోదం కోసం మాత్రమే కాదు. అది ఒక సమాజపు సాంస్కృతిక గుర్తింపును వ్యక్తపరిచే సాధనం. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన కళలను ప్రదర్శిస్తూ, వాటిని భావితరాలకు అందించాలనే సంకల్పాన్ని గోండు కళాకారులు చాటిచెబుతారు.

గ్రామగ్రామాన తిరుగుతూ సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా..!

దండారి సంప్రదాయంలో కొన్ని ప్రాంతాల్లో కళాబృందాలు ఇతర గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలతో కలిసి ఉత్సవాల్లో పాల్గొంటాయి. అతిథి గ్రామాల్లో కళాకారులకు ఆతిథ్యం ఇవ్వడం, వారితో కలిసి పాటలు పాడటం, నృత్యాలు చేయడం వంటి ఆచారాలు ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి కనిపిస్తాయి. ఈ పరస్పర సందర్శనలు ఆదివాసీ గూడెల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేస్తాయి. బంధుత్వాలను, సామాజిక అనుబంధాలను పెంపొందిస్తాయి. యువతకు తమ సమాజపు సంప్రదాయాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తాయి. దండారి ఉత్సవాల ద్వారా సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, గౌరవం వంటి విలువలు బలపడతాయి. వ్యక్తిగత జీవితాలకు మాత్రమే పరిమితం కాకుండా, సమాజమంతాకలిసి పండుగ జరుపుకోవడం ఈఉత్సవాల ముఖ్య లక్షణం.

దీపావళి - దండారి ఉత్సవాల అనుబంధం

దీపావళి పర్వదినం సందర్భంగా నిర్వహించే దండారి ఉత్సవాలు గోండు సమాజపు సాంస్కృతిక జీవితంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఈ సమయంలో సంప్రదాయ నృత్యాలు, పాటలు, సామూహిక వేడుకలతో గూడెలు సందడిగా మారుతాయి.అయితే దండారి ఉత్సవాల నిర్వహణ తేదీలు, ఆచారాలు, పద్ధతులు అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక సంప్రదాయాలు, గ్రామ ఆచారాలు, సమాజపు విశ్వాసాలను బట్టి మార్పులు కనిపిస్తాయి. ఈ ఉత్సవాలను కేవలం దీపావళి వేడుకల్లో భాగంగా మాత్రమే చూడకూడదు. ఇవి గోండు సమాజపు చారిత్రక స్మృతులను, సాంస్కృతిక వారసత్వాన్ని, సామాజిక సంబంధాలను నిలబెట్టే జీవన సంప్రదాయాలు.

ఆదివాసీ సంస్కృతిలో ప్రకృతికి ప్రత్యేక స్థానం

గోండు సమాజపు జీవన విధానంలో అడవి, భూమి, నీరు, పర్వతాలు,జీవవైవిధ్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రకృతితో అనుబంధం వారి ఆచారాలు, విశ్వాసాలు, జానపద కథలు, పాటల్లో ప్రతిబింబిస్తుంది.దండారి ఉత్సవాలు కూడా ఈ విస్తృతమైన సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తాయి. పాటలు, నృత్యాలు, సామూహిక ఆచారాల ద్వారా సమాజపు జీవన అనుభవాలు వ్యక్తమవుతాయి. ప్రకృతిని గౌరవించడం, సమాజంతో కలిసి జీవించడం, పూర్వీకుల నుంచి వచ్చిన సంప్రదాయాలను కాపాడుకోవడం వంటి విలువలు ఆదివాసీ సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నాయి. ఈ విలువలను ఆధునిక తరాలకు పరిచయం చేయడంలో దండారి ఉత్సవాలకు ముఖ్యమైన పాత్ర ఉంది.

ఆధునిక కాలంలో దండారి ఉత్సవాల పరిరక్షణ అవసరం

ప్రపంచీకరణ, పట్టణీకరణ, ఆధునిక జీవనశైలి ప్రభావంతో అనేక ఆదివాసి సంప్రదాయ కళారూపాలు మార్పులకు గురవుతున్నాయి. యువతలో సంప్రదాయ కళలపై అవగాహన పెంపొందించకపోతే, కొన్ని కళారూపాలు క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.ఈ నేపథ్యంలో దండారి ఉత్సవాలను పరిరక్షించడం గోండు సమాజానికే కాకుండా, భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడానికి కూడా అవసరం.

దండారి ఉత్సవాల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు:

భావితరాలకు శిక్షణ: గోండు యువతకు సంప్రదాయ నృత్యాలు, పాటలు, వాయిద్యాలపై శిక్షణ అందించాలి.

- పాఠ్యాంశాల్లో చోటు: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ కళారూపాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి.
- ప్రభుత్వ ప్రోత్సాహం: ఆదివాసీ కళాకారులకు ఆర్థిక సహాయం, ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలి.
- సాంస్కృతిక డాక్యుమెంటేషన్: పెద్దల నుంచి సంప్రదాయ పాటలు, కథలు, ఆచారాలను సేకరించి భద్రపరచాలి.
- ఉత్సవాలకు గుర్తింపు: దండారి ఉత్సవాలను జిల్లా, రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సహించాలి.
- కళాకారుల గౌరవం: సంప్రదాయ కళలను కాపాడుతున్న గోండు కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలి.

దండారి నృత్యాల లయలు మారుమోగినప్పుడు, గోండు సమాజపు సంస్కృతి మరోసారి తన వైభవాన్ని చాటిచెబుతుంది. సంప్రదాయాలను కాపాడుకోవడం అంటే గతాన్ని గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు; భవిష్యత్తు తరాలకు తమ మూలాలను పరిచయం చేయడం కూడా. ఆదివాసీ సంస్కృతిని గౌరవించడం, దండారి వంటి సంప్రదాయ కళారూపాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

"దండారి నృత్యం మన కళా వైభవం..
దండారి పాటలు మన పూర్వీకుల వారసత్వం..
దండారి ఉత్సవాలు మన సామాజిక ఐక్యతకు ప్రతీకలు..
ఆదివాసీ సంస్కృతి మన అస్తిత్వం..
దాని పరిరక్షణ మనందరి బాధ్యత."



-డాక్టర్ సాగబోయిన పాపారావు
M.A,Ph.D, OU
ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర
కార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్ నెంబర్ : 9032057373

దీపావళి వెలుగుల్లోనైనా పదవుల గ్రహణం వీడేనా?

ఇటీవల సీఈసీ వ్యవహారంపై రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రవాణా పరమైన సవాళ్లు ఎదురైనా శ్రేణులను ఢిల్లీకి సమీకరించడంలో నాయకత్వం చూపిన చొరవ పార్టీ సంస్థాగత శక్తిని మరోసారి చర్చకు తెచ్చింది. ఈ కార్యక్రమంతో శ్రేణుల్లో ఉత్సాహం కనిపించినా, నామినేటెడ్ పదవుల విషయంలో మాత్రం నిరీక్షణ కొనసాగుతోంది. సంక్రాంతి, ఉగాది, దసరా గడిచాయి. ఇప్పుడు దీపావళి వచ్చింది. పండుగలు మారుతున్నా పదవులపై ఆశావహుల ఎదురుచూపులు మాత్రం ముగియడం లేదు. ప్రతి పండుగకు ముందు ప్రకటనపై ఆశలు పెరిగి, చివరకు స్పష్టత రాకపోవడం వెనుక రాజకీయ లెక్కలేమిటి? పేర్లు ఖరారయ్యాయా? అధిష్ఠానం ఆమోదం కోసమే జాప్యమా? లేక సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయా? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదు. అక్టోబర్ 10న వెలువడిన సమాచారం ప్రకారం, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల ఎంపిక పూర్తిచేసి పేర్లను అధిష్ఠానానికి పంపినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన రావచ్చన్న సంకేతంతో పార్టీ శ్రేణుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రభుత్వ నామినేటెడ్ పదవులతోపాటు పార్టీ సంస్థాగత నియామకా లపైనా నిర్ణయాలు వెలువడాల్సి ఉండటంతో నాయకత్వం తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది.

నామినేటెడ్ పదవులపై ఉత్కంఠ.. అసలు లెక్క ఎప్పుడు తేలుతుంది?

కార్పొరేషన్లు, సహకార సంస్థలు, మార్కెట్ కమిటీలు, సంక్షేమ సంస్థల్లో చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల నియామకాల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 22న వెలువడిన నివేదిక ప్రకారం, సుమారు 50 కొత్త నియామకాలతోపాటు పదవీ కాలం ముగిసిన మరో 30కి పైగా స్థానాలు కలిపి దాదాపు 80 పోస్టుల భర్తీపై కసర త్తు జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో ప్రచారంలోకి వచ్చిన 87 పోస్టుల అంచనాతో ఈ సంఖ్య సరిపోకపోవడంతో అసలు ఖాళీలపై స్పష్టత అవసరమైంది. ఆర్టీసీ, పౌర సరఫరాలు, మూసీ రివర్‌ఫ్రంట్, పారిశ్రామికాభివృద్ధి, పర్యాటకం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు చెందిన సంస్థల్లో నియామకాలపై ఆసక్తి నెలకొంది. పదవీకాలం ముగిసిన సుమారు 37 మంది కార్పొరేషన్ చైర్మన్ల స్థానాల భర్తీపైనా నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. అయితే ఈ సంఖ్యలను అధికారికంగా ప్రకటి ంచిన తుది ఖాళీలుగా భావించరాదు. కొందరు గతంలో నిర్వహించిన పదవులను కొనసాగించాలని ఆశిస్తుండగా, మరికొందరు తొలిసారి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 14న దసరా నాటికి నియామకాలు చేపట్టే అవకాశంపై సంకేతాలు వెలువడగా, అక్టోబర్ 18న వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని, దసరాకు ముందే ప్రకటన ఉండకపోవచ్చని నాయకత్వం తెలిపినట్లు నివేదికలు పేర్కొన్నాయి. గడువుపై భిన్నమైన సంకేతాలు రావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రచారంలో ఉన్న అంచనాల కంటే ఖాళీల వివరాలు, ఎంపిక ప్రమాణాలు, నియామకాల గడువును వెల్లడించడం ముఖ్యం.



పాత అనుభవం.. కొత్త రాజకీయ బలం.. సమతుల్యత ఎలా?

పదవుల పంపిణీ కాంగ్రెస్ నాయకత్వానికి కీలక పరీక్షగా మారింది. ప్రతిపక్షంలో పదేళ్లపాటు పార్టీ కోసం పనిచేసిన నాయకులు, ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో శ్రమించిన కార్యకర్తలు తమ సేవలకు గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు కూడా తమ రాజకీయ అనుభవం, ప్రజాబలం ఆధారంగా బాధ్యతలు కోరుతున్నారు. దీర్ఘకాలంగా పార్టీకి అండగా నిలిచినవారికి ప్రాధాన్యమిస్తూనే కొత్తగా చేరినవారికి అవకాశాలు కల్పించడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం నాయకత్వం ముందున్న సవాలు. ఆగస్టు 23న నిజామాబాద్‌లో పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన వారికి 70 శాతం నామినేటెడ్ పదవులు కేటాయిస్తామని, కొత్తగా వచ్చినవారికీ ప్రాతి నిధ్యం ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఆగస్టు 24న కూడా పార్టీ కోసం నిరంతరం శ్రమించినవారికి ప్రాధాన్యం ఇవ్వాలని, గత మూడేళ్లలో అందరికీ తగిన అవకాశాలు లభించలేదన్న అసంతృప్తిని ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. ప్రకటనల్లో వ్యక్తమైన ప్రాధాన్యం ఎంపికల్లోనూ ప్రతిబింబించాలి. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా, నియోజకవర్గ కమిటీల నియామకాలు పూర్తికాకపోవడం పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం ఎదురుచూస్తున్న కొందరు నేతలు ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులపైనా ఆశలు పెట్టుకున్నట్లు నివేదికల్లో ప్రస్తావన వచ్చింది. ఒకే బాధ్యత కోసం పలువురు పోటీపడుతున్న వేళ పార్టీ సేవలు, రాజకీయ అనుభవం, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యతకు ఏ ప్రాతిపదికన ప్రాధాన్యం ఇస్తారన్నది కీలకం.

కేడర్ ఆశలకు వెలుగునివ్వడం నాయకత్వ బాధ్యత!

నామినేటెడ్ పదవులు కేవలం హోదాలు కావు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం పెంచడం, ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావడం వంటి బాధ్యతలు వాటితో ముడిపడి ఉంటాయి. నియామకాల జాప్యం కొనసాగితే ఆశావహుల నిరీక్షణతోపాటు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల ఉత్సాహంపైనా ప్రభావం పడవచ్చు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పీసీసీ కార్యవర్గ విస్తరణ, జిల్లా-నియోజకవర్గ కమిటీల ఏర్పాటు, కార్పొరేషన్ పదవుల భర్తీని సమన్వయంతో పూర్తిచేస్తే శ్రేణులకు స్పష్టమైన సందేశం అందుతుంది. అర్హత, పార్టీ సేవలు, సామాజిక ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యత ఆధారంగా ఎంపికలు చేపట్టి నిర్దిష్ట గడువును ప్రకటించాలి. దీపావళికి ముందు లేదా తర్వాత ప్రకటన వస్తుందన్న సంకేతాలు కార్యరూపం దాలుస్తాయా? మూడేళ్లుగా ఎదురుచూస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కుతుందా? బాధ్యతలు చేపట్టేవారు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతవరకు కృషి చేస్తారన్నది కూడా ఎంపికలతోపాటే తేలాలి. ఎన్నికల సమయంలో కార్యకర్తల శ్రమతో అధికారాన్ని అందుకున్న పార్టీ, పాలనలోనూ వారి భాగస్వామ్యానికి తగిన విలువ ఇవ్వాలి.



ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464



ప్రజలను మింగేస్తున్న గనులు

పది రోజుల్లో నలుగురు మృతి

- నిర్లక్ష్య ధోరణిలో గనుల యాజమాన్యం
- ప్రజల ప్రాణాలతో అధికారుల చెలగాటం
- ఇకనైనా గనుల ప్రమాదం దృష్టి సారిస్తారా..?

వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 3 (జనం సాక్షి): జిల్లా ప్రజలను మృత్యు వెంటాడుతుంది. ఏదో రూపకంగా అమాయకులను కాటు వేస్తుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కానీ జిల్లా అధికార యంత్రాంగంలో కదలిక లేదు. దిద్దుబాటు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నిత్యం మృత్యు ఏదో ఒకచోట జిల్లా ప్రజలను మింగేస్తుంది. సరిగ్గా ఏడాది క్రితం బస్సు ప్రమాదంలో జిల్లాకు చెందిన 12 మంది మృతి చెందగా పది రోజుల్లో నలుగురు వ్యక్తులు అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల అశ్రద్ధ కారణంగా నలుగురు మృతి చెందారు. తాజాగా వికారాబాద్ జిల్లా ధరూరు మండలం తరుగోపుల గ్రామ సుద్దగనిలో పడి మున్నూరు అశోక్ సకిల శ్రీనివాస్ అనే ఇద్దరు గొర్రెల కాపర్లు మృతి చెందారు. ఈ సంఘటనతో గత పది రోజుల్లో గనులలో పడి నలుగురు మృతి చెందారు. గనుల శాఖ అనుమతులు కాంట్రాక్టర్ల ఇష్ట రాజ్యాంగ గనుల తవ్వకాలు జరిపి గాలికి వదిలివేయడంతో వల్ల ప్రజల ప్రాణాలను హరించి వేస్తున్నాయి. బంటారం ధరూర్ పెద్దేముల్ తాండూర్ మండలాలలో నాపరాయి సుద్ద ఎర్ర మట్టి గనుల తవ్వకాలు జోరుగా సాగుతాయి. గనుల శాఖ తనిఖీలు లేని కారణంగా గనుల అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు ఇష్ట రాజ్యాంగ తవ్వకాలు జరిపి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గనుల తవ్వకాలు జరుగుతున్న కారణంగా వర్షాకాలం వచ్చిందంటే లోతైన గనులన్నీ నీటితో నిండిపోతాయి. నీటిమట్టం తెలియని అమాయక పల్లె ప్రజలు ఆ ప్రాంతం గుండా వెళ్లి తరచు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. కాంట్రాక్టర్లు గనుల తవ్వకాలు జరిపి వాటిలో నీటిమట్టం పెరగగానే వాటికి ఎలాంటి కంచ వేయకుండా వదలి వేయడంతో గత పది రోజుల్లో నలుగురు వ్యక్తులు నీట మునిగి మృతి చెందారు. కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బోపునారం గ్రామ గణిలో పడి మృతి చెందగా గొర్రెలు సుద్ద గనిలో నీ నీటిలో మునిగి మృతి చెందుతాయని భావించి వాటిని రక్షించడానికి ప్రయత్నించిన తరిగొప్పుల ఇద్దరు గొర్రెల కాపర్లు నీటిలోని బురదలో చిక్కుకుపోయి మృతి చెందారు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర విషాద ఛాయాలను నింపివేసింది. ఇలా అధికారులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు గని ప్రమాదాలు జరుగుతున్న జిల్లా అధికారుల్లో కదలికలు లేవు. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారుల హడావుడి తప్ప శాశ్వత చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సంఘటన జరిగినప్పుడు కనీసం సంబంధిత అధికారులపై కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకున్న పాపానికి పోలేదు. కానీ వీరు నిర్లక్ష్యం కారణంగా నిరుపేద కుటుంబానికి చెందిన ఎందరో అమాయక ప్రజలు మృతి చెంది వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిలిస్తుంది. కంచలేని గనులపై గ్రామస్తులు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న పాపానికి పోలేదు. కాంట్రాక్టర్లు నిబంధనలో అతిక్రమించి గనుల తవ్వకాలు జరిపి వదలు వేశా రు. ఫలితంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాలను అధికారులు ముందుగానే గుర్తించి సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి మరో ప్రమాదం జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు గని ప్రమాదాలైన అధికారుల తనిఖీలు కొరవడి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అశ్రద్ధ కారణంగానే జరుగుతున్నాయి కాబట్టి అధికారులు దిద్దుబాటు చర్యలు చేపడుతారని ఆశిద్దాం...

నాటు బాంబుల పేలుడు బాధిత చిన్నారులకు పోచారం పరామర్శ

- నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన
- కుటుంబ సభ్యులకు ధైర్యం.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



బాన్సువాడ, నవంబరు 3 (జనంసాక్షి): కామారెడ్డి జిల్లా బాన్సువాడ గ్రామీణ మండలం తాడ్కోల్ శివారులో నాటు బాంబులు పేలి గాయపడిన చిన్నారులను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో పరామర్శించారు. ఎర్రమన్ను కుచ్చ ప్రాంతంలో ఆదివారం పందుల వేట కోసం ఉపయోగించే పేలుడు పదార్థాలు ప్రమాదవశాత్తు పేలడంతో ఏడుగురు గాయపడిన విషయం తెలిసిందే. వీరిలో ఇద్దరు చిన్నారులను నిలోఫర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులు దండ్ల అంజలి (3), దండ్ల శ్రీదేవి (5) ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. చిన్నారులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిలోఫర్ ఆసుపత్రి ఆర్ఎంఓ, సూపరింటెండెంట్, తాడ్కోల్ సర్పంచి రమేష్, మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అమానుషంగా ఇద్దరు మహిళలపై దాడి

- దాడిని తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:(జనంసాక్షి) : మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధి రాజీవ్ గృహకల్ప సమీపంలోని మారుతీనగర్‌లో బైబిల్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఇద్దరు క్రైస్తవ మహిళలపై కొందరు వ్యక్తులు దుర్భాషలాడుతూ, విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఘటనను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై దాడులకు పాల్పడటం, వారిని కించపరిచేలా దుర్భాషలాడటం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ తమ మత విశ్వాసాలను ఆచరించే స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిందని, ఇతరుల మత విశ్వాసాల పట్ల కూడా ప్రతి ఒక్కరూ గౌరవభావంతో వ్యవహరించాలని సూచించారు బైబిల్ కరపత్రాల పంపిణీపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు లేదా పోలీసు లకు చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలి తప్ప, మహిళ లపై దురుసుగా ప్రవర్తించడం, దాడులకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని ఆమె స్పష్టం చేశారు మతం ఏదైనా.. మహిళల గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ, భద్రతకు భంగం కలిగించే హక్కు ఎవరికీ లేదు. సమాజంలో మత సామరస్యాన్ని, పరస్పర గౌరవాన్ని కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి, బాధ్యులను గుర్తించి, బాధిత మహిళలకు న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సబితా ఇంద్రారెడ్డి పోలీసు అధికారులను కోరారు. మహిళలపై దాడులు, మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు.

2 కోట్ల 25 లక్షల పనులు పూర్తి

మంథని, నవంబర్ 03, (జనంసాక్షి) : మంథని పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ నుండి దహగం వారి మూల వరకు నూతన రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని పట్టణ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండు కోట్ల 56 లక్షలతో డిపో ముందున్న గోదావరిఖని మెయిన్ రోడ్ నుండి చిల్డ్రన్స్ పార్క్ వరకు అలాగే రెడ్డి భవన్ నుండి ఎరుకల గూడెం మెయిన్ రోడ్డు వరకు 2 కోట్ల 25 లక్షలతో ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యంతో పనులు పూర్తయి అన్నారు. ప్రస్తుతం 40 లక్షలతో ప్రారంభమైన ఈ రోడ్డుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ద్వారా సుమారు 30 ఛాంబర్ లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పూర్తి నాణ్యతతో పనులు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని 10వ వార్డ్ కౌన్సిలర్ పెంటరి రాజు తెలిపారు. రోడ్డు పనులను మున్సిపల్ ఏఈ మౌనిక, కాంట్రాక్టర్ శ్రీరామ్ పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఈ-లాటరీ ప్రారంభం

- నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి లక్కీ డ్రా నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (జనంసాక్షి):
హైదరాబాద్‌లోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఈ-లాటరీ ద్వారా ఎంపిక చేశారు. మంగళవారం నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయంలో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించారు. గోషామహల్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాల లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన కోమల్, బచల చైతన్య, మధుగుల మమత, గ్యాదరి నందిని, చిన్నపగ వీరమణి, అమరకీర్తి పేర్లను మంత్రి ప్రకటించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, హౌసింగ్ ఎండీ గౌతమ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని తెలిపారు. మొదటి దశలో 3,500, రెండో దశలో 2,000 ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మొదటి దశలో మంజూరైన ఇళ్లలో చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయని, నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఉపాధి ఒకచోట, ఇళ్లు మరోచోట ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారని, ఆ పరిస్థితి పునరావృతం కాకుండా ఉపాధి ఉన్న ప్రాంతంలోనే ఇళ్లు ఉండేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మధ్యలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలతోపాటు ఇళ్లు లేని పేదలకు కూడా పథకం వర్తిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో స్థలాల కొరత దృష్ట్యా ప్రభుత్వ స్థలాలను కేటాయించి ఆధునిక ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, ఆర్టీసీకి చెందిన స్థలాలను సైతం ఇందుకోసం కేటాయించినట్లు వివరించారు. మిగిలిన 16 నియోజకవర్గాల్లో దరఖాస్తుల పరిశీలన అనంతరం లాటరీ నిర్వహిస్తామని, త్వరలో ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తామని వెల్లడించారు. అర్హత ఉండి రేషన్ కార్డులు లేనివారికి కార్డులు అందిస్తామని, సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే అర్హులకు కూడా త్వరలో ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కేటగిరీలో సుమారు 2,000 మంది ఉన్నట్లు తెలిపారు. మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరాలని, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు మంత్రి వివరించారు.

వరద స్వర్ణగిరి కాలనీవాసులకు

తప్పని రహదారి కష్టాలు

నిధులు మంజూరయ్యాయని చెప్పి.. ఇప్పుడు రద్దయిందంటున్న అధికారులు



పోచారం, నవంబరు 3 (జనంసాక్షి): రోడ్డు నిర్మాణంపై అధికారుల హామీలు అమలుకు నోచుకోవడం లేదని పోచారం డివిజన్ పరిధిలోని వరద స్వర్ణగిరి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదని వాపోతున్నారు. రేపు.. ఎల్లుండి అంటూ పనులను వాయిదా వేస్తున్నారని ఆరోపిస్తున్నారు.
రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని గతంలో అధికారులు చెప్పినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం అనివార్య కారణాలతో ఆ పనులు రద్దయ్యాయని చెబుతుండటంతో కాలనీవాసుల్లో అయోమయం నెలకొంది. అసలు నిధులు మంజూరయ్యాయా? రద్దుకు కారణాలేమిటి? తిరిగి ఎప్పుడు కేటాయిస్తారు? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారనే ప్రశ్నలకు అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.
రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లోనూ ఈ మార్గంలో ప్రయాణం కష్టంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ప్రకటనలు, హామీలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిధుల మంజూరుపై స్పష్టత ఇవ్వడంతోపాటు రోడ్డు నిర్మాణం ప్రారంభించే తేదీని ప్రకటించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

కుమ్మరికుంటలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి

- జోనల్ కమిషనర్‌కు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ వినతి
- రెండు కాలనీల మధ్య కనెక్టివిటీ సమస్య పరిష్కరించాలి

ఉప్పల్, (జనంసాక్షి): చిల్కానగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరికుంటలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించి, రాక పోకల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డితో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతిపత్రం సమర్పి ంచారు. కుమ్మరి కుంటలో రోడ్డు సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. అదేవిధంగా రెండు కాలనీల మధ్య రహదారి కనెక్టివిటీకి అడ్డంకిగా ఉన్న నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రోడ్డు కోసం స్థలం వదిలిన వ్యక్తి ప్రస్తుతం అక్కడ కాంపౌండ్ వాల్ నిర్మిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వివరించారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన రహదారికి అడ్డంకులు తొలగించాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, మాస శేఖర్, శ్యామ్, బంటి గౌడ్ పాల్గొన్నారు.



ఎలిమినేటి పెద్ద యాదయ్య , కాలనీవాసి .



ఏడేళ్లుగా ఆక్రమణలో ఉన్న మా కాలనీ పార్కు స్థలాన్ని విముక్తి చేసిన హైడ్రా అధికారులకు హృదయ పూర్వక ధన్యవాదాలు. ప్రజల ఆస్తులను కాపాడటంలో అధికారులు చూపిన చొరవ అభినందనీయం. ఇదే స్ఫూర్తితో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కాలనీలోని ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతున్నాం.

ఏడేళ్ల కబ్జా నుంచి 577 గజాల

పార్కు స్థలానికి విముక్తి

- ప్రజా ఆస్తిని కాపాడిన హైడ్రాకు మంజీరా కాలనీవాసుల కృతజ్ఞతలు
- సమస్య పరిష్కారానికి మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేక కృషి



అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్03(జనం సాక్షి):
ఏళ్ల తరబడి ఆక్రమణలో ఉన్న ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలం ఎట్టకేలకు విముక్తి పొందింది. తమ కాలనీలో పిల్లలు ఆడుకోవడానికి, వృద్ధులు సేదతీరడానికి, ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడానికి ఉపయోగపడాల్సిన పార్కు స్థలం తిరిగి ప్రజలకు అందుబాటులోకి రావడంతో మంజీరా కాలనీవాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుంట్లూరు డివిజన్, మంజీరా కాలనీ ఫేజ్-1, రోడ్ నంబర్-3లోని సర్వే నంబర్ 82లో ఉన్న 577 గజాల పార్కు స్థలం గత ఏడేళ్లుగా ఆక్రమణలో ఉన్నట్లు కాలనీవాసులు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన స్థలం ఆక్రమణలో ఉండటంతో పలుమార్లు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన ఫలితం లభించలేదని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో అక్టోబర్ 12న కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేయగా, సమస్యపై స్పందించిన అధికారులు నవంబర్ 3న పార్కు స్థలాన్ని ఆక్రమణ నుంచి విముక్తి చేయడంతో కాలనీవాసుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ప్రజా ఆస్తుల పరిరక్షణలో హైడ్రా చూపిన చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్య పరిష్కారంలో కాలనీవాసులకు అండగా నిలిచి, వారి తరఫున సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన మాజీ కౌన్సిలర్, జీఎస్ ఫౌండేషన్ అధినేత గ్యారల శ్రీనివాస్ గౌడ్‌కు స్థానికులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే భూదాన్ కాలనీ మాజీ అధ్యక్షులు షేక్ లాల్ మహ్మద్ అందించిన సహకారాన్ని కూడా కొనియాడారు.

పార్కు అభివృద్ధికి మరో అడుగు పడాలి!

కబ్జా నుంచి విముక్తి పొందిన 577 గజాల స్థలాన్ని కేవలం ఖాళీ స్థలంగా వదిలేయకుండా, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ఆహ్లాదకర మైన పార్కుగా తీర్చిదిద్దాలని కాలనీవాసులు కోరుతున్నారు. పిల్లలకు ఆటస్థలం, వృద్ధులకు విశ్రాంతి సదుపాయాలు, మొక్కలు, నడక మార్గం వంటి వసతులు కల్పిస్తే కాలనీవాసుల కు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆస్తులను కాపాడటం ఎంత ముఖ్యమో, వాటిని ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడం కూడా అంతే ముఖ్యమని స్థానికులు పేర్కొంటున్నారు. హైడ్రా అధికారులు చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేస్తూనే, పార్కు అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రమేష్ నాయక్, సురేష్ గౌడ్, గురి, మహేష్, విష్ణు, కె. శ్రీహరి, సుఖిందర్ నాయక్, పదుర్ల తదితరులు పాల్గొన్నారు.

శ్రవణ్ కుమార్,కాలనీ వాసి.



ఆక్రమణల నుంచి విముక్తి పొందిన పార్కు స్థలాన్ని ఆలస్యం చేయకుండా పూర్తి స్థాయి పార్కుగా అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నాం. ప్రహరీ, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, పచ్చదనం, లైటింగ్ వంటి కనీస సౌకర్యాలు కల్పించి కాలనీ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



- లక్షల క్వింటాళ్ల మాయం - కాగితాలకే పరిమితమైన కస్టమ్ మిల్లింగ్
- అధికారుల అండదండలు - నిమ్మకు నీరెత్తిన ప్రజాప్రతినిధులు
- మెరుపు దాడులు - రైస్ మిల్లుల్లో విజిలెన్స్ సోదాలు
- ప్రజాధనంతో విలాసాలు - అక్రమార్కుల కోట్లకు రెక్కలు

గద్వాల సీఎంఆర్ ధాన్యం కుంభకోణం

అదొక బేతాళ కథ!

గద్వాల, నవంబర్ 3 (జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ ధాన్యం సరఫరాలో రైస్ మిల్లర్లు సాగిస్తున్న భారీ అవినీతి దందా బహిర్గతమైంది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించడం తీవ్ర కలకలం రేపుతోంది.పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వం ఇచ్చే ధాన్యాన్ని కొందరు మిల్లర్లు తమ సొంత వ్యాపార పెట్టుబడిగా మార్చుకున్నారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన సన్న బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకుంటూ, దానికి బదులుగా నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాధనాన్ని కొల్లగొడుతూ అక్రమార్కులు కోట్లు గడిస్తుంటే, కొందరు అధికారులు వారికి అండగా నిలుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు సైతం ఈ దోపిడీపై నైతిక బాధ్యత వహించకుండా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ మౌనం వహించడం ప్రజాస్వామ్యానికే పెద్ద ముప్పుగా పరిణమించింది.
ఇటీవల జిల్లాలోని పలు రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అకస్మాత్తుగా మెరుపు దాడులు నిర్వహించారు. కోట్ల విలువైన ధాన్యం నిల్వలు గల్లంతైనట్లు రికార్డుల తనిఖీల్లో తేలడంతో విచారణ మరింత ముమ్మరమైంది.రాష్ట్రవ్యాప్తంగా సీఐడీ దాడులు, మిల్లర్ల అరెస్టులు జరుగుతున్నప్పటికీ, అసలు దోషులెవరో తేలక సాధారణ ప్రజలు తీవ్ర తికమకలో ఉన్నారు. చట్టపరమైన లొసుగుల ఆధారంగా కొందరు మిల్లర్లు తప్పించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ప్రజాధనాన్ని దండుకుని విలాసవంతమైన బంగ్లాలు, కార్లతో తిరుగుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, అధికారుల-రాజకీయ నేతల అపవిత్ర బంధాన్ని చేధించి సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సీఎంఆర్ ధాన్యం అంకెల గారడి

- గల్లంతైన సీఎంఆర్ ధాన్యం: లక్షలాది క్వింటాళ్లు
- పక్కదారి పట్టిన ప్రజాధనం: కోట్లాది రూపాయలు
- ఇప్పటివరకు జరిగిన విజిలెన్స్ దాడులు: డజనుకు పైగా మిల్లుల్లో
- రికార్డయిన అక్రమాలు/లొసుగులు: 100% తేడాలు
- రికవరీ అయిన నిధుల శాతం: అత్యల్పం (దాదాపు సున్నా)
- అధికారుల పర్యవేక్షణ లోపం: 365 రోజులు
- రాజకీయ అండదండలు: వందకు వంద శాతం

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 నవంబర్ 2026

భూ తగాదాల పరిష్కారానికి రీ సర్వే

- రీ సర్వే పనులు పారదర్శకంగా నిర్వహించాలి
- రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి
- ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నడిగడ్డ, నవంబర్ 3 (జనం సాక్షి) : ప్రభుత్వ భూములను కాపాడడంతోపాటు భూ తగాదాలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే పనులు చేయిస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మానవపాడు మండలం జల్లాపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న రీసర్వే పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. నిబంధనలను అనుసరించి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, హద్దుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతుల పొలాల సర్వే విషయంలో పక్క చేను రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇరుపక్షాల సమక్షంలో నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు సర్వేకు సహకరించాలని, ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.సమీప పొలాల రైతులు కలెక్టర్ ను కలవగా వివిధ అంశాలపై మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు రబీ సీజన్ లో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లలో ఉన్న కొద్దిపాటి నీళ్లను వచ్చే వర్షాకాలం వరకు తాగునీటి అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. పంటలకు సాగునీటిని విడుదల చేసే అవకాశం లేదని తమ బోరు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా మాత్రమే పంటలు సాగు చేయాలని, ఎలాంటి నీటి వసతులు లేని రైతులు ఏ పంటలు సాగు చేయవద్దన్నారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని, పాడిపై కూడా రైతులు దృష్టి పెడితే మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. సమీపంలోని ఆర్డిఎస్ కాలువను పరిశీలించిన కలెక్టర్ నీళ్లు చాలా తక్కువగా ఉన్నందున రైతులు తుంగభద్ర నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఉపాధి హామీలో ఒక్కో గ్రామ పంచాయతీలో రూ.1.0 కోటి విలువైన పనులను చేసేందుకు అవకాశం ఉందన్నారు. విబిజి రాంజీ పథకంలో జలసిరి కార్యక్రమంలో పంట కుంటలు, ఇంకుడు గుంతలు, తదితర జల సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతు కూలీలు వ్యవసాయ పనులు చేయలేకపోతున్నామని నిరుత్సాహ పడకుండా ఉపాధి హామీ పనులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే లబ్ధి పొందవచ్చన్నారు. ఉపాధి హామీలో కాలువల వెంట పెరిగిన ముళ్ల పొదలను తొలగించడంతోపాటు డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ ఛానల్ కాలవల్లో పూడికతీత పనులు కూడా చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ పర్యటనలో సర్పంచ్ నందిని, సర్వే ఏడి నూకరాజు, తహసిల్దార్ మన్సూర్ అలీ సిద్ధికి, డిప్యూటీ తహసిల్దార్ రాములు, ఆర్ఐ గురురాజు, సర్వేయర్ ఇలాయత్, తదితరులున్నారు.

సమాజంతో స్వేచ్ఛగా పరుగులు తీయాలి

- వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ



చేర్యాల, నవంబర్ 3 (జనంసాక్షి) : సమాజంతో స్వేచ్ఛగా పరుగులు తీయడానికి వాహనాలు ఎంతో అవసరమని, ఆ వాహనాలు నేడు అందడం ఎంతో సంతోషంగా ఉందని చేర్యాల మండల వికలాంగులు పేర్కొన్నారు.చేర్యాల మండలం చుంచనకోట, గుర్జకుంట గ్రామాలకు చెందిన ఇద్దరు వికలాంగులకు ఎన్జీఓఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఆలింకో బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేశారు.మంగళవారం హైదరాబాద్ లో చుంచనకోట సర్పంచ్, సామాజిక సేవకుడు గొర్రె శ్రీనివాస్, ఎన్ పి ఆర్ డి చేర్యాల డివిజన్ అధ్యక్షుడు తుమ్మలపల్లి అనిల్, ఉపాధ్యక్షుడు తాండ్ర సత్తయ్యలు కలిసి ఈ వాహనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద వికలాంగులైన కర్రె రేణుక, గొల్లపల్లి వెంకటేశ్వర్లుకు వాహనాలు అందించడం వల్ల వారు స్వేచ్ఛగా తిరగడానికి, తమ పనులు తాము చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.అనంతరం వాహనాలు పొందిన లబ్ధిదారులు సర్పంచ్ శ్రీనివాస్, అనిల్, సత్తయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహబూబ్‌నగర్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



జడ్చర్ల, నవంబర్ 3 (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జడ్చర్ల మండలం ఆలూరు గ్రామంలో సీపీఐ రాష్ట్ర బృందంతో కలిసి ఆయన ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఆలూరుకు చెందిన రైతు బొడ్డు రాజు 4 ఎకరాల్లో వరి సాగు చేయగా, బోర్లు ఎండిపోయి ఒక్క ఎకరా పంట కూడా చేతికి రాలేదని రామకృష్ణ ఎదుట వాపోయాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం పట్ల రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.30 వేల, పత్తి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, జడ్చర్ల మండల కార్యదర్శి భాగి కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, కొండపల్లి రాము, సత్యనారాయణ రెడ్డి, మహేష్, పద్మావతి, ఇందిరా, సుందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూముల సంరక్షణపై రైతులకు అవగాహన

- భూసార పరిరక్షణతోనే భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలలు



అచ్చంపేట, నవంబర్ 3 (జనం సాక్షి) : మండలంలోని నడింపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అచ్చంపేట వారి ఆధ్వర్యంలో మంగళవారం 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా సాగు భూముల సంరక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గోపి పద్మ, ఉపసర్పంచ్ కాశీం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అచ్చంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ భూముల పరిరక్షణ, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, భూసారాన్ని పెంపొందించడం, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ప్రతి రైతు బాధ్యత అని పేర్కొన్నారు. నేల సారాన్ని తగ్గించే పద్ధతులకు దూరంగా ఉంటూ భూసార పరిరక్షణకు అనుకూలమైన సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగం, పంట మార్పిడి, సమతుల్య ఎరువుల యాజమాన్యం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వివరించారు. పంట అవసరాలు, నేల స్వభావాన్ని బట్టి ఎరువులు, పురుగుమందులను వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని తెలిపారు. అలాగే నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, నేల కోతను నివారించడం, పంట అవశేషాలను కాల్చకుండా సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ భూములను భవిష్యత్ తరాలకు సారవంతంగా అందించేందుకు ప్రతి రైతు భూసార పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతులతో వ్యవసాయ సంబంధిత అంశాలపై చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. కృష్ణయ్య, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ సురేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి సీహెచ్. మౌనిక, హెచ్ఈఓ గోవర్ధన్‌తో పాటు నడింపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



ఉప్పునుంతల, నవంబర్ 3 (జనం సాక్షి) : ఆశా వర్కర్లకు కనీసం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు అనూష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఆశా వర్కర్లు ప్రభుత్వానికి సేవలందిస్తున్నప్పటికీ, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులైన డాక్టర్ స్వప్న, బిక్కు నాయక్‌లకు ఆశా వర్కర్లు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని కోరారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 15వ తేదీలోగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే అదే రోజు నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సంబంధిత కమిషనర్ వెంటనే స్పందించి ఆశా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు అనూషతో పాటు పద్మ, గెలవమ్మ, సంగీత, నర్మద తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



పెద్ద శంకరంపేట, నవంబర్ 3 (జనం సాక్షి) : గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని మార్కెట్ యార్డ్ గోదాంలో డిసిసిబి ఆధ్వర్యంలో, కమలాపూర్ గ్రామంలో సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు. మెదక్ జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకి పర్యలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు సకాలంలో మద్దతు ధర అందేలా సంబంధిత అధికారులు, సొసైటీ ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ నాగరాజు, ఎంపీ ఓ జాకీర్ హుస్సేన్, పి ఏ సి ఎస్ సీఈఓ రవీందర్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పెరమండ్ల గౌడ్, నాయకులు దానంపల్లి నారా గౌడ్ మురళీ పంతులు ,దాచ సంగమేశ్వర్ ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

- మెడికల్ షాపులపై అధికారుల కొరడా



వనపర్తి, నవంబర్ 3 (జనం సాక్షి) : పట్టణంలోని వివిధ ఆసుపత్రులకు అనుబంధంగా నిర్వహిస్తున్న మందుల దుకాణాలపై టీజీ సేఫ్–ఔషధ నియంత్రణ విభాగం అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఉప సంచాలకురాలు అంజుమ్ అబిద ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మందుల విక్రయానికి సంబంధించిన నిబంధనల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. మందుల దుకాణాల్లో నమోదిత ఔషధ నిపుణులు అందుబాటులో ఉన్నారా, మందుల కొనుగోలు, విక్రయాల రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా, వైద్యుల చీటీ లేకుండా విక్రయించరాని మందులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారా అనే అంశాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా షెడ్యూల్ హెచ్--1 మందుల విక్రయ వివరాల నమోదు, గడువు ముగిసిన మందుల నిల్వలు, మందుల భద్రపరిచే విధానం, అనుమతులు, ఇతర చట్టబద్ధమైన పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన దుకాణాల యాజమాన్యాలకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వారి వివరణలను పరిశీలించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మందులు అందించడమే ఔషధ నియంత్రణ విభాగం లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రతి మందుల దుకాణంలో నమోదిత ఔషధ నిపుణుడు నిరంతరం అందుబాటులో ఉండాలని, ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మందుల విక్రయంలో అక్రమాలు, నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్ సహాయ సంచాలకురాలు డి. సరిత, రంగారెడ్డి సహాయ సంచాలకుడు జి. ప్రసాద్, వనపర్తి జిల్లా ఔషధ నియంత్రణ అధికారి రష్మితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

అక్రమ రోడ్డు తవ్వకాలపై చర్యలు తీసుకోండి

- పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్



చేర్యాల, నవంబర్ 3 (జనంసాక్షి) : ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా రోడ్ల తవ్వకాలు చేపపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకొని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అధికారులను కోరారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని అంగడి బజార్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరా పైపులైన్ల పేరుతో చేర్యాల అంగడి బజార్ చౌరస్తా నుండి పెద్దమ్మ గడ్డ వరకు అధిక సంఖ్యలో రోడ్ల తవ్వకాలు జరపడంతో బీటీ పూర్తిగా ధ్వంసమై అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఆకునూరు వరకు కొన్నిచోట్ల తవ్వకాలు జరిపి నిర్లక్ష్యంగా వదిలేశారని అన్నారు. ఈ ప్రాంతం మీదుగా వందలాది మంది ఇతర ప్రాంతాలకు నిత్యం ప్రయాణం చేస్తుంటారని, ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతూ కొంతమందికి రోడ్డు ప్రమాదం జరిగి గాయలపాలైన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఆర్ అండ్ బీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే అక్రమంగా రోడ్డు తవ్వకాలు చేపట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకొని తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. వారి వెంట సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల కార్యవర్గ సభ్యులు గూడెపు సుదర్శన్, పోషబోయిన పరమ శేఖర్ ఉన్నారు.

లింగ నిర్ధారణపై ఉక్కుపాదం



గద్వాల, నవంబర్ 3 (జనం సాక్షి) : గద్వాల జిల్లాలో అక్రమ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టాలని డీఎంహెచ్ డాక్టర్ సంధ్య కిరణ్మయి ఆదేశించారు. మంగళవారం గద్వాలలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రసూన రాణి పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్కానింగ్ కేంద్రాల్లో నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. పీసీపీఎన్డీటీ చట్ట నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు స్కానింగ్ చేసే సమయంలో నిబంధనల ప్రకారం ఫామ్-ఎఫ్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ కేంద్రంలోనూ సీసీ కెమెరాల నిఘా ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని బోర్డులను ప్రదర్శించాలన్నారు. అనుమతి లేని స్కానింగ్ మిషన్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు పాటించని ల్యాబ్‌ల లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గట్టి నిఘా ఉంచాలన్నారు. ఎక్కడైనా అక్రమ పరీక్షలు జరుగుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే స్పందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమాజంలో ఆడపిల్లల నిష్పత్తిని కాపాడటానికి అందరూ బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

కొండపాక, నవంబర్ 3 (జనం సాక్షి) : కొండపాక మండల పిహెచ్సి పరిధిలోని ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం 18000 నిర్ణయించాలని సిఐటియు మండల కార్యదర్శి జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల బాల నర్సయ్య డిమాండ్ చేశారు. కొండపాక పిహెచ్సి సిలో శాంత లక్ష్మికు ఆశా వర్కర్ రా డిమాండ్లతో కూడిన డిసెంబర్ 15 నుండి సమ్మె సమ్మెలోకి వెళ్తామని తెలియజేస్తూ నోటీసును ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా బాల్ నరసయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తున్న ఆశా వర్కర్లకు తగిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఆశా వర్కర్లకు రూ.18,000 కనీసవేతనం అమలు చేయాలి.ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ ఆశా వర్కర్లకు 50 లక్షల ఇన్సూరెన్స్ 50000 మట్టి ఖర్చులను ఇవ్వాలన్నారు రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు చెల్లించాలని వారితో సకాలంలో సగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. ప్రతి ఆదివారం పండుగకు సంవత్సరానికి 20 రోజులు క్యాజువల్ ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని మరియు ప్రస్తుత సెలవులు నిర్ణయించాలన్నారు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలన్నారు ఆశా వర్కర్లను రెండవ పిఆర్సి లో కలిపి 30000 కనీస వేతనం నిర్ణయించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని రెండు డిఏలు ఆశలకు వర్తింప చేయాలన్నారు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఉంటేనే అమలు చేయాలన్నారు. డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం ఇప్పటికైనా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ 15 నుండి సమ్మెలోకి వెళ్దామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు మాజీ మండల నాయకులు ఎం కనకాచారి మండల ఆశా వర్కర్స్ గాలి దీన కళ్యాణి కనకవ్వ లింగేశ్వరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



భూముల ఠీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి

□ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి) : భూముల ఠీ సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ముధోల్ మండలం చందాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల ఠీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం పట్టా భూముల విస్తీర్ణం, సాగునీటి వసతులు ఉన్న భూములు, ఇతర భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా భూ హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఠీ సర్వే చేపట్టాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ శ్రీలత, సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ అచలాపూర్ విద్యార్థిని అమూల్య ఎంపిక



తాండూర్, నవంబర్ 03(జనం సాక్షి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మంచిర్యాల జిల్లా, జెడ్పీహెచ్ఎస్ అచలాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని మారిశెట్టి అమూల్య ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఏ. సాంబమూర్తి తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలలో మంచిర్యాల జిల్లా జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో మంచిర్యాల జిల్లా జట్టు గోల్డ్ మెడల్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన మారిశెట్టి అమూల్య టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది. ఈ ప్రతిభ ఆధారంగా ఈనెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు (05-11-2026 నుండి 07-11-2026) పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించబోయే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అమూల్య ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, జిల్లాకు పేరు తెచ్చిన విద్యార్థిని అమూల్యను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చిలుకమ్మ, గ్రామ సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్, వార్డు మెంబర్ పాపయ్య, సీనియర్ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, గ్రామ పెద్దలు మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ

□ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 3 (జనంసాక్షి) : మంచిర్యాల పట్టణంలోని భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన శ్రీ విశ్వనాథ ఆలయాన్ని మరింత వైభవంగా పునర్నిర్మించాలనే సంకల్పంతో చేపట్టిన పనుల్లో భాగంగా, ఆలయ పునర్నిర్మాణ పనులను మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన విశ్వనాథ ఆలయాన్ని ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా ఉంటుందని తెలిపారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధతో ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జూ ముక్త రవి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గుండ సుధాకర్, మంచిర్యాల జిల్లా ఆర్జీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, కార్పొరేటర్లు ,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట మున్సిపల్ కమిషనర్ భాస్కర్ బదిలీ

నర్సంపేట, నవంబర్ 03 (జనం సాక్షి) : నర్సంపేట పట్టణ మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కే. నరేష్ రెడ్డిని నూతన కమిషనర్‌గా నియమించారు. ఇటీవల "జనం సాక్షి" దినపత్రికలో ప్రచురితమైన కథనం నేపథ్యంలోనే ఈ బదిలీ జరిగినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. పట్టణంలోని సమస్యలపై జనం సాక్షి ప్రచురించిన కథనం ప్రజల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ఈ కథనం అనంతరం ఉన్నతాధికారులు స్పందించి కమిషనర్‌ను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్రికల కథనాలు ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడతాయనడానికి ఇది నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. నూతన కమిషనర్ గా నరేష్ రెడ్డి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. పట్టణ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టభద్రుల ఓటు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి


□ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి, నవంబరు 03 (జనంసాక్షి) : నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా పట్టభద్రుల ఓటు నమోదును అర్హులైన ప్రతి ఒక్కరు బాధ్యతగా తీపుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాం గ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఎమ్మెల్సీ నమోదు కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 6 వ తేదీ వరకు అవకాశం ఉందని, అందుకు పార్టీ నాయకులు ఓటరు నమోదు చేయించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ మూడేండ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పలాలు అర్హులైన అందరికి అందుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు. నాయకులు ప్రతి పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేసేవిధంగా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ఉపాది అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని అన్నారు. రాష్ట్రం లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లాంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ పథకాలను ఇంటింటి వెళ్లి పట్టభద్రులకు వివరించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. వీలైనంత ఎక్కువ మంది పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత ఉందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పోగు శ్రీనివాస్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, లావుడ్యా భాస్కర్, కమ్మగాని నాగయ్య, వీరమనేని యాకాంతరావు, గాదెపాక భాస్కర్, సుధాకర్‌రెడ్డి, సలేంద్ర శ్రీనివాస్. సలేంద్ర సందీప్. ఎండి యాకూబ్. ఎండి. అబ్బాస్‌అలీ. తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల పేరుతో వెలుగుతున్న దోపిడీ!

□ చీకట్లో మగ్గుతున్న గ్రామాలు
□ రికార్డుల్లో మోగుతున్న బిల్లులు
□ అధికారుల అండతో సర్పంచుల దోపిడీ
□ పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం



వెంకటాపూర్(రామప్ప), నవంబర్ 03(జనం సాక్షి): వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో విద్యుత్ దీపాల పేరుతో జరుగుతున్న దోపిడీకి సంబంధించి సంచలన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. పలు గ్రామాల్లో రాత్రి పూట అడుగు పెడితే చీకటి తప్ప వెలుగు కనిపించటం లేదు.వీధుల్లో నడవాలంటే టార్చ్ లైట్ పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగకున్న పట్టించుకునే నాధుడు కరువయ్యారు. కానీ,పంచాయతీ రికార్డుల్లో మాత్రం ప్రతి నెలా విద్యుత్ దీపాలు వెలిగినట్లు, కొత్త విద్యుత్ దీపాలు వేసినట్లు, పాత విద్యుత్ దీపాలు రిపేర్ చేసినట్లు లెక్కలు కనిపిస్తున్నాయి. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు క్షేత్రస్థాయిలో కనిపించటం లేదు. అవి కేవలం కాగితాలపైనే కరిగిపోతున్నాయి. వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ దీపాలు వేశామని, వైర్లు మార్చామని, హోల్డర్లు, స్విచ్ లు, స్టార్టర్లు కొన్నామని సర్పంచులు, కార్యదర్శులు రాసుకుంటున్న బిల్లులను బయట మార్కెట్ ధరలతో పోల్చి చూస్తే అసలు దోపిడీ ఎంత పెద్దదో అర్థమవుతుంది. బయట చాలా తక్కువ ధరకు దొరికే విద్యుత్ దీపాలకు పంచాయతీ రికార్డుల్లో మాత్రం భారీ ధరలు చూపిస్తూ బిల్లులు రాసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒకే కంపెనీ విద్యుత్ దీపానికి ఒక్కొక్క గ్రామాల్లో ఒక విధమైన ధర ఉండటం వెనుక కారణమేమిటనేది అర్థం చేసుకోవచ్చు. అట్టి బిల్లులు ఎక్కడ రాశారు.. ఎవరు రాశారు.. అన్నదే పెద్ద ప్రశ్నగా మారింది. సర్పంచులు నిజంగా షాపుకు వెళ్లి విద్యుత్ దీపాల సరుకు కొన్నారా అంటే సమాధానం లేదనే చెబుతున్నారు.షాపు యజమానులకు కొంత కమీషన్ ఇచ్చి విద్యుత్ దీపాలు కొనకుండానే కొన్నట్టు బిల్లు మాత్రం తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ బిల్లుపై కార్యదర్శి నోట్ రాస్తే, ఉప సర్పంచి సంతకం పెడతాడు.కార్యదర్శులు, ఏఈ లు కళ్లు మూసుకుని ఓకే అంటారు. అంతే ప్రజల సొమ్ము సర్పంచ్ జేబులోకి వెళ్ళిపోతుంది. క్షేత్రస్థాయికి వెళ్లి విద్యుత్ దీపం వెలిగిందా..? లేదా..? వైరు వేశారా..?లేదా..? అని చూడాల్సిన కార్యదర్శులు కార్యాలయానికే పరిమితమై సంతకాలు చేస్తుండటంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. సర్పంచులు, కార్యదర్శులు, ఉప సర్పంచులు కుమ్మకైనట్టుగా మండలం లో చర్చ జరుగుతోంది. ప్రతి బిల్లుకు సంతకం చేసినందుకు కమీషన్ ఫిక్స్ చేసి మిగతా మొత్తాన్ని పంచుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.కొన్ని గ్రామాల్లో అసలు స్తంభమే ఉండదు. మరికొన్ని గ్రామాల్లో స్తంభం ఉన్నా విద్యుత్ దీపం ఉండదు. అలాగే కొన్ని చోట్ల విద్యుత్ దీపం ఉన్నా కరెంట్ ఉండదు.కానీ, ప్రతి నెలా విద్యుత్ దీపాలు మార్చినట్లు, రిపేర్ చేసినట్లు బిల్లులు మాత్రం కరెక్ట్ గా వస్తున్నాయి. బ్లీచింగ్, ఫాగింగ్, మోటార్ రిపేర్ తోపాటు విద్యుత్ దీపాల కొనుగోలు కూడా ఒక పెద్ద దందాగా మారింది.విద్యుత్ దీపాలు వెలగక మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాత్రి వేళ బయటకు రావాలంటే భయపడుతున్నారు. దోమల బెడదతోపాటు చీకట్లో ప్రమాదాలు పెరుగుతున్నాయి.బిల్లులు నిజమో కాదో క్షేత్ర స్థాయిలోకి వెళ్లి చూడాల్సిన కార్యదర్శులు, ఏఈలు ఎందుకు చూడటం లేదని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల సొమ్ము విద్యుత్ దీపాల పేరుతో కరిగిపోతుందని, జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి వెంటనే స్పందించి ప్రతి పంచాయతీలో విద్యుత్ దీపాల బిల్లులు, మార్కెట్ ధరలు పోల్చి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.తప్పుడు బిల్లు ఏర్పాటు చేసి దోచుకున్న సొమ్మును రికవరీ చేసి బాధ్యులైన సర్పంచులు, కార్యదర్శులు, ఏఈలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్



గుడిహత్నూర్: నవంబర్ 3(జనం సాక్షి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల హాజరు శాతం, పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? ఆహారం రుచిగా ఉందా? నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, భోజన తయారీ, సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం వంటశాల, పాఠశాల ఆవరణలోని కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. అక్కడ సాగు చేస్తున్న వివిధ రకాల కూరగాయల మొక్కలను తిలకించారు. తోటలో పండించిన తాజా కూరగాయలను విద్యార్థుల భోజనానికి వినియోగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి తోటల ద్వారా విద్యార్థులకు ప్రకృతి, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ప్రయోగశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలు, ప్రాజెక్టులను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన యోగా, సంగీత గదులను ప్రారంభించారు. చదువుతో పాటు సృజనాత్మకత, శారీరక, మానసిక వికాసానికి విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

పుష్కర ఘాట్ల నిర్మాణం కోసం గోదావరి నదిలో జెసిపితో మట్టి తవ్వకాలు

□ తవ్విన మట్టిని టిప్పర్ల ద్వారా హైటెక్ సిటీలోని ప్లాట్స్‌లోకి తరలింపు



మంచిర్యాల ప్రతినిధి , అక్టోబర్ 3 (జనంసాక్షి) : 2027 లో రాబోయే గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పుష్కర ఘాట్ల నిర్మాణం రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. మంచిర్యాల జిల్లా గోదావరి నదిలో పుష్కర ఘాట్ల నిర్మాణం కోసం సంబంధిత కాంట్రాక్టర్ మంగళవారం ఉదయం నుండి పునాది నిర్మాణంలో భాగంగా జెసిబి తో మట్టిని తీస్తూ మట్టిని టిప్పర్ల లోడ్ చేశారు. లోడ్ చేసిన టిప్పర్లు మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటీ లోని ఒక వెంచర్ లోని ప్లాట్స్ లో మట్టిని అన్ లోడ్ చేశారు . మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రియల్ ఎస్టేట్ సంస్థ వ్యాపారికి చెందిన ప్లాట్లలో గోదావరి పుష్కర ఘాట్ల లో తీసిన మట్టిని తరలించినప్పటికీ సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోకపోవడం జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది . నిబంధనలో మేరకు సంబంధిత కాంట్రాక్టర్ తీసిన మట్టిని ప్రభుత్వ అవసరాల మేరకు మాత్రమే వినియోగించాలి. తీసిన మట్టిని సమీపంలో స్టోరేజ్ చేసి నిర్మాణం పూర్తి అయిన తర్వాత అక్కడే చదును చేయాల్సి ఉంటుంది .గోదావరి నదిలో తీసిన మట్టిని నిబంధనలకు విరుద్ధంగా సంబంధిత కాంట్రాక్టర్ వెంచర్ యజమానులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి .అక్రమ మట్టి తరలింపు పై మైనింగ్ అధికారిని జనం సాక్షి ప్రతినిధి సంప్రదించగా దానికి మాకు సంబంధం లేదని ఆ మట్టి తరలింపు పై ఇరిగేషన్ శాఖ మాత్రమే చూస్తుందని తెలిపారు . ఇరిగేషన్ శాఖ డిఈ గారిని సంప్రదించడానికి ఫోన్ చేయగా హలో అని విషయం చెప్పేలోపు మళ్లీ చేస్తానని ఫోన్ కట్ చేశారు . జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపు పై స్థానికులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

వరంగల్ నగర అభివృద్ధి ప్రాజెక్టుల డీపీఆర్‌లపై సమీక్ష



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (జనం సాక్షి) : అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు సంబంధించి వరంగల్ నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా ఇతర అధికారులు మంగళవారం న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు.హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ నగరానికి సంబంధించి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధి, వరంగల్ బస్ స్టేషన్, హనుమకొండ చౌరస్తా అభివృద్ధి, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టుల డీపీఆర్‌లపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వరంగల్ నగరానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనుల ప్రాజెక్ట్ ల డీపీఆర్‌ల పట్ల కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నవీన్ మిట్టల్‌తో జీపీ కార్యదర్శుల సంఘం నాయకుల భేటీ

చెన్నారావుపేట, నవంబర్ 3 (జనం సాక్షి) : నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ను పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయనకు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి జి ఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, టీపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కృష్ణంరాజు, చెన్నారావుపేట మండల అధ్యక్షులు గొడిశాల వికాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కత్తెరపల్లి రాజులు పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

భూపాలపల్లిలో ఘనంగా రీజినల్ స్థాయి కల్చరల్ మీట్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో రీజినల్ స్థాయి కల్చరల్ మీట్ స్థానిక కృష్ణా కాలనీ మినీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యక్రమాల గౌరవ కార్యదర్శి మర్రి సాయికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుని చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ మీట్‌లో జానపద గీతాలు, లలిత గీతాలు, గజల్స్, కర్ణాటక సంగీతం, వీణ, గిటార్, సింథసైజర్, వయోలిన్, క్లారినెట్, బాంజో, హార్మోనియం వంటి సంగీత విభాగాలతో పాటు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, ఆర్కెస్ట్రా తదితర విభాగాల్లో కళాకారులు ప్రతిభ ప్రదర్శించారు. ప్రతిభావంతులను ఎంపిక చేసి కంపెనీ స్థాయి పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేత కుంట రాజు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, కల్చరల్ కెప్టెన్ ఏ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారు

□ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



ఆత్మకూర్, నవంబర్3 (జనం సాక్షి): ఆత్మకూరు మండలంలోని కటాక్ష పూర్ హౌస్ బుజ్గూర్ ఉన్న కొంతమంది భూ ఆక్రమదారులు నా యొక్క పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా ప్రచారం చేసి కబ్జా చేయాలని చూస్తున్నారని బాధితుడు ముక్క సుధాకర్ అన్నారు. ఆత్మకూరు మండలం కటాక్షపూర్ , హౌస్ బుజ్గూరు గ్రామాల మధ్య సర్వే నెంబరు 125 లో 36 గుంటల భూమి వద్ద విలేకరుల సమావేశంలో బాధితుడు మాట్లాడుతూ నేను 2006 లో పట్టాదారి నుండి పూరే ప్రభాకర్ ,పూరే సత్యనారాయణ వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని ఆయన తెలిపారు. అలాగే ఆత్మకూర్ తాసిల్దార్ నుండి ధరణి ద్వారా కూడా పట్టాదారు పాసుపుస్తకం పొందినాను అని అన్నారు. నేను వృత్తిరీత్యా మణుగూరులో ఉంటున్నందున నా పట్టా భూమిపై కొందరుల కన్ను పడిందని దానిని కబ్జా చేయాలని చూస్తున్నారని బాధితుడు ముక్క సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు నా యొక్క పత్రాలను తెలంగాణ ప్రభుత్వం ధరణి ద్వారా పట్టేదారు పాసుపుస్తకం ఉన్న తర్వాత కూడా అది ప్రభుత్వ భూమి అని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు ప్రభుత్వం భూమి సర్వేనెంబర్ 124 ఉన్నదని . నాది సర్వేనెంబర్ 125 లో ప్రభుత్వ భూమి ఒక గజం ఉన్న కూడా ప్రభుత్వానికి ఇస్తా రెవెన్యూ అధికారులు స్వయంగా సర్వే చేసి నా భూమిని నాకు వదిలి ప్రభుత్వ భూమి ఉంటే స్వాధీనం చేసుకోవచ్చని ముక్క సుధాకర్ అన్నారు. అధికారులకు నా యొక్క దస్తావేజు అన్ని అధికారులకు అందజేసినాను రెవెన్యూ అధికారులే సర్వే చేసి నా యొక్క భూమి నాకు ఇప్పించాలని రెవెన్యూ అధికారులను పోలీసులను కోరినానని బాధితుడు తెలిపారు. నా యొక్క పట్టా భూమిని కబ్జా చేయడం ఎంతవరకు సమంజసమని అధికార పార్టీ నేతలను ప్రశ్నిస్తున్నానని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 నవంబర్ 2026

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పేదల అభ్యున్నతికి పెద్దపీట
- అభివృద్ధి పనులకు శ్రీకారం
- తెల్దారుపల్లిలో రూ.3.12 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం
- అర్హులైన రైతులందరికీ భూధార్ కార్డులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం రూరల్, నవంబర్ 3 (జనం సాక్షి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో 14, 15, 16వ వార్డుల్లో రూ.312.90 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారీ వర్షంలోనూ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు ప్రభుత్వంపై వారికున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. తెల్దారుపల్లి పరిధిలోని మూడు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 33 నెలల్లో తెల్దారుపల్లి ప్రాంతంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.16.86 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 105 ఇందిరమ్మ ఇళ్లను రూ.5.25 కోట్లతో



మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం ద్వారా సంక్షేమ ఫలాలు పేదల ఇంటి గడపకు చేరుతున్నాయని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గత 33 నెలల్లో మహిళలకు రూ.73 వేల కోట్లను సున్నా వడ్డీపై అందించినట్లు చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

భూములకు భూధార్..రైతులకు భరోసా..

రాష్ట్రంలో సుమారు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం భూముల సమగ్ర సర్వే చేపట్టి ప్రతి అంగుళానికి సంబంధించిన వివరాలను నమోదు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. భూముల యజమానులకు పూర్తి భరోసా కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సర్వేను వెంటనే చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. తెల్దారుపల్లిలో త్వరలోనే గ్రామవ్యాప్తంగా సర్వే పూర్తి చేసి, అర్హులైన వారందరికీ భూధార్ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు తరహాలో ప్రతి భూమికి క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డు జారీ చేస్తామని పేర్కొన్నారు. దీంతో భూముల వివరాల్లో పారదర్శకత పెరగడంతోపాటు రైతులకు భరోసా కలుగుతుందని అన్నారు.

తెల్దారుపల్లి ప్రజల సౌకర్యార్థం నాగార్జునసాగర్ కాల్వపై రూ.5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతిగా పనిచేస్తోందని స్పష్టం చేశారు.

నాణ్యతతో పనులు పూర్తి చేస్తాం..

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. గత నెల, నెలన్నర రోజుల వ్యవధిలోనే ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లో సుమారు రూ.35 నుంచి రూ.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. చేపట్టిన ప్రతి పనిని వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేందుకు యంత్రాంగం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ తమ్మినేని నవీన్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతాంగ పోరాట స్ఫూర్తిని చాటే 'రైతు యుద్ధ గీతం' ఆవిష్కరణ

- తెలుగు, హిందీ భాషల్లో సుద్దాల అశోక్ తేజ రచన
- ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ముషీరాబాద్, నవంబర్ 3 (జనం సాక్షి) : రైతాంగ పోరాటాలు, త్యాగాలు, హక్కుల సాధన కోసం సాగిస్తున్న ఉద్యమాల స్ఫూర్తిని చాటేలా ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రచించిన 'కుత కుత మనే మా రక్తం – రైతు యుద్ధ గీతం' పాటను తెలుగు, హిందీ భాషల్లో రూపొందించి ఘనంగా ఆవిష్కరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి నల్లగొండలో నిర్వహించనున్న ఆల్ ఇండియా రైతు మహాసభల నేపథ్యంలో ఈ ప్రత్యేక గీతాన్ని రూపొందించారు.ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం నాయకులు జూలకంటి రంగారెడ్డి ఈ గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రైతుల కష్టాలు, కన్నీళ్లు, త్యాగాలు, హక్కుల కోసం వారు సాగిస్తున్న ప్రజాస్వామ్య పోరాటాల స్ఫూర్తి ఈ గీతంలో అద్భుతంగా ప్రతిబింబించాయని అన్నారు. రైతాంగాన్ని చైతన్యవంతం చేయడంతో పాటు వారి హక్కుల సాధన పోరాటాలకు మరింత ఉత్తేజాన్ని అందించే శక్తి ఈ పాటకు ఉందని పేర్కొన్నారు. రైతాంగ ఉద్యమ స్ఫూర్తిని తెలుగు, హిందీ భాషల్లో అద్భుతమైన సాహిత్యంతో ఆవిష్కరించిన సుద్దాల అశోక్ తేజను ఆయన అభినందించారు. అనంతరం గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆవేదన, పోరాటాలను ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ గీతాన్ని రచించినట్లు తెలిపారు. రైతుల ఉద్యమాలకు అక్షర రూపం ఇచ్చే ప్రయత్నమే ఈ పాట అని పేర్కొన్నారు. ఈ గీతం దేశవ్యాప్తంగా రైతాంగాన్ని చైతన్యపరిచే ఉద్యమ గీతంగా గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. అబ్బాస్, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, టి. వీరారెడ్డి, నారీ ఐలయ్య, స్మైలాబ్ బాబు, శ్రీరామ్ నాయక్, అరిబండి ప్రసాదరావు, రవీందర్, లెల్లల బాలకృష్ణ, ప్రజానాట్యమండలి కార్యదర్శి కట్ట నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, నవంబర్ 3 (జనంసాక్షి) : మురసు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు.వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అధికారుల సూచనలను అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజు, డిపిఓ యాదగిరి, డిఎస్ఓ మోహన్ బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తాళాలకే పరిమితమైన జీవనోపాధుల కేంద్రం

- ప్రజాధనం వృథా
- రూ. లక్షలతో నిర్మించిన భవనం నిరుపయోగం
- శిథిలావస్థకు చేరుతున్న క్లస్టర్ లెవెల్ రిసోర్స్ సెంటర్
- పట్టించుకోని అధికారులు.. స్థానికుల నిరసన

పెద్దవూర, నవంబర్ 3 (జనంసాక్షి) : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం, వివిధ రకాల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం నిర్మించిన 'ప్రాంతీయ జీవనోపాధుల వనరుల కేంద్రం' (సిఎల్‌ఆర్‌సి) భవనం అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ కేంద్రం సేవలు ప్రజలకు అందకపోవడంతో వృథాగా దర్శనమిస్తోంది.

2007లో ప్రారంభించినా.. అదే నిర్లక్ష్యం!

ఈ భవనాన్ని 2007వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు భవనం ముందున్న శిలాఫలకం స్పష్టం చేస్తోంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వారికి ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఈ భవనం, ప్రారంభమైన కొద్దిరోజులకే తాళాలకే పరిమితమైంది. సరైన నిర్వహణ లేకపోవడంతో భవనం గోడలకు పగుళ్లు వచ్చి శిథిలావస్థకు చేరుకుంటోంది. పరిసర ప్రాంతాల్లో విపరీతంగా పిచ్చిచెట్లు, పొదలు పెరిగిపోయి భయంకర వాతావరణం నెలకొంది.

పట్టించుకోని అధికారులు

అంతటి ప్రజాప్రయోజనకరమైన భవనం అందుబాటులో ఉన్నప్పటికీ దాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం వల్లే లక్షలాది రూపాయల ప్రజాధనం నీటిపాలవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలి

సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు తక్షణమే స్పందించి తాళం వేసి ఉన్న క్లస్టర్ లెవెల్ రిసోర్స్ సెంటర్ (సిఎల్‌ఆర్‌సి) భవనానికి మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ కార్యక్రమాలు, కుటీర పరిశ్రమలు, ఉపాధి కల్పన కార్యకలాపాలు నిర్వహించి భవనాన్ని సద్వినియోగం చేయాలని, ప్రజాధనం వృథా కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పరఖ్-2027 పరీక్షలకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలి



పెద్దేముల్, నవంబర్ 3 (జనంసాక్షి) : పరఖ్-2027 పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్. సునీత సూచించారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండోరోజు పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవంబరు 2027లో నిర్వహించనున్న పరఖ్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 2, 5, 8వ తరగతులు చదువుతున్న విద్యార్థులను వరుసగా 3, 6, 9వ తరగతుల అభ్యసన ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు. పరీక్షల విధానం, ప్రశ్నల సరళి, నమూనా ప్రశ్నపత్రాల రూపకల్పనపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు అభ్యసన సామర్థ్యాలను అంచనా వేస్తూ వెనుకబడిన విద్యార్థులకు అదనపు బోధన అందించాలని సూచించారు. ఆంగ్ల సంభాషణ నైపుణ్యాలు, డిజిటల్ విద్యా వనరుల వినియోగం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు, ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధిపై చర్చించారు. అలాగే పాత్రధారణ ద్వారా ఆధునిక బోధనా పద్ధతులను ప్రదర్శించారు. పాఠ్య ప్రణాళికలు, ప్రశ్నపత్రాలు, బోధనా సామగ్రి తయారీలో కృత్రిమ మేధస్సు సాధనాలను వినియోగించుకునే విధానాలను వివరించారు. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా నూతన బోధనా పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. అంతకుముందు ఉపాధ్యాయులకు ఎంఈఓ నర్సింగ్ రావు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్పీలు బి.నర్సిరెడ్డి, బంద్యప్ప, శోభన్‌బాబు, రాఘవేందర్, ఉపాధ్యాయులు సలీం, నవీన్, అనిల్ కుమార్, మోయిజ్, బాలరాజ్ గౌడ్, రవీందర్, ఆల్తాఫ్, అన్నపూర్ణ, పద్మజ, వసంత, అరుంధతి, మనీలా, సులోచన, భారతి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

గోతుల మయంగా కల్లూరు నూతన బస్టాండ్

- సంవత్సరాలు గడుస్తున్న మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రమాదాలకు నిలయంగా మారిన హైవే రహదారి

కల్లూరు, నవంబర్ 3 (జనం సాక్షి) : కల్లూరు డివిజన్ కేంద్రంలో ప్రజలు ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన బస్టాండు ప్రాంగణం గోతులు మయంగా దర్శనమిస్తుంది. 2022లో ఆనాటి అధికార టిఆర్ఎస్ ప్రభుత్వం సుమారు 25 కోట్ల రూపాయల విలువ కలిసిన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ స్థలంలో సుమారు 36 లక్షల రూపాయలతో. నూతన బస్టాండ్ రేకుల షెడ్డు తో నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, త్రాగునీటి వసతి, వాహనాల పార్కింగ్ షెడ్డు,. బస్సుల రాకపోకలు ప్లాట్ ఫామ్ల నిర్మాణం కోసం బస్టాండ్ ఆవరణ మొత్తం డస్ట్ తో మిక్స్ చేసిన కంకరతో నిర్మాణం చేసి వదిలేశారు. వేసవిలో పొడి వాతావరణం తరుణంలో బస్సుల రాకపోకలతో దుమ్ముమయంగా మారుతుంది. దీనికి తోడు వర్షాకాలంలో వర్షాలకు సైతం పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నీటి నిల్వలు పేరుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. ఆర్టీసీ బస్సులు బస్టాండ్ లోకి వచ్చేటప్పుడు బస్టాండ్ లో నుంచి బయటికి వెళ్ళేటప్పుడు హైవే ప్రధాన రహదారికి అనుకోని గోతులు పడటంతో రహదారిపై వచ్చే వాహనాలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాల హరి చేతుల్లో పెట్టుకొని వాహనదారులు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మురసు తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షానికి బస్టాండ్ ఆవరణ మొత్తం చిన్న



గోతులు దగ్గరనుంచి పెద్ద పెద్ద గోతులు వరకు పడి వర్షం నీరు నిలిచాయి. అసెంబ్లీ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే బస్టాండ్ ఆవరణమొత్తం సిమెంట్తో కాంక్రీట్ చేస్తామని, బస్టాండ్ ని కోటి రూపాయలతో అభివృద్ధి చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. తర్వాత బస్టాండ్ అభివృద్ధి గురించి ఎవరు పట్టించుకున్న వారు లేరు. అప్పటినుండి గోతులు మయంగా ఉన్న బస్టాండ్ లోకి బస్సులు వస్తూ పోతూ ఉన్నాయి . బస్టాండ్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రధాన రహదారి ప్రక్కన పెద్ద గొయ్యి ఏర్పడింది .బస్టాండ్ లో నుంచి బస్సులు బయటకు వచ్చేటప్పుడు అదే సమయంలో రోడ్డుపైన వచ్చే వాహనాలు గోతులు తప్పించే సందర్భంలోఎక్కడ ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు భయపడుతున్నారు. ప్రజల ప్రయాణికుల ఇబ్బందులు గమనించి ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి బస్టాండ్ అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

బీబీనగర్ ఏయిమ్స్‌ను సందర్శించిన మంత్రి సీతక్క

బీబీనగర్, నవంబర్ 3 (జనంసాక్షి) : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాలను మంగళవారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్‌లోని డీన్స్ సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్న స్టేక్‌హోల్డర్ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత అగర్వాల్. డీన్ రీసెర్చ్, ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ నారంగ్‌తో పాటు ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్, వీసీ ఎస్ఎస్‌సిటియు ఎజెండా, ములుగులో ఇప్పటివరకు జరిగిన ప్రయాణం మరియు మరింత ప్రత్యేకంగా ఐటిడిఎ ఏటూరునాగారం గురించి ప్రస్తావించారు. తెలంగాణలో గిరిజన సంక్షేమం కోసం గతంలో చేపట్టిన ఆరోగ్య శిబిరం, పరిశోధన, టెలిమెడిసిన్, విద్యా ప్రణాళిక, వృత్తి సలహా మరియు ఆరోగ్య ప్రచార కార్యక్రమాల వంటి కార్యకలాపాలను గిరిజన ఆరోగ్య అధునాతన వనరుల కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ మీలీ పాండా వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో సమగ్ర మెగా ఆరోగ్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు అభినందించారు. నిరంతరం ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న గిరిజన వర్గాలకు, ముఖ్యంగా గిరిజన మహిళలకు ఆరోగ్య సంరక్షణ అందుబాటును మెరుగుపరచడానికి సంస్థ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను కూడా ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు తరచుగా సరసమైన ఆరోగ్య సంరక్షణ సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూడా



ఆమె పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సంప్రదింపులు మరియు సహాయం అందించడానికి టెలి-హెల్త్ సేవలను విస్తరించాలని సూచించారు. ఆరోగ్య శిబిరానికి సేవలందించిన వాలంటీర్లందరినీ ఆమె సన్మానించి, బృందానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. తన వ్యక్తిగత ప్రస్థానాన్ని పంచుకుంటూ, ఒక ఆదివాసి మహిళగా క్యాబినెట్ మంత్రి పదవికి చేరుకోవడానికి తాను అధిగమించిన సవాళ్ల గురించి మంత్రి గారు మాట్లాడారు. న్యాయవాదిగా, శాసనసభ సభ్యురాలిగా (ఎమ్మెల్యే) తన పాత్రలతో సహా, ప్రజా జీవితంలోని వివిధ దశల గుండా సాగిన తన ప్రయాణాన్ని ఆమె వివరించారు. జిల్లాలో ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి చేపట్టిన ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు మరియు ప్రయత్నాలను వివరిస్తూ, గౌరవనీయ మంత్రి గారు "ములుగులో అధునాతన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ" అనే పత్రికను, ములుగు జిల్లా కోసం సమగ్ర గిరిజన ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక మరియు ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియోను విడుదల చేశారు. ములుగు జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో మరియు ఇతర వెనుకబడిన ప్రాంతాలలో ఇలాంటి మరిన్ని ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని ఆమె ఎయిమ్స్ బిబినగర్‌ను కోరారు. ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడం, ఆరోగ్య అవగాహనను ప్రోత్సహించడం మరియు గిరిజన వర్గాలకు, ముఖ్యంగా మహిళలకు అందుబాటులో, సరసమైన ఆరోగ్య సంరక్షణను అందించడం యొక్క ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు. గిరిజన వర్గాలకు ఆరోగ్య సంరక్షణ అందుబాటును మెరుగుపరచడానికి, ఎయిమ్స్ బిబినగర్ సహకారంతో ములుగు జిల్లాలో ఒక శాటిలైట్ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్.ఎస్.సి.టి.యు వైస్-ఛాన్సలర్ సూచించారు. సకాలంలో, అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ లేకపోవడం వల్ల ఏ మహిళ గానీ, బిడ్డ గానీ ప్రాణాలు కోల్పోకూడదని ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ నారంగ్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా గిరిజన మరియు మారుమూల ప్రాంతాలతో సహా ప్రతి గ్రామానికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందేలా చూడటానికి, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, ప్రభుత్వ విభాగాలు మరియు సామాజిక భాగస్వాముల మధ్య బలమైన సహకారం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

సీపీఐ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

- కాంగ్రెస్ గూటికి మాజీ వార్డు సభ్యుడు
- మంత్రి పొంగులేటి సమక్షంలో చేరికలు



ఖమ్మం రూరల్, నవంబర్ 3 (జనం సాక్షి) : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు 28వ వార్డులో సీపీఐకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ మాజీ వార్డు సభ్యుడు నారపొంగు యాకుబ్ తన సోదరుడు మల్సూర్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గతంలో సీపీఐ తరపున వార్డు సభ్యుడిగా గెలుపొందిన యాకుబ్ ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేశారు. దశాబ్దాలుగా సీపీఐతో అనుబంధం ఉన్న కుటుంబం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మంత్రి పొంగులేటి నాయకత్వంపై నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు యాకుబ్ తెలిపారు. ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నామని, అభివృద్ధిలో భాగస్వాములమవుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్,వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్,వెంపటి రవి,రామ్మోహన్ రెడ్డి,గణపరాపు వీరన్న,కందుకూరి వెంకటనారాయణ, ఏపూరి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04.11.2026



ప్రత్యామ్నాయం వైపు మొగ్గుచూపాలి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోంది

ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మవద్దు

: ప్రభుత్వ విప్ విజయరమణారావు

పెద్దపల్లి,నవంబర్ 03(జనంసాక్షి) : పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, చీకురాయి,గ్రామాల్లో మరియు పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో, చందపల్లిలో ఐకేపీ ఓ సింగిల్ విండో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ ఎల్నినో కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. కరువు పట్ల రైతన్నలు ఆలోచన చేయలని యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా పండే మొక్కజొన్న (మక్కలు), శెనగ వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. దలారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు మండలంలో ఐకేపీ సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, ముత్యాల నరేష్, మాజీ ఎంపీపీ సునీత-రాజేందర్ యాదవ్,మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి, సర్పంచ్ లు సంపత్ రావు, సంపత్ , దేవేంద్ర,త్రివేణి,శ్రీనివాస్,మ్యడగోని శ్రీనివాస్ గౌడ్, జూపాక శ్వేత -వెంకటేష్,వ్యవసాయ అధికారులు,సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు,పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు ,రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయమే మేలు

వరి సాగు వద్దు • జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రుద్రంగి, నవంబర్ 3 (జనంసాక్షి):ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. రుద్రంగి మండలం మానాలలో కేతు బచావో అభియాన్, రైతు నేస్తం కార్యక్రమాలు మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజర య్యారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సూపర్ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. రిజర్వాయర్లలోని నీటిని తాగు నీటికి, జీవాల కోసం వినియోగించాలని తెలిపారు. భూగర్భ జలాలు గత ఏడాది తో పోలిస్తే ఇంకా లోతులోకి పడిపోయాయని తెలిపారు. వరి సాగు చేస్తే నీరు బారీగా అవసరమని వెల్లడించారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పొడి ఎండ వాతావరణంతో రాను రాను రాను భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని వివరించారు. మానాల రైతులు సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారని, గత సీజన్లో ప్రత్యామ్నాయ పంటల సాగులో ముందున్నారని అభినందించారు. ప్రస్తుత సూపర్ ఎల్ నినో ప్రభావంతో రైతులు నువ్వులు, వేరుశనగ, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ ఫామ్ చేయాలని పిలుపునిచ్చారు. వీటి సాగు కోసం డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు వాడి నీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ కు టన్ను ధర ప్రస్తుతం 22 వేల 658 ఉందని వెల్ల డించారు అలాగే జిల్లాకు దగ్గర్లోనే సిద్దిపేటలో జిల్లాలో ఆయిల్ ప్లాన్ ఫ్యాక్టరీ ఉందని వివరించారు. ఎల్ నినో నేప థ్యంలో రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఐదు రకాల పంటలు సాగు చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..



- **మానాలలో నీటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలు సాగు చేస్తున్న రైతు తూము గంగాధర్**
- **పరిశీలించి.. అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

రుద్రంగి, నవంబర్ 3 (జనంసాక్షి):రుద్రంగి మండ లం మానాలలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుం టూ.. ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు రైతు తూము గంగాధర్. విభిన్న రకాల పంటలు వేసి.. మంచి ఆదాయం వచ్చేలా ముందుకు సాగుతున్నారు ఆ రైతు. క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించి రైతును అభినందించారు.రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన తూమ్ గంగాధర్ తన ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ.. ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు. పసుపు 20 గుంటలు, వెల్లుల్లి 10 గుంటలు, ఉల్లిగడ్డ 10 గుంటలు, మిర్చి 10 గుంటలు, కొత్తిమీర 10 గుంటల్లో సాగు చేస్తున్నారు.ఉన్న నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ.. ఆయా పంటలు సాగు చేస్తున్నారు.



పౌష్టికాహారమే పునాది

రుద్రంగి (జనంసాక్షి):రుద్రంగి మండలం మానాల అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన మంగళవారం 10 నిమిషాల కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ముందుగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు.ఎస్.ఏ .ఎం, ఎం.ఏ.ఎం. పిల్లల వివరాలపై ఆరా తీశారు. కేంద్రంలోని ఆర్వో వాటర్ ప్లాంట్ పనితీరు, ఫ్యాన్లు, లైట్లను తనిఖీ చేశారు.అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం తయారీని, తరగతి గదులను పరిశీలించారు.ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళవారం 10 నిమిషాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రాల్లో వసతులు, సేవలు మెరుగుపరచడం, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ అంశాలపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు.ఆరేళ్ల లోపు పిల్లలను ప్రతిరోజూ తల్లిదండ్రులు బాధ్యతగా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకురావాలని, వారి ఎత్తు, బరువును నమోదు చేయించి దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలన్నారు. బాలల తొలి వెయ్యి రోజులు కీలకమని, ఈ దశలో సరైన పోషకాహారం అందిస్తే వారి బంగారు భవితకు బాటలు పడతాయన్నారు. ప్రతి నెల 1 నుంచి 10వ తేదీ వరకు పిల్లల వివరాలను ఆన్లైన్లో, ఆరోగ్య కార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.బాలామృతంతో పిల్లలకు ఇష్టమైన కేకులు, లడ్డూలు, బిస్కెట్లు తయారు చేసి ఇవ్వాలన్నారు. మానాలలోని టీజీ టీ డబ్ల్యూ ఆర్ సి జె గర్ల్స్ విద్యాలయంలో విద్యుత్, నీటి సరఫరా పనులు పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్,జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలాక్రైస్ట్, తహసీల్దార్ పుష్పలత, సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ విక్రయిస్తారు..?

తూము గంగాధర్ వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పసుపు, వెల్లుల్లి ఇతర పంటలను పరిశీలించి.. పంట ఎన్ని రోజులకు కోతకు వస్తుంది? ఎంత దిగుబడి వస్తుంది? ఎక్కడ విక్రయిస్తారు? ఎంత ఆదాయం వస్తుందో ఆరా తీశారు. పసుపు స్థానిక లేదా కోరుట్ల, మెట్ పల్లి, నిజామాబాద్ కేంద్రాలకు తరలించి అమ్ముతామని రైతు చెప్పారు. మిగతా పంటలకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు.పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్వీయ రక్షణ శిక్షణకై

శిక్షకుల ఎంపిక

జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద



పెద్దపల్లి,నవంబర్ 03(జనంసాక్షి)

పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండ లాల పరిధిలో ఎంపిక చేసిన 48 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి నులకు స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫె న్స్/ కరాటే) శిక్షణ అందించేం దుకు గాను శిక్షకులను నియమిం చనున్నట్లు లిజిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్వీయ రక్షణ శిక్షకులుగా నియమించబడేం దుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 04న మధ్యాహ్నం 2:00 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి హాజరుకావాలని సీనియర్ అధికారుల సమక్షంలో జరిగే ఈ ఎంపిక ప్రక్రియలో అర్హులైన అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): రాబోయే యాసంగి సీజన్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలమట్టం పడిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు ఎంపిక చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యాసంగి పంటల ప్రణాళికపై కలెక్టర్ చర్చించారు. పెసర, మినుములు, కందులు, సూర్యకాంతి, వేరుశనగ, నువ్వులు, జొన్న, సజ్జ, మొక్కజొన్నతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. తక్కువ నీటితో మెరుగైన దిగుబడి, ఆదాయం పొందే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమా లు నిర్వహించి పంట మార్పిడి ప్రయోజనాలను వివరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయిల్పామ్, కూరగాయల సాగును ప్రోత్సహించడంతో పాటు బిందు సేద్య పరికరాలు, విత్తనాలపై ప్రభుత్వం అందించే సబ్సిడీలను అర్హులైన రైతులకు అందేలా చూడాలన్నారు. ఖేత్ బచావో అభియాన్, ఇతర ప్రభుత్వ పథకాల వివరాలను రైతులకు తెలియజేయాలని సూచించారు.పశుగ్రాస కొరత నివారణకు పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించాలని, రైతు బీమా పరిహారం విషయంలో కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా మరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు జాప్యం లేకుండా జారీ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, గిరిజన శాఖ అధికారి సౌజన్య, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఏడీఏలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సోలార్ యూనిట్ మహిళలకు వరం

సర్ఫ్ సోలార్ డైరెక్టర్ కృష్ణ

పెద్దపల్లి,నవంబర్ 03(జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లు మహిళలకు వరం లాంటి దాన్ని సర్ఫ్ నుండి వచ్చిన సోలార్ డైరెక్టర్ కృష్ణ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని హాలులో స్వ శక్తి సంఘాల మహిళలకి జరిగిన సోలార్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో రెండు మెగావాట్ల సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయడం కొరకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు డిఆర్డిఓ కాళిందిని మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో మంథని మండలంలో ఒక మెగా వాట్ యూనిట్ ఇప్పటికే పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. రెడ్కో ఉమ్మడి కరీంనగర్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ సహజ వనరులు క్రమంగా అంతరించిపోతున్నాయ ని, సోలార్ విద్యుత్ ద్వారా ఉపయోగించుకొని ఆదాయం పొందాలన్నారు.ప్రతి స్వశక్తి మహిళ కూడా తమ ఇంటి పైన సోలార్ పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మంచిర్యాల్, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల మండల సమాఖ్య ఆఫీస్ బ్యారర్లు, పెద్దపల్లి అడిషనల్ డి ఆర్ డి ఓ రవీందర్, మంచిర్యాల అడిషనల్ డి అంజయ్య, డిపిఎం,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల,భారత్ దర్శన్ స్పెషల్ యాత్రలు

డిపో మేనేజర్ చల్ల కవితా రెడ్డి..

గోదావరిఖని, జనంసాక్షి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గోదావరిఖని డిపో నుంచి ఆధ్యాత్మిక ప్రయాణికులు,శబరిమల స్వాములు, భక్తుల సౌకర్యార్థం దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేలా ప్రత్యేక భారత దేశ యాత్రా ప్యాకేజీలు, ప్రత్యేక శబరిమల టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డిపో మేనేజర్ చల్ల కవిత రెడ్డి తెలిపారు.మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో డిఎం మాట్లాడుతూ..శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం 7 రోజుల ప్రత్యేక యాత్రను సూపర్ లగ్జరీ బస్సు ద్వారా ఒక్కొక్కరికి ?6,460 చార్జీతో ప్లాన్ చేశారు. శబరిమల బస్సు బుక్ చేసుకునే భక్తులకు ప్రత్యేక ఆఫ ర్లను ప్రకటించింది.ఇందులో ఇద్దరు వంటవారు,ఒక సహాయకుడితో పాటు బస్సు బుక్ చేసుకున్న గ్రూప్ గురుస్వామికి ఉచిత ప్రయాణం, 10 ఏళ్ల లోపు ఇద్దరు మణికంఠ స్వాములకు (పిల్లలకు) ఉచిత సీటు కేటాయింపు, కేరళ సరిహద్దు పన్ను మినహాయింపు, నచ్చిన చోట భోజన సదుపాయం పొందే వెసులుబాటు కల్పించారు.అలాగే ఇతర సుదూర, స్థానిక యాత్రల కోసం సూపర్ లగ్జరీ,రాజధాని ఏసి బస్సులను కేటాయించారు; 2 రోజుల పీవర్ జల నరసింహస్వామి యాత్ర (సూపర్ లగ్జరీ రూ.1,000 / ఏసి రూ.2,300), 3 రోజుల గాణగాపూర్ దత్తాత్రేయస్వామి-బీదర్ యాత్ర (రూ.2,500 /రూ.3,500), 4 రోజుల శ్రీశైలం-అహోబిలం యాత్ర (రూ.4,000 / రూ.5,500), 4 రోజుల పండరీపూర్- కొల్హా పూర్ యాత్ర (రూ.4,000 / రూ.5,800), 6 రోజుల ఆంధ్రప్రదేశ్-ఒడిస్సా క్షేత్రాల యాత్ర (రూ.7,500 / రూ.8,500), 7 రోజుల కర్ణాటక యాత్ర (రూ.6,000 /రూ.8,500), 7 రోజుల వారణాసి(కాశీ)- అయోధ్య-గయ యాత్ర (రూ.9,000 / ?9,500), 8 రోజుల రామేశ్వరం-కన్యాకుమారి-మధురై యాత్ర (రూ.9,000 / రూ.12,000) మరియు 7 జ్యోతిర్లింగా లు, 2 శక్తి పీఠాలు, 8 పుణ్యక్షేత్రాలతో కూడిన 9 రోజుల మహా యాత్ర (రూ.11,500 / రూ.14,000) ప్రయా ణికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి



.ప్రయాణంలో టీ, టిఫిన్, భోజనం వసతి ఏర్పాట్లను ఆర్టీసీ సమకూరుస్తుందని, అయితే ఆ ఖర్చులను ప్రయా ణికులే భరించాల్సి ఉంటుందని డిపో మేనేజర్ కవిత స్పష్టం చేశారు.కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడితే వారు కోరుకున్న స్థలం నుంచే నేరుగా ప్రత్యేక బస్సు సదుపాయం కల్పిస్తామని, రాబోయే రోజుల్లో కేదార్నాథ్, బద్రీనాథ్, నేపాల్, కేరళ, మైసూర్, ఊటీ, బెంగుళూరులకు కూడా బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలు మరియు ముందస్తు బుకింగ్స్ కోసం భక్తులు 7013504982, 7382847596 ఫోన్ నంబర్లలో లేదా డిపో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భూభారతి పెండింగ్ దరఖాస్తులు,

రీ-సర్వేను వేగవంతం చేయాలి

రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్

పెద్దపల్లి,నవంబర్ 03(జనంసాక్షి) : భూభారతి దరఖాస్తులు, రీ-సర్వే వివిధ జీఓలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం భూభారతి పెండింగ్ అంశాలు, హైకోర్టు కేసులు, రీ-సర్వే ప్రోగ్రామ్, జీఓ 59, జీఓ 76 పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై హైదరాబాద్ నుంచి రెవిన్యూ శాఖ కార్యదర్శి డీ.ఎస్ లోకేష్ కుమార్ అన్ని జిల్లాల రెవిన్యూ అదనపు కలెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి లిఅదనపు (రెవెన్యూ) కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెవిన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హైకోర్టు పరిధిలో ఉన్న భూ సంబంధిత కేసుల పరిష్కార ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రీ-సర్వే ప్రోగ్రామ్ను వేగవంతం చేసేందుకు గాను ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలని, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీఓ 59, జీఓ 76లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

గ్రామీణ అభివృద్ధికి కృషి చేయాలి

- **ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి**
- **ఇందిరమ్మ ఫేస్-2 ప్రక్రియ వేగవంతం చేయాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి) : సమగ్ర గ్రామీణ అభివృద్ధికి ఎంపీడీవోలు సహా ఇతర శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం, చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈ లు డి ఇ లు, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలో మహిళా సమాఖ్య, గ్రామ పంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు, అదనపు తరగతి గదులు వంటి తుది దశలో ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రగతిపై సమీక్షించారు. రెండవ దశలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త చేయూత పెన్షన్ అందేలా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జాతీయ కుటుంబ సహాయ పథకం కింద పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఆమోదం తెలపాలని అధికారులకు సూచించారు. విబి జిరాంజీ పనులను ముమ్మరం చేయాలని, కూలీల హాజరు శాతాన్ని గణనీయంగా పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని, సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవోలు ప్రతిరోజు విధిగా గ్రామాలను సందర్శించాలని, స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. తద్వారా ప్రజలకు మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి రావాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్ద ఇంకుడు గుంతలను, పొలాల వద్ద కుంటలను నిర్మించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ జిల్లాలో వీలైనని ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ భవనాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా చూడాలని, ఇంకుడు గుంతలు ఎక్కువ సంఖ్యలో నిర్మించాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, డి ఆర్ డి ఓ గీత, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డిప్యూటీ సీఈవో రాము, పంచాయతీ రాజ్ ఈఈ, డిపిఓ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, విద్యాశాఖ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

:జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లినవంబర్ 03(జనంసాక్షి) : జిల్లాలో విద్య కు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు.పెండింగ్లో ఉన్న పనులకు సంబంధించిన బిల్లుల విడుదలతో పాటు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకో వాలని సూచించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యం లో పెద్దపల్లి జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహిం చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో విద్యకు సంబంధించి చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పెండింగ్ పనులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారుడిప్యూటీ ఈఈ రామకృష్ణ, టెక్నికల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మద్దతు ధర అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభం

ఖరీఫ్ సీజన్లో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా జిల్లాలో ప్రతిపాదించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఖరీఫ్ సీజన్ 2026 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడు తూ,రైతులు బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించుకునే పరిస్థితి రాకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 4 లక్షల 69 వేల మెట్రిక్ టన్నుల సన్నం కం ధాన్యం, 26 వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం ఉత్పత్తి అయినట్లు తెలిపారు.సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు క్వింటాల్కు రూ.500 బోనస్ కూడా అందిస్తుందని పేర్కొన్నారు.బహిరంగ మార్కెట్లో ధాన్యం ధరలు తగ్గిన పక్షంలో రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని,సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందేలా కొనుగోళ్లు చేపట్టాలన్నారుజిల్లాలో ప్రతిపాదించిన 311 ధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించామని, కొనుగోలు కేంద్రా లకు సుమారు 2 లక్షల 75 వేల మెట్రిక్ టన్నుల ధా న్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం 1,62,500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
4 నవంబర్ 2026

గత బీఆర్ఎస్ పాలనలోనే అవినీతికి పెద్దపీట

- హరిశంకర్ ఆరోపణలను ఖండించిన బీజేపీ కార్పొరేటర్లు
- బండి సంజయ్ వ్యాఖ్యలను వక్రీకరించారు
- పాలకవర్గంపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించం
- బండారి వేణు, సోమిడి వేణు హెచ్చరిక



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి):
బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ చేసిన ఆరోపణలను బీజేపీ కార్పొరేటర్లు బండారి వేణు, సోమిడి వేణు తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ పాలకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రస్తావిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తమ పార్టీ నాయకులు, ప్రస్తుత పాలకవర్గానికి హితబోధ చేశారని, ఆ వ్యాఖ్యలను వక్రీకరించి తమపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొందరు కార్పొరేటర్లు అవినీతి, భూకబ్జాలకు పాల్పడి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అలాంటి వారిని ప్రోత్సహించింది మీ నాయకత్వమే కాదా అని ప్రశ్నించారు.
ప్రజలు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మంచి పాలన అందించి నగరాన్ని అభివృద్ధి చేయాలని బండి సంజయ్ సూచించారని స్పష్టం చేశారు. ఆ మాటలను వక్రీకరించి బీజేపీ పాలకవర్గంపై అవినీతి ముద్ర వేయాలని చూడటం దుర్మార్గమన్నారు. గతంలో ఇసుక, రాయి, కంకర పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, డబ్బులు ఇవ్వలేదనే కారణంతో ప్రహరీలు, ఇళ్లను కూల్చివేయడం వంటి ఘటనలు బీఆర్ఎస్ పాలనలో చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కార్పొరేటర్లకు అండగా నిలిచిన చరిత్ర ఆ పార్టీ నాయకులదేనని విమర్శించారు. రాజకీయ ఉనికి కోసం తమ నాయకులు, పాలకవర్గంపై ఆధారాలు లేని ఆరోపణలు చేయవద్దని, బండి సంజయ్ కుమార్‌తో పాటు బీజేపీ పాలకవర్గంపై నిరాధార వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తాటి ప్రభావతి, దేశ శిల్ప వేదం, పెద్దపల్లి శ్రీలేఖ, జితేందర్, బండ రమణారెడ్డి, ప్రకాశ్, వంగల పవన్, మేకల వెంకటేశ్, భూపతి రవీందర్, కేపీపీ చంద్ర, కన్నకృష్ణ, కర్రె పద్మ, అనిల్, తోట అనిల్, మాసం గణేశ్, సత్యం, గొట్టా ముక్కల రమణ, గాజా శివరాం, ముజీబ్, నందు తదితరులు పాల్గొన్నారు.

పైలాన్ కూల్చివేతపై భగ్గుమన్న బీఆర్ఎస్

- ఎనిమిది గంటల పాటు నాయకుల ఆందోళన
- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ దిష్టిబొమ్మ దహనం
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అరెస్టు
- కక్ష సాధింపు చర్యలంటూ బీఆర్ఎస్ ఆరోపణ



గోదావరిఖని, నవంబర్ 03 (జనంసాక్షి): రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్ తొలగింపు రాజకీయ వివాదానికి దారితీసింది. గోదావరిఖని గాంధీనగర్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించిన పైలాన్‌ను రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జేసీబీతో తొలగించడంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. విషయం తెలుసుకున్న చందర్ కౌశిక హరి, వ్యాళ్ల హరీశ్‌రెడ్డి తదితర నాయకులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీకి అడ్డంగా బైఠాయించారు. పైలాన్ తొలగింపునకు ఎవరు అనుమతిచ్చారని, ఏ ప్రాతిపదికన చర్యలు చేపట్టారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుంది.
పైలాన్ తొలగింపును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు దాదాపు ఎనిమిది గంటల పాటు ధర్నా కొనసాగించారు. నిరసనలో భాగంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పైలాన్ తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ గెలిచిన తర్వాత చిరు వ్యాపారుల దుకాణాలు, గుళ్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఐటీ పార్కులు, పారిశ్రామిక పార్కులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించి ఏర్పాటు చేసిన పైలాన్‌లను రాజకీయ కక్షతో తొలగిస్తున్నారని విమర్శించారు. గత పాలనలో జరిగిన అభివృద్ధికి గుర్తుగా ఉన్న ఆనవాళ్లను చెరిపివేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎనిమిది గంటల ఆందోళన అనంతరం పోలీసులు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో గాంధీనగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన పైలాన్ తొలగింపు చర్య రాజకీయంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వివాదానికి దారితీసింది.

4 కోట్ల 20 లక్షలతో ముమ్మరంగా సిసి రోడ్డు డ్రైనేజీ పనులు

- మౌలిక వసతుల కల్పనకే ప్రథమ ప్రాధాన్యం
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



రాజన్న సిరిసిల్ల జిల్లా పద్ధతి నవంబర్ 3 (జనంసాక్షి) :
వేములవాడ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 15వ వార్డ్ సంతోష్ నగర్ లో, 4 వ వార్డ్ జంబి గద్దె వద్ద నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు,మరియు డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని, ఉపయోగిస్తున్న నిర్మాణ సామాగ్రి నాణ్యతను క్షేత్రస్థాయిలోని పరిస్థితులపై సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక సహాయ సహకారాలతో పట్టణంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృషితో సుమారు నాలుగు కోట్ల 20 లక్షల వ్యయంతో పట్టణంలోని వార్డుల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుతున్నాయన్నారు. ఆయన మార్గదర్శకత్వంలో ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని,సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటం వల్ల ప్రజలకు పారిశుధ్య సమస్యల నుంచి శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు రాకపోకలు సుగమం అవుతాయని స్పష్టం చేశారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని అధికారులకు, కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనుల్లో జాప్యం వహించకుండా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారులు ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తోటరాజు, టీపీఓ అన్వేష్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదం నిర్మూలనకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు

- జిల్లాలో పేకాటపై పోలీసుల ఉక్కుపాదం.. నాలుగు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- జూద నిర్వాహకులపై 24 గంటల నిఘా.. ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరిక



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (జనం సాక్షి) : జిల్లాలో జూదం, పేకాట కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు 24 గంటల పాటు నిఘా కొనసాగిస్తూ జిల్లావ్యాప్తంగా పేకాట స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించనున్నాయి. జూదం నిర్వహించే నిర్వాహకులతో పాటు పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో జూదానికి అలవాటుపడి ఎంతోమంది తమ జీవితాలను, కుటుంబాల భవిష్యత్తును నాశనం చేసుకుం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేకాటలో డబ్బులు సంపాదించవచ్చనే భ్రమతో కష్టపడి సంపాదించిన సొమ్మును కోల్పోయి అప్పుల పాలవుతు న్నారని, కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, కలహాలకు జూదం కారణమవు తోందని తెలిపారు. ముఖ్యంగా యువత క్షణిక ఆనందాలకు, అత్యాశకు లోనుకాకుండా జూదానికి దూరంగా ఉండాలని సూచించారు. పేకాట కేసుల్లో పట్టుబడి కేసులు నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల కోసం జరిగే పోలీసు వెరిఫికేషన్ సమయంలో ఆ కేసుల వివరాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడవచ్చని హెచ్చరించారు.
జిల్లాలో ఎక్కడైనా పేకాట నిర్వహిస్తున్నా, ఆడుతున్నా ప్రజలు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712686133 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

గన్నేరువరం - ఎలగందుల బ్రిడ్జి నిర్మాణ జాప్యంపై భగ్గుమన్న జనం

- కేంద్రమంత్రి బండి సంజయ్ తీరుపై మండిపడ్డ బ్రిడ్జి సాధన సమితి
- బస్టాండ్ నుంచి శంకుస్థాపన గద్దె వరకు భారీ ర్యాలీ



గన్నేరువరం, నవంబర్ 3 (జనంసాక్షి): గన్నేరువరం నుండి ఎలగందుల వరకు ప్రతిపాదించిన మానేరు బ్రిడ్జి నిర్మాణంలో నెలకొన్న తీవ్ర జాప్యంపై జనం భగ్గుమన్నారు. బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం గన్నేరువరం బస్టాండ్ నుండి బ్రిడ్జి శంకుస్థాపన గద్దె వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మీసం లక్ష్మణ్, కాంతాల అంజిరెడ్డి మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.77 కోట్లు మంజూరు చేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు శంకుస్థాపనకు నోచుకోకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు సరైన రవాణా మార్గం లేక ప్రతిరోజూ రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణ జాప్యంపై కేంద్రమంత్రి బండి సంజయ్ తక్షణమే స్పందించి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. గన్నేరువరం నుండి మైలారం మీదుగా బేగంపేట వరకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా కంకర పోసి వదిలేశారని ధ్వజమెత్తారు. అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించకపోతే రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రామగుండంలో తాగునీటి సరఫరాకు రూ.100 కోట్లు

- నీటి పంపిణీ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు
- ఎనిమిది ఉపరితల జలాశయాలు, కొత్త పైపులైన్ల నిర్మాణం
- నర్సింగ్ కళాశాల వద్ద రూ.2 కోట్లతో జలాశయం
- ఏడాదిలోగా పనులు పూర్తి చేస్తాం: మేయర్ మహంకాళి స్వామి



గోదావరిఖని, నవంబర్ 3 (జనంసాక్షి):
రామగుండం నగరంలో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచి, ప్రజలకు 24 గంటల పాటు తాగునీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. నీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సుమారు రూ.100 కోట్లు మంజూరు చేయించారని పేర్కొన్నారు.రామగుండం నగరపాలక సంస్థ 11వ డివిజన్ పరిధిలోని నర్సింగ్ కళాశాల ఆవరణలో సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఉపరితల జలాశయానికి మంగళవారం స్థానిక కార్పొరేటర్ కారెశీగుల రమ్య ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో ఎనిమిది ఉపరితల జలాశయాలు, కొత్త పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నర్సింగ్ కళాశాల వద్ద నిర్మించే జలాశయం ఎనిమిది లక్షల లీటర్ల సామర్థ్యంతో ఉంటుందని, సుమారు 10 వేల మంది జనాభాకు నీటి అవసరాలు తీర్చనుందని వివరించారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం 46వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రతి వీధిలోని చివరి ఇంటి వరకు అంబులెన్స్ వెళ్లేలా రహదారులు, యూజీడీ, రక్షిత మంచినీటి సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఇందిరానగర్‌లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చొరవతో స్టార్మ్ వాటర్ డ్రెయినేజీ నిర్మించి, దానిపై జాలీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందిరానగర్, సంజయ్‌నగర్‌లలో రహదారులు, యూజీడీ, వీధి దీపాల సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. 46వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు స్థానికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు దాసరి సాంబమూర్తి, వడ్లూరి రవి, నాయకులు దాసరి విజయ్, కల్వల రంజిత్, కన్నూరి శంకర్, నగరపాలక సంస్థ ఏఈ మీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చీరతో ఉరి వేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య

ఇల్లంతకుంట నవంబర్ 04(జనంసాక్షి) :
ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన కళ్యాడపు హనుమవ్వ (85) ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. హనుమవ్వ గత కొన్ని రోజులుగా ఆస్తమా, వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. నవంబర్ 2న తన కుమార్తె ఆదిలక్ష్మి (తంగళ్లపల్లి)తో ఫోన్‌లో మాట్లాడుతూ అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపింది. అదే రోజు రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు గుర్తించి కుమార్తెకు సమాచారం అందించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యాయయత్నం కేసులో దోషికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

- దోషికి రూ. 3,000/- జరిమానా, చెల్లించకుంటే అదనపు శిక్ష
- తీర్పు వెలువరించిన నిజామాబాద్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 03 జనం సాక్షి: నగరంలో సంచలనం సృష్టించిన హత్యాయయత్నం కేసులో నిజామాబాద్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. దాడికి పాల్పడి హత్యా యత్నానికి తెగబడిన నిందితుడికి కోర్టు కఠిన శిక్షను ఖరారు చేసింది. నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసుకు సంబంధించి నిజామాబాద్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో మంగళవారం తుది తీర్పు వెలువడింది. న్యాయమూర్తి అంగరి చైతన్య బహిరంగ కోర్టు హాల్‌లో ఈ తీర్పును ప్రకటించారు.నగరంలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన ఎండీ. యూనస్ హుసేన్‌పై హత్యాయయత్నం మరియు దాడికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఐపీసీ సెక్షన్ 341, 326, 307 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కోర్టు విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో నిందితుడిని న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఈ మేరకు సెక్షన్ 326 ఐపీసీ కింద నేరం నిరూపితం కావడంతో కోర్టు తుది తీర్పు వెలువరించింది. దోషి ఎండీ. యూనస్ హుసేన్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3,000/- జరిమానా విధించింది. ఒకవేళ జరిమానా చెల్లించని యెడల అదనపు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

కామారెడ్డి మున్సిపాలిటీపై ఆరోపణలు

- మున్సిపల్ అక్రమాలపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం
- ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (జనం సాక్షి) : కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమ వసూళ్లు, పాలనాపరమైన అవకతవకలు జరుగుతున్నాయంటూ పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరిని ఆదేశించారు.మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో టెండర్ల ప్రక్రియ, పారిశుధ్య కార్మికుల నియామకాలు, హాజరు, వేతనాల చెల్లింపులు, సీసీ కెమెరాల ఏర్పాటు పనుల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యం తదితర అంశాలపై విచారణ జరగనుంది. అలాగే టౌన్ ప్లానింగ్ నోటీసులు, కౌన్సిల్ సమావేశాలు, గణేష్ నిమజ్జనం కోసం కొనుగోలు చేసిన ఇనుప సామగ్రి వినియోగం, విక్రయాలు, మున్సిపల్ వాహనాల ఇంధన ఖర్చులు, వ్యాపార అనుమతులు, ఇంటి పన్నుల మదింపు ప్రక్రియలను కూడా పరిశీలించనున్నారు. మున్సిపల్ సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, ప్రజలను బెదిరింపులకు గురిచేసినా ఆధారాలతో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ కార్యాలయంలో లేదా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మండలంలోని అర్ధరాత్రి పేకాట స్థావరాలపై దాడి



పిట్లం నవంబర్ 03 (జనం సాక్షి) : పిట్లం మండల పరిధిలోని అక్రమ కార్యకలాపాలపై నిఘా పెంచిన పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు చిన్న కొడపుగల్,గౌరారం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరాలపై స్థానిక ఎస్ ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 10 గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 37,680/- రూపాయలు 4 బైక్స్ 7 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ పేకాట ఇతర అసాంఘిక, కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ గ్రామీణ ప్రాంతాలలో నిరంతరం అసాంఘిక కార్యక్రమాలపై నిఘా కొనసాగిస్తామని ఎస్ ఐ ఆంజనేయులు తెలిపారు.

అంతర్జాతీయ వేదికపై పారమిత విద్యార్థుల విజయభేరి

- గ్రూప్ మ్యూజికల్ బ్యాండ్‌లో ప్రథమ స్థానం
- సోలో వాద్య సంగీతంలోనూ విద్యార్థుల ప్రతిభ
- వివిధ దేశాల బృందాలతో పోటీపడి ఘన విజయం
- విద్యార్థులు, సంగీత ఉపాధ్యాయులకు చైర్మన్ అభినందనలు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 03 (జనంసాక్షి): అంతర్జాతీయ సాంస్కృతిక వేదికపై పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ఐటీఎం యూనివర్సిటీలో అక్టోబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించిన 21వ అంతర్జాతీయ సాంస్కృతిక ఉద్భవ్ ఉత్సవ్-2026లో గ్రూప్ మ్యూజికల్ బ్యాండ్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు వెల్లడించారు. ఉద్భవ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మంగోలియా, కిర్గిజిస్తాన్, స్లోవేకియా తదితర దేశాల కళాకారులు, సంగీత బృందాలు పాల్గొన్నాయి. అంతర్జాతీయ స్థాయి పోటీలో వివిధ దేశాల బృందాలను అధిగమించి పారమిత విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కిట్ల చరణ్, ఎం. సాన్విరెడ్డి, వి. అన్విక, సీహెచ్. హన్నా, కృష్ణసాయి, పి. గౌతమ్, ఎం. సంరక్ష్, ప్రిశాంక్ ఠాకూర్, ఎం. శ్రియాన్ష్ కార్తికేయ, ఎం. ఆన్సన్ మోసిస్, ఏవీకే క్రితిక్, ఏ. విహాన్ బృందంగా ఈ విజయాన్ని అందుకున్నారు. వాద్య సంగీతం సోలో విభాగంలో కిట్ల చరణ్ ప్రథమ, ఏవీకే క్రితిక్ ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పాఠశాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ, కిరణ్, సాహు, సూరజ్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేశ్, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, శర్మిష్ట, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై విద్యాశాఖ స్పెషల్ డ్రైవ్

- 100 శాతం హాజరే లక్ష్యం..
- ఎక్కువగా సెలవులు పెడుతున్న టీచర్లపై దృష్టి..
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన హెచ్ఎంలకు సన్మానం



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనంసాక్షి) :
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, బోధనా కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించడమే. లక్ష్యంగా పాఠశాలల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకునట్లు సమాచారం. ప్రస్తుత నెలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం హాజరు నమోదు చేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశిస్తూ జిల్లా వ్యాప్తంగా ఒక ప్రత్యేక హాజరు డ్రైవు కార్యక్రమం నిర్వహించనున్నారు.పాఠశాలల నిర్వహణను మెరుగ్గా చేపడుతూ, ఈనెల మొత్తం టీచర్లు విద్యార్థుల వందశాతం హాజరును సాధించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హెడ్మాస్టర్లను పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా సన్మానించాలని నిర్ణయించారు. విద్యాశాఖ చేపట్టిన ఈ డ్రైవ్ కారణంగా అనారోగ్య కారణాలతో బడికి రాలేని పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టకూడదని స్పష్టం చేసింది.

టూర్లకు వెళ్తున్నట్లు గుర్తింపు..
పాఠశాలల పనివేళల్లో కొందరు ఉపాధ్యాయులు తరచూ సెలవులు పెడుతున్నట్లు విద్యాశాఖ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా నవంబర్, డిసెంబర్ మాసాల్లో చాలామంది టీచర్లు వ్యక్తిగత టూర్లు,విహార యాత్రలకు వెళ్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీనితో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతోందని భావించిన విద్యాశాఖ, ఇకపై అనవసర సెలవులకు స్వస్తి పలకలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తరచూగా గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా రెండు నెలలు విద్యార్థుల సిలబస్ పూర్తి చేసేందుకు కీలక సమయమని, టీచర్ల గైర్హాజరు కారణంగా సకాలంలో సిలబస్ పూర్తికాక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తుంది. కొందరు టీచర్లు వ్యక్తిగతంగా విదేశీ టూర్లు వెళ్తున్నట్లు కూడా అధికారుల దృష్టికి రావడంతో దీంతో హాజరు పక్కాగా అమలు చేయాలని ఈ డ్రైవ్ చేపట్టినట్లు తెలుస్తోంది.

జీరో నమోదు ఉండొద్దు..
పాఠశాలల్లో హాజరు శాతాన్ని మెరుగుపరచడానికి సమగ్ర శిక్షా అభియాన్ 8 సూత్రాలు ప్రణాళికను ప్రకటించింది. ప్రతిరోజూ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా టీచర్లు, విద్యార్థుల హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలి. ఏ పాఠశాలలోనూ జీరో నమోదు ఉండ కూడదని, విద్యార్థుల నిజమైన హాజరు శాతం వారం వారానికి పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని,వరుసగా 5 రోజులు లేదా అంతకంటే ఎక్కువ రోజులు బడికి రాని విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతోపాటు అవసరమైతే ఉపాధ్యాయులు ఇంటికి వెళ్లి పరిశీలించాలి. స్కూళ్లలో ఓడీ, ఎంట్రీలను 24 గంటల్లోపు క్లియర్ చేయాలి. ఎస్ఆర్ఎస్ నెట్వర్క్, పరికరాలు, నమోదుకు సంబంధించిన సమస్యలను 48 గంటల్లో పరిష్కరించాలని సూచించింది.
మండలాల వారీగా క్లస్టర్ స్థాయి అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రోజువారీ హాజరుపై పర్యవేక్షణ చేయనున్నారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) సమావే శాలు ఏర్పాటు చేసి పిల్లల హాజరు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు మెరుగైన హాజరు సాధించిన పాఠశాలలు,హెడ్మాస్టర్లు, టీచర్లు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు,పెన్నులు,పుస్తకాలు బహుమతులుగా అందించి ప్రోత్సహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. నవంబర్ 22 నుంచి 30 వరకు మండలాల వారీగా వివరాలు సేకరించి. ఈ హాజరు శాతం విద్యా సంవత్సరం అంతా కొనసాగేలా ప్రణాళికలు రూపొందిం చాలని డీఈఓ డీఈఓలు, ఎంఈఓలు, క్లస్టర్ హెడ్స్, హెడ్మాస్టర్లకు సూచించారు.

రెవెన్యూ సేవలలో అలసత్వాన్ని సహించేది లేదు

● జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



మెదక్ బ్యూరో, అక్టోబర్ 3 (జనం సాక్షి) : రెవెన్యూ సేవలలో అలసత్వాన్ని సహించేది లేదని పారదర్శక రెవిన్యూ పాలన లక్ష్యంగా తాసిల్దారు చిత్తశుద్ధితో పని చేయాలి భూముల రీ సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యాన్ని వీడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ తాసిల్దారులను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో భూధార్, ల్యాండ్ రీ సర్వే, ధాన్యం కొనుగోలు, త్రిబుల్ ఆర్ , ప్రజావాణి పెండింగ్ సమస్యలు, సంబంధిత రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు తాసిల్దారులతో కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ పరమైన అంశాలలో పక్కా ప్రణాళికతో పారదర్శక రెవిన్యూ పాలన లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. రెవెన్యూ సేవలలో ఆలస్యాన్ని సహించేది లేదని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.. భూముల సమగ్ర రీ-సర్వే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మరియు భూ రికార్డుల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను మెదక్ జిల్లాలో క్షేత్రస్థాయిలో పటిష్టంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. -సర్వే లక్ష్యాలు, ప్రక్రియ, రైతులకు కలిగే ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించి వారి సహకారం పొందాలని సూచించారు.భూ రీ సర్వే విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా రైతులకు ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు జరపాలి అని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న అర్హులైన పేదలకు జీవో 59 కింద ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలనకు వెళ్ళినప్పుడు వెల్దుర్తి మండల తాసిల్దార్ సర్వే నిర్వహణ తీరు తెలియకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్‌ను ఆదేశించారు. త్రిబుల్ ఆర్ సమస్యలపై తాసిల్దార్లతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ప్రస్తుతం జిల్లాలో 530 సెంటర్లు ప్రారంభించాల్సి ఉండగా 280 సెంటర్స్ ప్రారంభించామన్నారు 14 సెంటర్ల నుండి 412 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు.ల్యాండ్ అక్విజిషన్ లక్ష్యాలను పూర్తి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మహమ్మద్‌శ్రీఅహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే కిషన్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ రామకృష్ణ, తూప్రాన్ భావయ్య, సంబంధిత తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లపై అదనపు ఎస్పీ ఆకస్మిక తనిఖీ

● నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలి
● డ్రగ్స్ సైబర్ నేరాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలి
● అదనపు ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్



చిన్న శంకరంపేట, నవంబర్ 3 (జనం సాక్షి) : నేరాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను ప్రత్యేక నిఘా ఉంచాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆయన చిన్న శంకరంపేట, చేగుంట పోలీస్, స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ రికార్డులు కేసుల దర్యాప్తు పురోగతి పెండింగ్ కేసుల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీటీ ఎన్ఎస్ సాక్ష అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. డ్రగ్స్ దుష్పరిణామాలు సైబర్ నేరాలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూడాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని హెల్మెట్ సీల్ బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీలలో తూప్రాన్ సిఐ వెంకట్ రాజా గౌడ్, చిన్న శంకరంపేట ఎస్సై శివానందం, చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజా ఉద్యమం నిర్మించాలి



ముషీరాబాద్, నవంబర్ 3 (జనం సాక్షి) : మాదకద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వ్యసనం దేశ యువత భవిష్యత్తును, కుటుంబ వ్యవస్థను, సమాజ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న తీవ్రమైన సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాదులోని భాగ్యంగంపల్లి సుందర విజ్ఞాన కేంద్రంలో అలై బలై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షతన 'నషా ముక్త్ భారత్ -- నషా ముక్త్ తెలంగాణ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ అధ్యక్షత వహించి మాదకద్రవ్యాల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల సమస్యను కేవలం ప్రభుత్వ చర్యలతోనే పూర్తిగా పరిష్కరించడం సాధ్యం కాదని, సామాజిక సంస్థలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, వైద్యులు, యువత సమష్టిగా బాధ్యత తీసుకోవాలని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా కుటుంబ స్థాయి నుంచి సామాజిక స్థాయి వరకు నిరంతర అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో స్థానిక పరిస్థితులు, సామాజిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన, గ్రామీణ, పారిశ్రామిక, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాఠశాలలు, కళాశాలలు, ఐటీ సంస్థలు, పరిశ్రమల్లో యువతను భాగస్వాములను చేసి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకునేలా సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మల్కాజిగిరి, నవంబర్ 3 (జనంసాక్షి) : అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మండల కార్యాలయంలో తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 49 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సకాలంలో అందేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పథకాల దరఖాస్తులపై త్వరితగతిన విచారణ పూర్తి చేసి, లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా చెక్కులు అందించాలని సూచించారు. ప్రజా సంక్షేమంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు బద్దం పరశురాంరెడ్డి, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్‌గౌడ్, శివగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రావు, భాగ్యానంద్, సత్యనారాయణ, మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, హేమంత్ పటేల్, మాశెట్టి అనిల్, సుమన్ గౌడ్, సర్వేశ్ యాదవ్, నవీన్‌రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మల్కాజిగిరి, నవంబర్ 3 (జనంసాక్షి) : అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మండల కార్యాలయంలో తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 49 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు సకాలంలో అందేలా రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పథకాల దరఖాస్తులపై త్వరితగతిన విచారణ పూర్తి చేసి, లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా చెక్కులు అందించాలని సూచించారు. ప్రజా సంక్షేమంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు బద్దం పరశురాంరెడ్డి, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్‌గౌడ్, శివగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రావు, భాగ్యానంద్, సత్యనారాయణ, మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, హేమంత్ పటేల్, మాశెట్టి అనిల్, సుమన్ గౌడ్, సర్వేశ్ యాదవ్, నవీన్‌రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణతోనే అధిక దిగుబడులు

● ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన
● మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



కొల్చారం, నవంబర్ 3 (జనం సాక్షి) : భూసారాన్ని కాపాడుకుంటూ పంటల సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి రైతులకు సూచించారు. కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ లతా శ్రీశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భూసుపోషణ, భూసంరక్షణపై 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువులు, సూక్ష్మపోషకాలను వినియోగిస్తూ సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. తద్వారా భూసారం పెరిగి నేల ఆరోగ్యం కాపాడబడుతుందని వివరించారు. అలాగే మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానం, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను అందించి, సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి భూమేష్, రైతులు పాల్గొన్నారు.

చిన్న ప్లాట్లకు పర్మిషన్లు నిరాకరించడం అన్యాయం

● తార్నాకలో తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ నిరసన



సికింద్రాబాద్, నవంబర్ 3 (జనం సాక్షి) : చిన్న ప్లాట్లకు నిర్మాణ అనుమతులు నిరాకరించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పద్దెనిమిది అడుగుల వెడల్పు, యాభై అడుగుల పొడవు కలిగిన స్థలాలకు, వంద గజాల లోపు ఉన్న చిన్న ప్లాట్లకు గృహ నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్ద స్థలాలు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని సామాన్యులు తమ జీవితకాల సంపాదనతో చిన్న ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారని, అలాంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు నిరాకరించడం అన్యాయమని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాల యజమానులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా 22 ఏ భూముల సమస్యలను కూడా పరిష్కరించి, సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. నరసయ్య, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు, కోశాధికారి గడ్డం నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రైస్ మిల్లులో ధాన్యం దందా

● రూ.25 కోట్ల ప్రభుత్వ ధాన్యం ఏమైంది?
● కల్వకుర్తి బియ్యం మిల్లులో భారీగా ధాన్యం కొరత
● 8,505 మెట్రిక్ టన్నుల ధాన్యం లెక్కల్లో తేడా
● మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు



కల్వకుర్తి, నవంబర్ 3 (జనంసాక్షి) : ప్రభుత్వ ధాన్యం నిల్వల్లోభారీ కొరత వెలుగుచూడటం కల్వకుర్తిలో చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని రఘుపతిపేట రోడ్డులో ఉన్న శ్రీ సాయి లక్ష్మీ వెంకటేశ్వర ఉప్పుడు బియ్యం మిల్లులోసుమారు రూ.25 కోట్ల విలువైనధాన్యం కొరత ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ వ్యవహారంపై మిల్లు నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సంయుక్త తనిఖీల్లో వెలుగులోకి..

నవంబరు 2న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, నిఘా, అమలు విభాగం అధికారులు సంయుక్తంగా మిల్లులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి చెందిన 8,505.586 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ రూ.25,04,42,985గా నిర్ధారించారు.ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం నిల్వల్లో కొరత ఏర్పడటానికి గల కారణాలపై అధికారుల పరిశీలన ప్రాధాన్యం సంతరించుకుంది.

ఫిర్యాదుతో కేసు నమోదు..

ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం చేసి, ప్రభుత్వానికి ఆర్థిక నష్టం కలిగించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ దండు రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు ఆధారంగా కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో నేర సంఖ్య 388/2026గా కేసు నమోదు చేశారు.

భారతీయ న్యాయ సంహితలోని 316(2), 316(5), 318(3) సెక్షన్లతోపాటు నిత్యావసర సరుకుల చట్టంలోని ఏడో సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యం కొరతకు సంబంధించిన పూర్తి వివరాలు,అందుకు గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

జలసిరి పనుల పురోగతి సాధించాలి

● అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ బ్యూరో, నవంబర్ 3 (జనం సాక్షి) : వివిజి రాంజి పథకం - 'జలసిరి' పనుల పురోగతి సాధించాలని అదనపు కలెక్టర్ నగేష్ సంబంధిత ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రజావాణి హాలులో మంగళవారం జిల్లాలోని గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా చేపడుతున్న జలసిరి పనులు ఫారం పాండ్ ఇంకుడు గుంతలు వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం బోర్వెల్ రిఫ్రో సక్చర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,వికసిత భారత్ - గ్రామీణ ఉపాధి మరియు జీవనోపాధి మిషన్ హామీ పథకం" పథకం కింద లేబర్ పని దినాలు సంబంధిత అంశాలపై డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య సంబంధిత ఎంపీడీవోలతో. అదనపు కలెక్టర్ నగేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని పనులు మంజూరు చేసుకుని నవంబర్ 20 తేదీలోపు గ్రౌండింగ్ చేయాలని అన్నారు. జిల్లాలో 390 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు పటిష్టంగా పనిచేయలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా నాయకులు పి. కృష్ణ
● డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె

రంగారెడ్డి, నవంబర్ 3 (జనంసాక్షి) : ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15వ తేదీ నుండి చేపడుతున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు పి. కృష్ణ పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో మంచాల మండలంలోని ఆశా వర్కర్లంతా పాల్గొంటారని తెలియజేస్తూ మంచాల, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెతో పాటు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 స్థిర వేతనం చెల్లించాలన్నారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50,000 ప్రసూతి ఖర్చులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 రోజుల క్యాజువల్ లీవ్‌లు, 6 నెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. రెండవ పిఆర్సీలో ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.30,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆశా వర్కర్లకు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు నవనీత,



అమృత, అలివేలు, జ్యోతి, మంజుల, కవిత, మనీలా, పద్మ, సంతోష, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 నవంబర్ 2026

రైస్‌మిల్లులపై విజిలెన్స్

జిల్లా సివిల్ సప్లయ్ శాఖ ఆకస్మిక తనిఖీలు

- తూకాల్లో తేడాలు, నిబంధనల ఉల్లంఘనలు
- పలు రైస్ మిల్లులపై కేసులు నమోదు
- హెచ్చరించిన సివిల్ సప్లైస్ అధికారులు





రంగారెడ్డి, నవంబర్ 3 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లాలోని రైతు మిల్లులపై జిల్లా సివిల్ సప్లై శాఖ ఆఫీస్ మీద స్థానిక నిర్వహించింది. తూకాల్లలో తేడాలు, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించని రైస్ మిల్లులపై అధికారులు కన్నెర్రజేశారు. నిబంధనలను ఉల్లంఘించిన పలు రైస్ మిల్లులపై కేసు నమోదు చేశారు. తూకాల్లలో మోసాలు, తూకం యంత్రం వాడకంలో నిర్లక్ష్యం, గోదాముల్లో ధాన్యం నిలువలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళపల్లి, పోచారం పరిధిలోని రైస్ మిల్లుల్లో పౌరసరఫరాల (సివిల్ సప్లైస్) శాఖ అధికారుల బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా రైస్ మిల్లులు ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా నడుస్తున్నాయా లేవా అన్న అంశంతో పాటు, రికార్డులు, బిల్లులు, తూకపు యంత్రాల (కాంటాల) పనితీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

తూకంలో తేడా.. కేసు నమోదు..

ఉప్పరిగూడలోని విశ్వనాథ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో బియ్యం బస్తాల తూకాన్ని అధికారులు తనిఖీ చేయగా తీవ్ర వ్యత్యాసం బయటపడింది. 25 కిలోల బస్తాలో కేవలం 24 కిలోలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. కిలో చొప్పున తక్కువగా ఉన్నట్లు నిర్ధారించిన సివిల్ సప్లైస్ అధికారులు సదరు మిల్లుపై కేసు నమోదు చేశారు.

ఎంపీ పటేల్‌గూడ గ్రామంలోని చాముండేశ్వరి రైస్ మిల్లులో తూకపు కాంటా బాట్లను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించడం లేదని అధికారులు గుర్తించారు. దీనిపై మిల్లు యాజమాన్యానికి అధికారికంగా వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయడంతో పాటు, తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళపల్లిలోని శ్రీ లక్ష్మీ రైస్ మిల్లులో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన తూకపు యంత్రం లేకపోవడంపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 15న 127 క్వింటాళ్లు, 24వ తేదీన 90 క్వింటాళ్ల చొప్పున బియ్యం విక్రయించిన నిర్వాహకులు.. నవంబర్ 3 నాటికి ఒక్క బ్యాగ్ కూడా విక్రయించకపోవడంపై అధికారులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. మార్కెట్‌లో కావాలనే కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తాం

రంగారెడ్డి జిల్లా డీఎస్ఓ వనజాత

ప్రజలకు సరైన తూకంతో, నాణ్యమైన బియ్యాన్ని అందించడమే లక్ష్యమని డీఎస్ఓ వనజాత తెలిపారు. వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. పద్ధతి మార్చుకోకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే మిల్లులను సీజ్ చేసి, వాటి స్థానంలో పిడిఎస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డీసీఎస్ఓ వనజాతతో పాటు, ఏసీఎస్ఓ పుల్లయ్య, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, డిప్యూటీ తహసీల్దార్లు రామకృష్ణ, నరసింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు మహేష్, లోకేష్, ఆర్ఐ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే తల్లీశిశువు మృతి

ఘటనపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆగ్రహం..

- తల్లి శిశువు మృతికి బాధ్యులైన వైద్య సిబ్బందిని సస్పెండ్ చేయాలి..
- పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై ఎమ్మార్పీఎస్ అధినేత,మందకృష్ణ మాదిగ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవల తీరును పరిశీలించారు. ఇటీవల కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన నిండు గర్భిణి రాధ ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చి తల్లీబిడ్డ ఇద్దరూ మృతి చెందిన ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్య సిబ్బందితో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రోగులతోనూ మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. రాధ, ఆమె గర్భంలోని శిశువును కాపాడలేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. ఇంత పెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు కనీస ప్రాణరక్షణ కల్పించలేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం కేవలం 14 మంది వైద్యులు మాత్రమే ఉండడం ఆందోళనకరమని, కనీసం 30 మంది వైద్యులు, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాధ ఆరోగ్య పరిస్థితిని విధుల్లో ఉన్న వైద్యులు ఎందుకు సరిగ్గా అంచనా వేయలేకపోయారని ప్రశ్నించారు. ఈ ఘటనకు బాధ్యులైన వైద్యులు, సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని, మరిన్ని ప్రాణాలు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ళ ఉపేందర్ మాదిగ, ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ, కొందుర్గు మండల మాజీ అధ్యక్షుడు ఆనేగాళ్ల ఆనంద్ మాదిగ, చెన్నగల్లా అశోక్ మాదిగ, మల్లెపల్లి బాలరాజు మాదిగ, మహేందర్ మాదిగ, నాగభూషణం మాదిగ, పండు మాదిగ, మల్లికార్జున్ మాదిగ, ప్రవీణ్ కుమార్ మాదిగ, గట్టగాళ్ల ప్రశాంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారిపై ఏసీబీ పంజా

వ్యవసాయ శాఖలో అవినీతి బాగోతం.. ఏసీబీకి చిక్కిన అధికారి

- రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ ఏవో రమేష్
- లంచం అడిగితే 10 64 కు ఫిర్యాదు చేయండి
- ఏసీబీ డిఎస్పి సుదర్శన్

సదాశివపేట, నవంబర్ 3 (జనంసాక్షి): ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ లంచం అడిగే అధికారులు మారడం లేదు. ఈమధ్య ఏసీబీ వలలో చానా శాఖల అధికారులు పట్టుబడినప్పటికీ అధికారులు మాత్రం తీరు మార్చుకోవడం లేదు. ఆయా శాఖల పని నిమిత్తం అధికారుల వద్దకు వచ్చిన వారికి మొహమాటం లేకుండా లంచం డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటన మంగళవారం సదాశివపేట పట్టణంలో జరిగింది. వివరాల్లోకెళ్తే సదాశివపేట వ్యవసాయ అధికారి (ఏవో) ఫర్టిలైజర్ దుకాణం యజమాని నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ సదాశివపేట మండల వ్యవసాయ అధికారి రమేష్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని ఓ ఎరువుల దుకాణం ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకునేందుకు దుకాణ యజమాని వ్యవసాయ అధికారి రమేష్‌ను సంప్రదించారు. ఇందుకు ఆయన రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఈ నెల 19న ముందుగా రూ.10 వేలు తీసుకోగా, మిగిలిన రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి డిఎస్పి సుదర్శన్ మాట్లాడుతూ.. ఏ శాఖ అధికారులైన లంచం డిమాండ్ చేస్తే 10 64 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.





ఆ వ్యాఖ్యలు సమస్యకు పరిష్కారం కాదు

హైదరాబాద్ (జనంసాక్షి) : విమాన టికెట్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు చేసినట్లు నివేదించబడిన 'విమానాల్లో ప్రయాణించకండి' అనే వ్యాఖ్య సమస్యకు పరిష్కారం కాదని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ అన్నారు. పండుగలు, అత్యవసర పరిస్థితులు, ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని విమానయాన సంస్థలు ఇష్టానుసారంగా ఛార్జీలు పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడాన్ని అనుమతించరాదని పేర్కొన్నారు. దేశీయ విమాన టికెట్ల ధరలు భారీగా పెరగడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

భారీ కొకైన్ నెట్‌వర్క్ గుట్టురట్టు

- డ్రగ్స్ సామ్రాజ్యంతో కొన్న రూ.2 కోట్ల ఆస్తులు గుర్తింపు

హైదరాబాద్ (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగిలో భారీగా సాగుతున్న కొకైన్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. విలాసవంతమైన ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్న ముఠా గుట్టును అధికారులు రట్టు చేశారు. ఈ కీలక ఆపరేషన్‌లో సైబరాబాద్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్, నార్సింగి లోకల్ పోలీసులు, ఈగల్ వింగ్ సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన ప్రత్యేక బృందాలు నిందితుల నుంచి 107.4 గ్రాముల కొకైన్‌తో పాటు 2 ఖరీదైన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాయి. స్వాధీనం చేసుకున్న కొకైన్ విలువ మార్కెట్‌లో రూ.లక్షల్లో ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ప్రధానంగా ఐటీ కారిడార్ పరిధిలోని ప్రముఖులు, యూత్ టార్గెట్‌గా ఈ డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కేసు విచారణలో మరో సంచలన వెలుగులోకి వచ్చింది. నిందితులు సుదీర్ఘకాలంగా డ్రగ్స్ విక్రయించగా వచ్చిన చట్టవిరుద్ధమైన ఆదాయంతో రూ.2 కోట్ల విలువైన స్థిరాస్తులు, ఇతర ఆస్తులను కొనుగోలు చేసినట్లుగా దర్యాప్తు బృందాలు గుర్తించాయి.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలపై విచారణ

'జనంసాక్షి' ఎఫెక్ట్.. కదిలిన అధికార యంత్రాంగం

- కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు నివేదిక



కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 3 (జనంసాక్షి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న నిర్మాణాల వ్యవహారంపై జనంసాక్షిలో వెలువడిన కథనం అధికార యంత్రాంగంలో కదలిక తెచ్చింది. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? పేదల భూముల విషయంలో చూపుతున్న కఠినత్వం ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎందుకు కనిపించడం లేదు? అనే ప్రశ్నలతో వెలువడిన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు అదనపు కలెక్టర్ గిరి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ పరిధిలో నిర్మాణాల అనుమతులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో నిబంధనలు అందరికీ ఒకేలా అమలవుతున్నాయా? లేక పలుకుబడి ఉన్నవారికి ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయ మా? అన్న సందే హాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. పేదల భూముల విషయంలో నిబంధనల పేరుతో కఠినంగా వ్యవహరించే అధికారులు ప్రభుత్వ భూమిలో జరుగుతున్న నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో సంబంధిత భూమి స్వరూపం, యాజమాన్య వివరాలు, నిర్మాణాల అనుమతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికార యంత్రాంగం దృష్టి సారించింది. విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిసింది. అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జనంసాక్షి కథనంతో విచారణకు కదిలిన యంత్రాంగం ఇకపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

వీబీజీ రామ్‌జీలో ఆల్‌టైమ్ రికార్డు

ఒకేరోజు ఐదు లక్షలకుపైగా కూలీలకు ఉపాధి

- ఉపాధి హామీ చరిత్రలోనే నవంబర్ తొలిసారి ఈ స్థాయిలో పని కల్పన
- ఇదే స్ఫూర్తితో మరిన్ని పనిదినాలు కల్పించాలి : మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 3 (జనంసాక్షి) : వీబీజీ రామ్‌జీ పథకం అమలులో తెలంగాణ సరికొత్త రికార్డు సృష్టించింది. నవంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షలకు పైగా కూలీలకు ఒకే రోజు ఉపాధి కల్పించడం విశేషం. ఈ స్థాయిలో ఒకే రోజున కూలీలకు పని కల్పించడం ఇదే తొలిసారి. ఈ రికార్డును కొనసాగిస్తూ, రానున్న రోజుల్లో మరిన్ని పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామాల్లో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టే పనులు, నీటి వనరుల అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతం వంటి పనులను చేపట్టాలని స్పష్టం చేశారు. కూలీలకు ఉపాధి కల్పించడం, నీటి వనరులను సంరక్షించడం, గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించడం అనే మూడు లక్ష్యాలతో ఉపాధి హామీ పనులు కొనసాగాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి, కూలీలకు నిరంతరం పని లభించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఉపాధి కల్పనతో గ్రామీణ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించడంతోపాటు గ్రామాల అభివృద్ధికి కూడా దోహదపడేలా పనుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు.

ఇంధన్‌పల్లి రేంజ్‌లో చిత్రీకరించిన వన్యప్రాణి పరిశోధకుడు డా. వెంకట్ అనగంధుల

కవ్వాల్ అడవుల్లో అరుదైన మచ్చల గుడ్లగూబ

జన్నారం, నవంబర్ 03 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ పరిధిలోని ప్రముఖ కవ్వాల్ టైగర్ రిజర్వ్ (ఇంధన్‌పల్లి రేంజ్) అటవీ ప్రాంతంలో అరుదైన 'మచ్చల అటవీ గుడ్లగూబ' కనిపించినట్లు వన్యప్రాణి పరిశోధకుడు డా. వెంకట్ అనగంధుల తెలిపారు. భారత ఉపఖండానికి మాత్రమే ప్రత్యేకమైన ఈ రాత్రిచర వేట పక్షిని ఆయన ప్రత్యక్షంగా కెమెరాలో చిత్రీకరించారు. ట్రిగిడే కుటుంబానికి చెందిన ఈ గుడ్లగూబ శరీరంపై గోధుమ, తెలుపు రంగుల మచ్చలు, పెద్ద గుండ్రని ముఖం, లోతైన నల్లని కళ్ళు కలిగి ఉంటుంది. మెడ, ఛాతీ, ఉదర భాగాలపై ఉండే అడ్డమైన గీతలు, మచ్చల వల్ల దీనికి 'మచ్చల అటవీ గుడ్లగూబ' అనే పేరు వచ్చింది. ఇవి పగటిపూట పెద్ద చెట్ల కొమ్మలు, దట్టమైన ఆకుల మధ్య విశ్రాంతి తీసుకుంటూ, రాత్రి వేళల్లో అద్భుతమైన చూపు, వినికిడి శక్తితో వేటాడుతాయి.

ఇవి ప్రధానంగా పొడి ఆకురాల్చే అడవులు, మిశ్రమ వనాలు, పొదలు, చెట్లతో నిండిన వ్యవసాయ భూముల్లో నివసిస్తాయి. ఉత్తర తెలంగాణలోని పొడి ఆకురాల్చే అడవులు, ముఖ్యంగా కవ్వాల్ అటవీ సరిహద్దు ప్రాంతాలు వీటి నివాసానికి అనుకూలంగా ఉన్నాయి. ఇవి ఎలుకలు, చిన్న క్షీరదాలు, చిన్న పక్షులు, బల్లులు, కప్పలు మరియు పెద్ద కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి.పంటలను నాశనం చేసే ఎలుకలను విశేషంగా వేటాడటం ద్వారా పంట నష్టాన్ని తగ్గించి, రైతులకు సహజ నివారిణిగా పనిచేస్తుంది. అలాగే ఎలుకల ద్వారా వ్యాపించే రోగాలను పరోక్షంగా అరికడుతుంది. ఆహార గొలుసు సమతుల్యతను కాపాడటంలో, అటవీ జీవవైవిధ్య నాణ్యతను సూచించడంలో ఈ పక్షులు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం ఐయూసీఎన్ రెడ్ లిస్ట్ ప్రకారం ఇది తక్కువ ముప్పు ఉన్న జాతిగా ఉన్నప్పటికీ, అడవుల నరికివేత, పాత పెద్ద చెట్ల తొలగింపు, వ్యవసాయ రసాయనాల వాడకం వల్ల వీటి స్థానిక నివాసాలకు ముప్పు పొంచి ఉంది. పాత పెద్ద చెట్లను, సహజ అటవీ వాతావరణాన్ని పరిరక్షించడం ద్వారానే ఇటువంటి అరుదైన జీవజాలాన్ని కాపాడుకోగలమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370